ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

మీ ఆర్థిక అవసరాల ఆశయసాధన
KAPIL GROUP కపిల్ చిట్స్ 45 years
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-11-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 280 పేజీలు: 12 వెల: 6.50

# ఢిల్లీలో ఉగ్రరాక్షసం



ఢిల్లీలో సోమవారం రాత్రి జరిగిన పేలుడుతో తగలబడుతున్న వాహనాలు

- ఎర్రకోటవద్ద కారులో పేలుడు
- సిగ్నల్ వద్ద ఆగగానే పేలిపోయిన కారు
- ఎనిమిది వాహనాలు పూర్తిగా ధ్వంసం
- వెంటనే ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించిన అమిత్‌షా
- దర్యాప్తు చేస్తున్న ఎన్ఐఎ, ఎన్ఎస్‌జి బృందాలు
- ఢిల్లీ, యుపి, హర్యానా, జమ్ము కాశ్మీర్, పంజాబ్, హైదరాబాద్, అమరావతిలో హై అలర్ట్

## 13 మంది మృతి, 24 మందికి తీవ్రగాయాలు

**న్యూఢిల్లీ, నవంబరు 10:** దేశంలో ఉగ్రవాదుల కుట్రలు భగ్నం అవుతున్న వేళ రాజధాని ఢిల్లీలో సోమవారం రాత్రి జరిగిన పేలుడు పెను ప్రకంపనలు సృష్టించింది. దేశంలో ఉగ్రవాద దాడులకు పాల్పడేందుకు కుట్రలు చేస్తున్న పలువురిని అరెస్ట్ చేయడం, వారి ప్రయత్నాలను ఫెయిల్ చేయడం వంటివి కట్టుదిట్టంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. హర్యానాలో జరిగిన సంఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా >>2



# లక్ష కోట్ల పెట్టుబడులు

- రాష్ట్ర కేబినెట్ ఆమోదం
- పేదలందరికి గృహనిర్మాణం
- అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ వ్యవస్థ
- పరిశ్రమలకు తగిన భూముల కేటాయింపు
- రాజధానిలో మౌలిక సదుపాయాలకు రూ. 1500 కోట్ల రుణం
- రెవెన్యూ శాఖలో 19 కొత్త పోస్టులు
- మంత్రిమండలి నిర్ణయాలు



సోమవారం సచివాలయంలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్,మంత్రులు అచ్చెన్న, నారా లోకేష్ తదితరులు

**విజయవాడ,నవంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని పేదలందరికీ గృహ సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. ఈ విషయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నివాస స్థలం లేని వారందరి అర్హుల జాబితా రూపొందించి అందరికీ హౌస్ సైట్స్ దక్కేలా చూడాలన్నారు. ఎపిలో సంవత్సరంలోగా నివాస స్థలం లేని వారికి లబ్ది చేకూరేలా ప్రభుత్వ చర్యలు ఉండాలని సూచించారు. ప్రభుత్వం చేసే మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు కూడా బాధ్యత తీసుకునేలా ఇన్చార్జ్ మంత్రులు చొరవ చూపాలని సిఎం దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం విషయంలో జాప్యం తగదని అన్నారు. త్వరితగతిన సమస్యల పరిష్కారానికి సరైన విధానం రూపొందించాలని సూచించారు. సిఎం చంద్రబాబు అధ్యక్షతన దాదాపు 70 అజెండా అంశాలతో సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గం భేటీ అయింది.ఈ సమావేశంలో పలు అంశాలపై మంత్రులతో సిఎం చంద్రబాబు చర్చించారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై మంత్రులకు దిశానిర్దేశం చేశారు.వైజాగ్ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ద్వారా యువతకు మనం ఏం చేస్తున్నామో తెలియజేయాలని సిఎం చంద్రబాబు అన్నారు. పాఠశాలల్లో వాళ్లకు ఎవరికైన ఆసక్తి ఉంటే వాళ్లు ఈ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ చూసే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకోసం మంత్రులు పనిచేయాలన్నారు. >>2

## జోగి రమేష్‌పై మరికొన్ని కేసులు

### రంగం సిద్ధం చేసిన సిఐడి

**విజయవాడ, నవంబరు 10, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో నకిలీ మద్యం తయారీ కేసు ఇప్పటికే అరెస్ట్ అయిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత,మాజీ మంత్రి జోగి రమేష్ పై మరిన్ని కేసుల నమోదు సిఐడి సిద్ధమవుతుంది.ప్రస్తుతం నెల్లూరు జిల్లా జైలులో రిమాండులో జోగి రమేష్ ఉన్నారు. ఆయన మరిన్ని కేసులు నమోదుకు రంగం సిద్ధమైనట్లుగా తెలుస్తోంది..తాజాగా అగ్రి గోల్డ్ భూముల కొనుగోలులో అక్రమాలపై కూడా మాజీ మంత్రి జోగి రమేష్‌పై సిఐడీ కొత్త కేసు నమోదు చేయనుంది ..అగ్రిగోల్డ్ భూముల అమ్మకాల్లో జోగి రమేష్ పాత్ర ఉన్నట్లు ఇప్పటికే గుర్తించినట్లు సిఐడీ అధికారులు. ప్రకటించారు. పెడనలో కూడా భూములు క్రయ విక్రయాల్లో జోగి రమేష్పఇ పలు ఫిర్యాదులు అందాయని చెబుతున్నారు. వీటిపై కూడా కేసు నమోదు చేసే అవకాశాలు సిఐడీ అధికారులు పరిశీలిస్తున్నట్లుగా తెలుస్తోంది. నకిలీ మద్యం తయారీ కేసులో వైఎస్సార్సీ సీనియర్ నేత,మాజీ మంత్రి జోగి రమేష్‌తో పాటు ఆయన సోదరుడు జోగి రామును కూడా పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఆయన నివాసంలో తెల్లవారుజామున జోగి రమేష్‌ను సిట్,పోలీసు,ఎక్సైజ్ సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అదుపులోకి తీసుకున్నాయి. కాగా,ఉద్దేశ్యపూర్వకంగానే తప్పును వీడియోలతో జోగి రమేష్‌ను ఈ కేసులో ఇరికించారని వైఎస్సార్సీ నేతలు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా వైఎస్సార్సీ నేతలను అరెస్ట్ చేసి వరుసగా కేసులు నమోదు చేసి జైలు నుంచి బయటకు రాకుండా చాలా రోజులు ఇబ్బంది పెట్టారని...ఇప్పుడు జోగి రమేష్ విషయంలో కూటమి సర్కార్ అదేతీరుగా ముందుకు పోతోందని వైఎస్సార్సీ నేతలు ఫైర్ అవుతున్నారు.

## ప్రతి ధాన్యం గింజ కొంటాం: మంత్రి నాదెండ్ల

**విజయవాడ,నవంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజ ఏ స్థితిలో ఉన్నా కొనుగోలు చేయాలన్నదే ప్రభుత్వం కీలక లక్ష్యంగా పెట్టుకుందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.ఏపీలో 2025-26 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు అనంతరం సిఎంఆర్ రైస్ నిల్వ కోసం అవసరమైన స్టోరేజ్ గోడౌన్ల ముందుగానే సిద్ధం చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. సచివాలయం రెండో బ్లాక్‌లోని సివిల్ సప్లైస్ మంత్రి ఛాంబరులో సోమవారం మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షన రైస్ మిల్లర్స్ ప్రతినిధుల సమావేశం జరిగింది. గత ఏడాది కూటమి ప్రభుత్వం రైతులకు న్యాయం చేయడంతో పాటు ధాన్యం కొనుగోలులో చరిత్ర సృష్టించిందన్నారు. ఈ సీజన్‌లో పౌర సరఫరాల శాఖకు 20 లక్షల మెట్రిక్ టన్నులు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు 14 లక్షల మెట్రిక్ టన్నులు రైస్ నిల్వ కోసం గోడౌన్లను సిద్ధం చేయాలని మంత్రి అధికారులకు >>2

# స్ఫూర్తిమంత్రం.. వందేమాతరం

- నాలుగు దశల్లో యేడాదిపాటు వందేమాతరం 150 వసంతాల వేడుకలు
- ప్రజలతో కలిసి గీతం ఆలపించిన సిఎం చంద్రబాబు
- దేశాన్ని ప్రమోట్ చేసేలా ప్రధాని మోడీ ఆలోచనలు: సిఎం



సోమవారం విజయవాడలో వందేమాతం ద్వివజ్రోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, నవంబరు 10, ప్రభాతవార్తప్రతినిధి:** వందేమాతరం స్ఫూర్తితో దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని సిఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. సోమవారం తుమ్మల పల్లి వారిక్షేత్రయ్య కళా క్షేత్రంలో సాంస్కృతిక శాఖ నిర్వహించిన వందేమాతరం 150 వసంతాల వేడుకల్లో సిఎం పాల్గొన్నారు. ఈ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను తిలకించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ప్రజలతో కలిసి వందేమాతరం గేయాన్ని ముఖ్యమంత్రి ఆలపించారు. ఎపి సాంస్కృతిక, సృజనాత్మశాఖ డైరెక్టర్ రెగుల్ల మల్లిఖార్జునరావు రచించిన బకించంద్ర చటోపాధ్యాయ జీవిత చరిత్ర చిరు పొత్తాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "వందేమాతరం నినాదంతో స్వాతంత్ర్యోద్యమం చేపట్టారు.. అందర్నీ ఏకతాటి మీదకు తెచ్చిన గేయం వందేమాతరం. బెంగాల్లోని కంఠలపారా అనే గ్రామంలో ఈ వందేమాతర గేయం పుట్టింది. బంకిమ్‌చంద్ర ఛటర్జీ ఈ గేయాన్ని రూపొందించారు. మాతృభూమిని దేవతలా భావించి 'వందే మాతరం' పాట రాశారు. అది జాతీయ భావానికి తొలి జ్యోతి అయ్యింది. తన రచన 'ఆనందమఠం' నవల ద్వారా దీనిని ప్రజల్లోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత కాలంలో వందేమాతరం గేయం స్వాంతంత్ర్యోద్యమ సంగ్రామంలో జాతీయ భావాన్ని రగిలించింది. వందేమాతరం ఉద్యమ గేయంగా మారింది... ప్రజలందర్నీ ఏకం చేసింది. 1950 జనవరి 24న వందేమాతరానికి జాతీయ గేయం హోదా ఇచ్చారు. ఏడాది పాటు వందేమాతరం ఉత్సవాలు జరపాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. నాలుగు దశలుగా ఈ ఉత్సవాలు జరుపుకుంటున్నాం. ప్రతి భారతీయుడు అనునిత్యం ఈ గేయాన్ని నెమరువేసుకోవాలి. లాలా లజపతి రాయ్, బాల గంగాధర్ తిలక్, భగత్ సింగ్ వంటి వారికి ఈ గేయం స్ఫూర్తినిచ్చింది. వందేమాతరం గీతానికి బ్రిటీష్ వాళ్లు భయపడ్డారు.. నిషేధించారు. అయినా ప్రజలు వెనుకడగు వేయలేదు. లాఠీఛార్జీలు, అరెస్టులు, తూటాలను ఎదుర్కొంటూ వందే మాతరం అంటూ నినదిస్తూ వీధులలోకి వచ్చారు. ఉప్పెనలా ఉద్యమం సాగింది. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా దేశం కోసం ఆ నినాదాన్ని వీడలేదు. చనిపోయేటప్పుడు కూడా వందేమాతరం అని నినదిస్తూ ప్రాణాలు వదిలారు. ఈ విశిష్ట గేయానికి 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా వేడకలు జరుపుకుంటున్నాం. ఈ వేడుకలు 2025 నవంబర్ 7నుంచి 2026 నవం >>2



తెలంగాణ రాష్ట్ర గీత రచయిత

## అందెశ్రీ కన్నుమూత

### నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

### తెలుగు సాహితీలోకానికి తీరని లోటు: సిఎం చంద్రబాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు10:** తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ రూపశిల్పి, ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ (64) కన్నుమూశారు. సోమవారం తెల్లవారు జామున లాలా >>2

# మొంథా తుఫాన్‌తో రూ. 6384 కోట్లు నష్టం

### రూ. 901 కోట్ల తక్షణ సాయం చేయండి

### కేంద్ర బృందాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం

### తుఫాన్ నష్టంపై ఆర్టీజీఎస్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్



తుఫన్ నష్టంపై ఆర్టీజీఎస్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న ప్రభుత్వ అధికార యంత్రాంగం

**విజయవాడ,నవంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** మొంథా తుపాను రాష్ట్రంలో అంచనాలకు మించి అపార నష్టం కలిగించిందని, కేంద్ర ప్రభుత్వం ఉదారత చూపి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బృందాన్ని కోరింది. మొంథా తుపాను వల్ల రూ.6384 కోట్ల నష్టం వాటిల్లిందని, రూ.901.4 కోట్లు తక్షణ సాయం చేసి ఆదకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. మొంథా తుపాన్ వల్ల వాటిల్లిన నష్టం మదింపు వేయడానికి కేంద్ర బృందం రాష్ట్రానికి వచ్చింది. కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ పాసుమీబసు, కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ కె. పొన్నుస్వామీల నేతృత్వంలోని 8 మంది సభ్యులతో కూడిన కేంద్ర బృందం సోమవారం ముందుగా అమరావతిలోని సచివాలయానికి వచ్చింది. ఈ బృందానికి సచివాలయంలోని ఆర్టీజీఎస్ లో అధికారులు స్వాగతం పలికారు. అనంతరం మొంథా తుపాను కలిగించిన నష్టం గురించి రెవెన్యూ శాఖ చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్‌లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మొంథా తుపాన్ రాష్ట్రంలోని 24 జిల్లాల్లో విధ్వంసం సృష్టించిందని తెలిపారు. అంచనాలకు మించిన అపార నష్టం కలిగించిందని జయలక్ష్మి చెప్పారు. వ్యవసాయరంగానికి మొంథా తుపాను తీవ్ర నష్టం కలిగించిందన్నారు. కోత దశకు వచ్చిన పంటలను తుపాను ముంచెత్తిందని దానివల్ల రైతులకు జీవనాధారమైన >>2



# కొత్త ఎమ్మెల్యేలకు పాఠాలు చెప్పండి

### పలువురు మంత్రులతో జరిపిన సమావేశంలో మంత్రి లోకేష్ వ్యాఖ్య

### విశాఖ సదస్సులో రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయి

**విజయవాడ,నవంబరు 10,పభాతవార్త ప్రతినిధి:** తొలిసారి గెలిచిన కొంతమంది ఎంఎల్ఏలకు మంచిచెడులు తెలియడం లేదని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ అన్నారు. అవగాహనా రాహిత్యం, అనుభవలేమితో సమన్వయం ఉండట్లేదని వ్యాఖ్యానించారు. ఉండవల్లి లోని సిఎం క్యాంపు కార్యాలయంలో పలువురు మంత్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. తొలిసారి గెలిచిన ఎంఎల్ఎలకు సీనియర్ ఎంఎల్ఎలకు సీనియర్ ఎంఎల్ఎలు, నేతలు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంఎల్ఏగా గెలిచిన కొత్తలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు?ఎలాంటి సమస్యలను అధిగమించి ఈ స్థాయికి వచ్చారనే విషయాలపై కొత్త ఎంఎల్ఎలకు అవగాహన అవసరమని చెప్పారు. కొత్తగా గెలిచిన ఎంఎల్ఎలు వరుస విజయాలు కొనసాగించాలంటే లోటుపాట్లు సరిచేసుకోవాలన్నారు.ఈ నెల 14,15 తేదీల్లో విశాఖ వేదికగా జరిగే పెట్టుబడుల భాగస్వామ్య సదస్సును కలిసికట్టుగా విజయవంతం చేద్దామని లోకేష్ పిలుపునిచ్చారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి దాదాపు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని చెప్పారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా,పరోక్షంగా లక్షలాది మందికి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రతి మంత్రీ తమ శాఖల పరిధి ఒప్పందాలకు సంబంధించి బాధ్యతతో వ్యవహరిద్దామని చెప్పారు.మంగళవారం నిర్వహించే ఎంఎస్ఎంఇ పార్కుల కార్యక్రమంలో మంత్రులంతా విధిగా పాల్గొనాలని సూచించారు. తమ జిల్లాల పరిధిలో సంస్థలు గ్రౌండ్ అయ్యేలా మంత్రులు,ఇన్‌ఛార్జి మంత్రులు బాధ్యత >>2

## కల్తీనెయ్యిలో కీలకం గత టిటిడి బోర్డు పెద్దలే!

### మార్కెటింగ్, కొనుగోళ్లవిభాగం అధికారులనుండి సిట్ కీలక సమాచారం

**తిరుమల, నవంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** దేవుని లడ్డూల తయారీలో 2020నుండి 2024వ సంవత్సరంవరకు కల్తీనెయ్యి సరఫరా జరిగిన కేసులో కీలకంగా గత టిటిడి బోర్డు పెద్దలే ఉన్నారనేది సిబిఐ సిట్ అధికారులు రాబట్టిన సమాచారం. ఈ కేసులో టిటిడి మార్కెటింగ్ విభాగం, కొనుగోళ్ల కమిటీలో అధికారుల నుండి సిట్ రాబట్టిన సమాచారంతో ఇప్పుడు ఇటీవల సిట్ అరెస్ట్‌చేసిన చిన్న అప్పన్న, అజయ్ కుమార్‌లను కస్టడీకి తీసుకునేందుకు ఎసిబి కోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. దీనిపై ఎసిబి న్యాయమూర్తి కస్టడీకి అప్పగిస్తే తదుపరి ఎవరి పేర్లు బయటకు రానున్నాయనేది తెలిసినా సిట్ అధికారికంగా స్పష్టతనీయలేదు. ఇప్పటికే కల్తీనెయ్యిలో గత బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి సంబంధించిన బ్యాంకు లావాదేవీల >>2



పేలుడు సంభవించిన ప్రాంతంలో పర్యటిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న భద్రతా దళాలు

# ఢిల్లీలో ఉగ్రరాక్షసం

>> మారింది. హర్యానాలో భారీ మొత్తంలో ఆర్డీఎక్స్ పట్టుబడటం దేశం మొత్తాన్ని వణికించింది. అయితే ఇది జరిగిన కొన్ని గంటల్లోనే దేశ రాజధానిలో భారీ పేలుడు చోటు చేసుకోవడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. ఇందుకు సంబంధించి అనుమానితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని ఇంటరాగేషన్‌చేస్తున్నారు. సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ వద్ద కారులో ఈ పేలుడు సంభవించినట్లు స్థానికులు వెల్లడించారు. ఎర్రకోట గేట్ నంబర్ వన్ మెట్రో స్టేషన్ వద్ద ఆపి ఉంచిన కారులో ఈ భారీ పేలుడు జరిగినట్లు ఢిల్లీపోలీసులు వెల్లడించారు. సోమవారం సాయంత్రం 6.52 గంటలకు ఈ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి పక్కనే ఉన్న 8 కార్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఈ పేలుడుతో సమీపంలో ఉన్న షాపులు కూడా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఇప్పటిదాగా 13మంది మృతి చెందగా వారి మృతదేహాలు ఛిద్రమైపోయాయి. శరీరభాగాలన్నీ చెల్లాచెదురుగా పడిపోయాయి. పేలుడు సంభవించగానే ఒక్కసారిగా మంటలు చెలరేగి అక్కడే ఉన్న 24 మందికిపైగా సామాన్య జనం తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే దగ్గర్లో ఉన్న ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. ఇక గాయపడిన వారిని పేలుడు ప్రాంతం నుంచి బయటికి లాక్కొచ్చినట్లు స్థానికులు వెల్లడించారు. ప్రమాద సమాచారం అందుకున్న ఫైర్, పోలీస్, ఇతర శాఖల సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు మరోవైపు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ కూడా రంగంలోకి దిగి గాలింపుప్రారంభించింది. ఎన్ఐఏ, ఎన్ఎస్‌జీ బృందాలు కూడా ప్రవేశించి దర్యాప్తు ప్రారంభించాయి. 7 ఫైర్ ఇంజిన్లను రంగంలోకి దింపి మంటలను అదుపు చేస్తున్నారు. పేలుడు జరిగిన ప్రాంతానికి 15 క్యాట్ అంబులెన్స్‌లు, వైద్యబృందాలుకూడా చేరుకున్నాయి. పేలుడు జరగడానికి కారణం ఇప్పటివరకూ వెలుగులోకి రాలేదు. గౌరిశంకర్ మందిర్‌కు సమీపంలో సాయంత్రం 6.55 గంటలప్రాంతంలో ఈపేలుడు జరిగిందని ఢిల్లీ ఫైర్ సర్వీస్ అధికారులు తెలిపారు. పేలుడు సమాచారం తెలుసుకున్న ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు ఆ ప్రాంతం మొత్తం తమ అధీనంలోకి తీసుకుని పరిస్థితిని అంచనా వేస్తున్నారు. తీవ్రంగా గాయపడినవారిని, మృతదేహాలను ఢిల్లీలోని ఎల్ఎన్‌జె ఆసుపత్రికి తరలించారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో 2900 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్న రోజే ఢిల్లీలో ఈ భారీ పేలుడు సంభవించడం గమనార్హం. దీంతో ఈ రెండు సంఘటనలకు ఏదైనా లింక్ ఉందా అనే కోణంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఢిల్లీ పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జమ్ముకాశ్మీర్‌లో పోలీసులు భద్రతా దళాలు మొత్తం ఏడుగురిని అరెస్టుచేసిన కొన్ని గంటలకే ఈ పేలుడు జరిగింది. జమ్ముకాశ్మీర్‌లో అరెస్టుచేసిన వారిలోజైషే మహ్మద్, అన్సర్ ఘజ్‌వాట్ ఉల్ హింద్ ఉగ్రసంస్థలకు చెందినవారే ఉన్నారు. వీరిలో ఇద్దరు డాక్టర్లు కూడా ఉండటం గమనార్హం. వారినుంచి భారీ ఎత్తున ఆయుధాలు, ఆయుధసామగ్రిని కూడా రికవరీచేసారు. వాటిలో ఎకె56 రైఫిల్, ఎకె క్రిన్‌కోవ్‌రైఫిల్, బెరెట్టా పిస్టల్ వంటివికూడా ఉన్నాయి. కారులో ఉంచిన పేలుడు సామగ్రిని రిమోట్‌సాయంతో పేల్చారా అన్న సందేహాలున్నాయి. ప్రతిసోమవారం ఢిల్లీలో పర్యాటకప్రాంతాలు, మార్కెట్లకు సెలవు కావడంతో భారీ ప్రమాదం తప్పింది. కాగా ఢిల్లీలో జరిగిన ఈ భారీ పేలుడుతో దేశం మొత్తం ఉలిక్కిపడింది. దీంతో ఢిల్లీ సహా దేశంలోని పలు నగరాల్లో హైఅలర్ట్ విధించారు. హరియానాలోని ఫరీదాబాద్‌లో సోమవారం ఉదయమే భారీ ఎత్తున పేలుడుసామగ్రి పట్టుకున్నారు. ఢిల్లీ, హరియానా, ఉత్తరప్రదేశ్‌లను కలిపే అన్ని సరిహద్దు కకేంద్రాలవద్ద పోలీస్ నిఘా పెంచారు. రైల్వేస్టేషన్లు, మెట్రోస్టేషన్లవద్ద కూడా భద్రత పెరిగింది. సరిహద్దుల్లో వాహనాలు, లాడ్జీలు, హోటళ్లను కూడా తనిఖీచేయాలని ఆదేశించారు. డిల్లీ సరిహద్దులు టిక్రీ, సింఘూ, బదర్‌పూర్‌సరిహద్దుల్లో అదనపు చెక్‌పోస్టులు, పోలీస్ పికెట్లు ఏర్పాటుచేసారు. అదేవిధంగా ఉగ్రమూకల చొరబాట్లు అత్యధికంగా ఉండే జమ్ముకాశ్మీర్‌లో భద్రతా బలగాలు హై అలర్ట్‌ప్రకటించాయి.

**హర్యానా రిజిస్ట్రేషన్‌తో హుండై ఐ20కారు...**

కాగా పేలుడుకు కారణమైన కారు హర్యానా రాష్ట్రానిదని గుర్తించారు. రిజిస్ట్రేషన్ నంబరు హెచ్‌ఆర్ 26, 7674గా ఢిల్లీపోలీసులు తెలిపారు. కొందరు ఐ20 అని చెపుతుంటే మరికొందరు మారుతి స్విఫ్ట్ డిజైర్ అంటున్నారు. నదీమ్‌ఖాన్ అనే వ్యక్తిపేరిట ఈ కారు రిజిస్టరు అయిఉంది. పేలుడు సమయంలో కారులో ముగ్గురున్నారని పోలీసులు గుర్తించారు. కాగాపేలుడు సంఘటనకు సంబంధించి అనుమానితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. అయితే వీరు ఎక్కడివారన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఇద్దరు అనుమానితులను ఎన్ఐఎ, ఢిల్లీపోలీసులు సంయుక్తంగా ఇంటరాగేషన్‌చేస్తున్నారు. అయితే ఉద్దేశ్యపూర్వకంగా జరిగిందా, ప్రమాదవశాత్తూ జరిగిందా అన్నది దర్యాప్తుజరుగుతున్నదని ఢిల్లీపోలీస్ కమిషనర్ సతీష్ గోల్చా అన్నారు.

**గతంలోనూ ఎర్రకోట, పలుచోట్ల పేలుళ్లు**

ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో గతంలోకూడా పేలుళ్లు జరిగాయి. 2021 జనవరి 29వ తేదీ ఢిల్లీ ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం సమీపంలో పేలుడు జరిగింది. అలాగే 2012 ఫిబ్రవరి 2వ తేదీ ఢిల్లీ హైసెక్యూరిటీప్రాంతంలో బాంబుదాడిలో ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం కారు ధ్వంసం అయి ఒక మహిళకూడా గాయపడ్డారు. 2011 సెప్టెంబరు ఏడో తేదీ ఢిల్లీ హైకోర్టుప్రవేశ ద్వారం వద్ద రిసెప్షన్‌ప్రాంతంలో బ్రీఫ్‌కేస్‌లో ఉంచిన శక్తివంతమైన బాంబు పేలింది. 15 మంది చనిపోగా 67 మందికిపైగా గాయపడ్డారు. 2011 మే 25వ తేదీ కూడా ఢిల్లీ హైకోర్టు వెలుపల కారుపార్కింగ్‌లో స్వల్పపేలుడు జరిగిందిప్రాణనష్టం అయితే జరగలేదు. అలాగే 2008 సెప్టెంబరు 27న కుతుబ్‌మీనార్‌సమీపంలోని మెహ్రౌలి పూలమార్కెట్‌లోపేలుడు జరిగి ముగ్గురుచనిపోగా 21 మంది గాయపడ్డారు. 2008 వరుసపేలుళ్లతో ఢిల్లీ దద్దరిల్లిపోయింది. కన్నాట్‌ప్లేస్, కరోల్‌బాగ్‌లోని గఫార్‌మార్కెట్, గ్రేటర్‌కైలాష్‌లోనిఎంబ్లాక్ మార్కెట్‌లలో 45నిమిషాల వ్యవధిలో ఐదు వరుసపేలుళ్లు జరిగాయి. 25 మంది చనిపోగా 100మందికిపైగా గాయపడ్డారు. 2006 ఏప్రిల్ 14వ తేదీ పాతఢిల్లీలోని జామా మసీదు ప్రాంగణంలో జరిగిన పేలుళ్లలో 14 మంది గాయపడ్డారు. 2005 అక్టోబరు 29న ఢిల్లీలోని సరోజిని నగర్ పహాడ్‌గంజ్‌మార్కెట్లు, గోవింద్‌పురి ప్రాంతంలో ఒక బస్సులో పేలుళ్లలో 59 మందికిపైగా మరణించారు. విదేశీయులు సహా 100 మందికిపైగా గాయపడ్డారు. అలాగే 2005 మే 22వ తేదీ ఢిల్లీలోని రెండు సినిమాహాళ్లలో చోటుచేసుకున్న వరుసపేళ్లులో ఒకరు మరణించగా 60 మంది గాయపడ్డారు. 2000వ సంవత్సరంలో జూన్18న ఎర్రకోట సమీపంలోనే రెండు బాబులు పేలి బాలికసహా ఇద్దరు మృతిచెంది పది మంది గాయపడ్డారు. 1998 జులై26వ తేదీ అంతర్‌రాష్ట్ర బస్ టెర్మినల్‌లోనిక శ్మీరీ గేట్‌వద్ద ఆగి ఉన్న బస్సులో భారీ పేలుడు జరిగి ఇద్దరుచనిపోయారు. 1997 చివరినెలల్లో వరుపేలుళ్లతో ఢిల్లీ వణికిపోయింది. ముగ్గురు చనిపోగా 150 మంది గాయపడ్డారు. నవంబరు 30న ఎర్రకోట ప్రాంలోనే రెండు పేలుళ్లుజరిగాయి. ముగ్గురుచనిపోయి 70 మంది గాయపడ్డారు. డిసెంబరు 30న పంజాబీబాగ్ సమీపంలో బస్సులో బాంబుపేలుడు రిగి నలుగురుచనిపోగా 30మందికిపైగా గాయాలపాలయ్యారు.



ఘటనా స్థలంలో వాహనాలు బూడిదైన దృశ్యం

# కొత్త ఎమ్మెల్యేలకు పాఠాలు చెప్పండి

>> తీసుకోవాలని లోకేష్ సూచించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీని త్వరగా నెరవేరుద్దామన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో 5వసారి 'భాగస్వామ్య సదస్సు'కు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. 'టెక్నాలజీ ట్రస్ట్ అండ్ ట్రేడ్ నావిగేటింగ్ ది న్యూ జియో ఎకనామిక్ ఆర్డర్' అనే థీమ్‌తో ఈ నెల 14, 15వ తేదీల్లో విశాఖలో సదస్సు జరగనుంది. పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడి పెట్టడానికి ఏం కావాలో అన్నింటినీ సమకూర్చేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, నీటి సౌకర్యాలను కల్పిస్తోంది. ఎపిఐఐసి ఆధ్వర్యంలో ల్యాండ్‌బ్యాంక్ ఏర్పాటు చేసి తక్కువ ధరకే పరిశ్రమలకు భూములను కేటాయిస్తున్నారు. ఆర్సెలార్ మిత్తల్, ఎన్టీపీసీ, టీసీఎస్, గూగుల్ సహా ఇతర ఐటీ కంపెనీలకు భూ కేటాయింపులు వేగంగా పూర్తిచేశారు. ప్రోత్సాహకాలు, రాయితీలు ప్రకటించడంతో పాటు, జీఎస్టీపైనా రాయితీని అందిస్తున్నారన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లలో రాష్ట్రం ముందంజలో ఉంది.

పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ కోసం సోలార్, విండ్, పంప్డ్‌స్టోరేజ్, గ్రీన్ ఎనర్జీలో టాటా, నవయుగ వంటి పెద్ద కంపెనీలు ఇప్పటికే 3.50 లక్షల కోట్ల రూపా యల పెట్టుబడులు పెట్టాయి. పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకునే పరిశ్రమలు గ్రౌండ్ అయ్యేలోగా పోలవరం ప్రాజెక్టుని పూర్తిచేసి నీటిని అందించనున్నారు. అదే విధంగా రాష్ట్రంలో ప్రస్తుతం విశాఖ, గంగవరం, కృష్ణపట్నం, కాకినాడ మేజర్ పోర్టులు ఉన్నాయి. నూతన పెట్టుబడులతో పరిశ్రమలు స్టార్ట్ అయ్యేసరికి మూలపట్నం, రామాయపట్నం, మచిలీపట్నం, కాకినాడ డీప్ వాటర్ యాంక రేజ్ పోర్టులు అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్యం అడుగులు వేస్తోంది. రహదారుల నిర్మాణం సైతం శరవేగంగా జరుగుతున్నాయి. ఇవన్ని ప్రజలకు వివరించాలన్నారు.

# తుఫాన్‌తో రూ. 6384 కోట్లు నష్టం

>> పంటలు నీట మునిగిపోయి కోలుకోలేని దెబ్బతీసిందన్నారు. 1.61 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, మినుము, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు చెప్పారు. అలాగే 6,250 హెక్టార్లలో ఉద్యానవన పంటలు, 17.72 హెక్టార్లలో మల్బరీ తోటలకూ నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ తుపాన్ కారణంగా మత్స్యకారులు కూడా బాగా దెబ్బతిన్నారన్నారు. 3063 హెక్టార్లలో చేపల చెరువులు ధ్వంసమయ్యాయని వివరించారు. తుపాను కారణంగా 4,566 ఇళ్లు దెబ్బతిన్నాయని, 1853 పాఠశాలలకు కూడా నష్టం వాటిల్లిందని వెల్లడించారు. ఆర్ అండ్ బీ శాఖకు సంబంధించి 4,794 కిలోమీటర్ల రోడ్లు, 311 వంతెనలు, కల్వర్టు దెబ్బతిన్నయాన్నారు. జలవనరుల శాఖకు సంబంధించి 3437 మైనర్ ఇరిగేషన్ పనులు, 2417 మేజర్ మరియు మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులకు నష్టం వాటిల్లిందన్నారు. ఈ వర్షాల వల్ల 58 అర్బన్ లోకల్ బాడీస్‌కు కూడా నష్టం వాటిల్లిందని చెప్పారు. ఈ విపత్తు కలిగించిన విధ్వంసం నుంచి బాధితులు కోలుకోవడానికి కేంద్ర ఉదారంగా వ్యవహరించాలని కోరారు. తుపానుకు సర్వం కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధితులు మళ్లీ కోలుకోవడానికి కేంద్రం అందించే సహాయం, సహకారం ఎంతో కీలకమని అన్నారు.

**680 డ్రోన్లు ఉపయోగించాం..**

రాష్ట్ర ప్రభుత్వం తుపాను ఎదుర్కోవడానికి ఎంతో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడం వల్ల పెద్దగా ప్రాణ నష్టం జరగకుండా నివారించగలిగామని అధికారులు వివరించారు. సహాయక కార్యక్రమాలు కూడా యుద్ధప్రాతిపదికన చేపట్టామని తెలిపారు. బుడమేరు వరదల అనుభవంతో ఈ సారి వరద సహాయక చర్యల కోసం 680 డ్రోన్లు ఉపయోగించామని చెప్పారు. అక్టోబరు 2729 వ తేదీల మధ్య 82.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని ఇది సాధారణ వర్షపాతం కంటే 9 రెట్లు ఎక్కువన్నారు. 443 మండలాల్లో ఈ తుపాన్ ప్రభావం చూపించిందని, ఈ విపత్తు కారణంగా 3 మృతి చెందారని, 9,960 ఇళ్లు నీట మునిగాయని, 1,11,402 మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. తుపాను సహాయక చర్యల్లో 12 ఎన్డీఆర్ ఎఫ్, 13 ఎస్డీఆర్ ఎఫ్ బృందాలను, 1,702 వాహనాలను, 110 మంది ఈతగాళ్లను వినియోగించామని వెల్లడించారు. 22 జిల్లాల్లో 2,471 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి1,92,441 మందికి పునరావాసం కల్పించామన్నారు.

# లక్ష కోట్ల పెట్టుబడులు

>> పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు ఉపరాష్ట్రపతి వస్తున్నారని.. పుట్టపర్తిని ఆధ్యాత్మిక కేంద్రంగా చేయాలని సూచించారు. ఈ సమ్మిట్‌కు ప్రెసిడెంట్, ప్రధాని, వైస్ ప్రెసిడెంట్, గవర్నర్లు, ముఖ్యమంత్రులు, చాలామంది వస్తున్నారని చెప్పారు. కూటమి ఎమ్మెల్యేలు ఎవరైనా తప్పు చేస్తుంటే.. ఇన్‌చార్జి మంత్రులు జోక్యం చేసుకుని సరిచేయాలని దిశానిర్దేశం చేశారు క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీ 2025-30, ఆంధ్రప్రదేశ్ సైబర్ హుడ్ వర్క్ స్పేస్ పాలసీ 2025- 30కి, డ్రోన్ సిటికి భూ కేటాయింపు విధానాలకు రాష్ట్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది. విశాఖలో ఈనెల 14, 15 తేదీల్లో జరిగే పెట్టుబడులు భాగస్వామ్య సదస్సు విజయవంతానికి చర్చ చేపట్టింది. వివిధ సంస్థలకు భూకేటాయింపులు, అభివృద్ధి పనులకు పాలనాపర అనుమతులు మంజూరు వంటి వాటిపై క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ఐటీ శాఖ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖలకు సంబంధించి 10కి పైగా అంశాలను క్యాబినెట్ ఆమోదించింది. విశాఖ, తిరుపతి, కుప్పం, కర్నూలు తదితర ప్రాంతాల్లో ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూని కేషన్ పరిశ్రమల ఏర్పాటుకు భూములు కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. 12వ పెట్టుబడులు ప్రోత్సాహక మండలి సమావేశంలో ఆమోదం తెలిపిన దాదాపు రూ.లక్ష కోట్లకు పైగా పెట్టుబడులను ఆమోదించింది. ఎపిఎడిసిఎల్‌కు హడ్కో రుణాల చెల్లింపు విషయంలో ప్రభుత్వ గ్యారెంటీ ఇచ్చే అంశానికి మంత్రివర్గం అంగీకారం తెలిపింది.

సత్ప్రవర్తన కలిగిన ముగ్గురు జీవిత ఖైదీలను విడుదలచేసే అంశంపై క్యాబినెట్ చర్చించింది. విశాఖలో ఈ నెల 14, 15వ తేదీల్లో నిర్వహించే పెట్టుబడుల భాగస్వామ్య సదస్సుకు సంబంధించి ఒప్పందాల్లో ప్రభుత్వం తరఫున సంతకాలు చేసే అధికారాలు బాధ్యత సర్దుబాటు అంశానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యవస్థ ఏర్పాటు సహా వివిధ సంస్థల ఏర్పాటు కోసం భూ కేటాయింపులకు సంబంధించి సిఆర్‌డిఎ ఆథారిటీ నిర్ణయాలను ఆమోదించింది. సిఆర్‌డిఎ సహా పట్టణాభివృద్ధి, మున్సిపల్ శాఖల్లో వివిధ పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకోనుంది. రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎపిపిఎఫ్‌సిఎల్ నుంచి రూ.1500 కోట్ల రుణం సిఆర్‌డిఎ పొందేందుకు మంత్రివర్గం అనుమతి ఇచ్చినట్లు సమాచారం. వివిధ పరిశ్రమల ఏర్పాటులో భూ కేటాయింపునకు రాయితీలు కల్పించే అంశంపై చర్చించి మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రెవెన్యూ శాఖలో ఆదనవు కమిషనర్, సంయుక్త కమిషనర్, డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ స్థాయిలో 19 కొత్త పోస్టుల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వివిధ సంస్థలకు కేటాయించిన భూమి లీజు గడువును పెంచే అంశంపై చర్చించింది అసైన్డ్ భూముల చట్టానికి ప్రతిపాదించిన పలు సవరణలకు చర్చించింది, కీలకనిర్ణయం తీసుకుంది.

**రాష్ట్ర మంత్రులకు సిఎం చంద్రబాబు అభినందనలు, కీలక సూచనలు**

క్యాబినెట్ సమావేశంలో మంత్రులను సిఎం చంద్రబాబు అభినందించారు. మొంథా తుఫాను సమయంలో క్షేత్ర స్థాయిలో బాగా పనిచేశారని మంత్రులను సిఎం ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఒక్కరూ క్షేత్ర స్థాయిలో ఉండి ప్రజలకు తక్షణ సాయం అందేలా చేశారన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అధికార యంత్రాంగం పూర్తి సమన్వయంతో పనిచేయడం వల్లనే తుఫాను సహాయక చర్యలు వేగంగా అందాయని తెలిపారు. ఆర్టీజీ సెంటర్ నుంచి నిరంతర పర్యవేక్షణ, టెక్నాలజీ సహాయంతో ప్రాణ, ఆస్థి నష్టాన్ని చాలా వరకు తగ్గించగలిగామని అన్నారు. మంత్రులు, అధికారులు, యంత్రాంగం టీం స్పిరిట్‌తో పనిచేస్తే ఇటువంటి మంచి ఫలితాలే వస్తాయని అభినందనలు తెలిపారు. అంతా ఎలా కష్టపడి పనిచేశారో స్వయంగా చూశానంటూ మంత్రులకు సిఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఇక తాము ఇన్‌చార్జీలుగా ఉన్న జిల్లాపై మంత్రులు దృష్టిపెట్టాలని సిఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

# అందెశ్రీ కన్నుమూత

>> గూడలోని తన నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అందెశ్రీ కలం నుంచి జాలువారిన జయ జయహే తెలంగాణ గీతాన్ని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర అధికారిక గీతంగా గుర్తించిన విషయం తెలిసిందే. తన పాటలు, రచనలతో ఆయన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఉద్యమ సమయంలో ఆయన గీతాలు ప్రజల్లో స్ఫూర్తిని రగిలించాయి. 1961, జూలై 18న ఉమ్మడి వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తిలో (ప్రస్తుతం సిద్దిపేట జిల్లా) అందెశ్రీ జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లన్న. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేశారు. పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారు. 'మాయమై పోతున్నడమ్మ మనిషన్నవాడు' అనే పాటతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆశుకవిత్వం చెప్పడంలో దిట్ట అయిన అందెశ్రీ.. ప్రజాకవి, ప్రకృతి కవిగా ప్రసిద్ధి చెందారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తన పాటలతో ప్రజలను ఉత్తేజితులను చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ్ణతోపాటు ఎన్నో పాటలు రాశారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 2006లో గంగ సినిమాకు నంది పురస్కారం అందుకున్నారు. 2014లో అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్, 2015లో దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కరం, లోక్‌నాయక్ పురస్కారం అందుకున్నారు. ఇటీవల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆయనకు రూ.కోటి పురస్కారం, ఇంటి స్థలం, తామ్రపత్రం అందజేసింది. మాయమైపోతున్న మనిషి తనాన్ని తట్టిలేపినవాడు.. ఒక అనాథగా పెరిగి.. పశువులను కాసి.. అక్షర జ్ఞానం లేకపోయినా.. తనకు ఎదురైన సమస్యలనే అక్షరంగా మార్చి.. తన కవితలతో, రచనలతో ఎంతో మందిని ప్రభావితం చేసిన వ్యక్తి అందెశ్రీ.. ఆయన మరణం అందరిని కలచివేసింది. 'అందె శ్రీ మరణం మన సాంస్కృతిక, మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటు. ఆయన ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయి. ఒక గొప్ప కవి, మేధావి అయిన ఆయన, ప్రజల పోరాటాలకు , ఆకాంక్షలకు , అకుంఠిత స్ఫూర్తికి గొంతుకగా నిలిచారు. ఆయన పదాలకు హృదయాలను కదిలించే శక్తి, అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను ఏకం చేసే శక్తి, ప్రజల సాంఘిక హృదయస్పందనకు రూపం ఇచ్చే శక్తి ఉన్నాయి. ఆయన సామాజిక స్పృహను, సాహితీ సౌందర్యంతో మిళితం చేసిన విధానం అద్వితీయం. వారి కుటుంబసభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. ఓం శాంతి' అంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలుగులో ట్వీట్ చేశారు. అందెశ్రీ ఆకస్మిక మరణం పట్ల సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతం 'జయజయహే తెలంగాణ రాసిన సమయంలో అందెశ్రీతో జరిపిన సంభాషణలను గుర్తుచేసుకున్నారు. తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలిందని చెప్పారు. స్వరాష్ట్ర సాధనలో అందెశ్రీ చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా, అందెశ్రీ అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

మంగళవారం ఘట్కేసర్ ఎన్ఎఫ్‌సి నగరంలో అందెశ్రీ అంత్యక్రియలు జరుగనున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగు సాహితీ లోకానికి అందెశ్రీ అందించిన సేవలు చిరస్మరణీయమని వారు కొనియాడారు. అందెశ్రీ ఆకస్మిక మృతిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణకు రాష్ట్ర గీతాన్ని అందించిన డాక్టర్ అందెశ్రీ మరణ వార్త దిగ్భ్రాంతిని కలిగించిందని తెలిపారు. తెలుగు సాహితీ లోకానికి ఇది తీరని లోటని చెప్పుకొచ్చారు. అందెశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. వారికుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని సీఎం చంద్రబాబు తెలిపారు.

## వారం - వర్జ్యం

**11-11-2025, మంగళవారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం శరదృతువు, కృష్ణపక్షం**
సప్తమి రా.11.14
పుష్యమి సా.6.24, విశాఖ కార్తె
వర్జ్యం : ఉ.7.21-8.58
దు.ఉ.8.27-9.13
2) రా.10.09 - 10.55
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** పోటీ ప్రపంచంలో ముక్కు సూటితనం కన్నా లౌక్యం అవసరమని ఋజువు చేస్తాయి. పెట్టుబడుల విషయంలో తొందరపాటు వద్దు.

**వృషభం:** ఆత్మ సాక్షికి విరుద్ధంగా ఏపని చేయరు. ఆహార నియమాలు పాటించండి. ఆరోగ్య, కుటుంబ సమస్యల నుండి బయటపడతారు.

**మిథునం:** నిలిపివేసినటువంటి విద్యా కళా సంబంధమైన వాటిని పునఃప్రారంభిస్తారు. విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**కర్కాటకం :** సున్నితమైన మనస్తత్వం ఇబ్బందికి గురి చేస్తుంది. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వాహనాలు కొనుగోలు చేస్తారు.

**సింహం:** కుటుంబ సభ్యుల సహాయంతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. ఇతరుల విషయాలలో జోక్యం తగదు.

**కన్య:** ఆరోగ్య, వాహనాల విషయాలలో మెలకువ పాటించండి. వివాదాలకు దూరంగా వుండండి. నూతన వ్యవహారాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు.

**తుల :** కొన్ని అవకాశాలు అనుకోకుండా లభిస్తాయి. వీటిని చేజార్చుకోకండి. ఆస్తి విషయాలలో నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**వృశ్చికం:** పాతమిత్రులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు. ఉద్యోగులలో ఇంక్రిమెంట్లు, పదోన్నతులు పొందుతారు.

**ధనుస్సు:** దూరపు బంధువుల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఒడిదుడుకులు కొంతవరకు తీరుతాయి.

**మకరం:** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. ఉద్యోగయత్నాలు సాగిస్తారు. ఆకస్మిక బదిలీలు ఉంటాయి. వస్తువులు కొనుగోలు చేస్తారు.

**కుంభం:** శత్రువులు సైతం మిత్రులుగా మారి సహాయం అందిస్తారు. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. శ్రమ అధికం.

**మీనం :** సంతానపరంగా సంతృప్తిని కలిగి వుంటారు. బంధువుల కలయిక. నూతన భాగస్వామ్య వ్యాపారాలు ప్రారంభిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# స్ఫూర్తిమంత్రం.. వందేమాతరం

>> బర్ 7 వరకు ఏడాది పాటు జరుగుతాయి. మొత్తం నాలుగు దశలుగా ఈ ఉత్సవాలు నిర్వహించుకుంటున్నాం. మొదటి దశ నవంబర్ 7 నుంచి 14 వరకు ప్రారంభ వారోత్సవంగా జరుపుతున్నాం. రెండో దశ - 2026 జనవరి 19 నుంచి 26 వరకు... మూడో దశ - 2026 ఆగస్టు 7 నుంచి 15 వరకు... నాలుగో దశ - 2026 నవంబర్ 1 నుంచి 7 వరకు జరుపుకుందాం. 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వాతంత్ర్య ఉద్యమంలో ఈ గేయం ఇచ్చిన స్ఫూర్తిని అనునిత్యం గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది." అని ముఖ్యమంత్రి చెప్పారు.

**దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా ప్రధాని ఆలోచనలు..**

ప్రతి భారతీయుడు గర్వించేలా ప్రధాని పాలన చేస్తున్నారు. మేకిన్ ఇండియా కార్యక్రమాలు ఓవైపు, యోగా వంటి కార్యక్రమాలు మరోవైపు చేపట్టి భారత దేశ కీర్తిని ప్రపంచం మొత్తం చాటారు. విశిష్టమైన ఈ గేయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కార్యక్రమం ప్రకటించిన ప్రధానికి ధన్యవాదాలు. మన సంస్కృతీ సాంప్రదాయాలను, మన పోరాటాలను, చరిత్రను ప్రపంచానికి తెలుపుతున్నారు. ప్రపంచ స్థాయి ఉత్పత్తులను మనం తయారు చేసుకోవాలి. 11వ స్థానంలో ఉన్న భారత దేశం.. ప్రస్తుతం నాలుగో అతిపెద్ద వ్యవస్థగా మారింది. మరికొన్ని రోజుల్లో 3వ వ్యవస్థగా మారుతుంది. 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మారుస్తాం. దేశం నాకేమి ఇచ్చిందని కాదు.. దేశానికి నేనేం చేశానని ఆలోచిస్తే సమస్యలు పరిష్కారమవుతాయి. ప్రతి ఒక్క పౌరుడూ బాధ్యతగా ఉండాలి." అని సీఎం అన్నారు.

# కల్తీనెయ్యిలో కీలకం గత టిటిడి బోర్డు పెద్దలే!

>> వివరాలను సమర్పించాలని సిట్ ఆదేశించింది.

మరీ న్యాయమూర్తి ఆదేశాలతో తదుపరి సిట్ చర్యలకు సిద్దమవుతోంది. కల్తీనెయ్యి సరఫరా చేసిన బాగోతంలో రానున్న రోజుల్లో కీలకంగా వ్యవహరించిన కొందరు సూత్రధారులతోబాటు టిటిడి అధికారుల పాత్రను తేల్చేయనుంది. గతంలోనే టిటిడికి తిరుమల లడ్డూలకు అవసరమైన నెయ్యి సరఫరాకు టెండర్లు పిలవడం, టెండర్లలో పాల్గొన్న డెయిరీ సంస్థల యాజమాన్యం టిటిడి నిబంధనలు ఉల్లంఘించి నాణ్యతలేని నెయ్యిసరఫరాచేయడం వెనుక కీలక వ్యక్తులు పట్టుకోవడం సిట్‌కు సాహసంతో కూడిన విషయం. గత టిటిడి బోర్డు పెద్దలు, మాజీ అధికారుల అరెస్ట్ తప్పదనేది తెలుస్తోంది. ఈ వారంలో సిట్ దర్యాప్తు, ఎవరిని పిలిచి అరెస్ట్ చేయనుందనేది టిటిడిలో హాట్‌టాఫిక్‌గా మారింది. కల్తీనెయ్యి సరఫరాచేసిన పాపంలో అసలు సూత్రధారులైన గత టిటిడి పెద్దల అవినీతిగుట్టు రట్టయ్యే అవకాశం కూడా ఉండటంతో సిబిఐ సిట్ అధికారులు అన్ని కోణాల్లో కార్యాచరణ సిద్దంచేసుకొంటున్నారు.

# ప్రతి ధాన్యం గింజ కొంటాం: మంత్రి నాదెండ్ల

>> సూచించారు. డ్రైయర్ల సౌకర్యాలు ఉన్న రైస్ మిల్లులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి గోడౌన్ వద్ద నిరంతర నిఘా ఉండేలా తి। కెమెరాలు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. జిల్లాల వారీగా రైస్ మిల్లర్లు 1:2 బ్యాంక్ గ్యారంటీలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఇందుకు సుమారు 35 బ్యాంకులు సేవలు అందిస్తున్నాయని తెలిపారు. సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సివిల్ సప్లైస్ మేనేజింగ్ డైరెక్టర్ ఢిల్లీ రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై సెక్రటరీ సౌరభ్ గౌర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సెక్రటరీ సూరిబాబు, నాయకులు సత్యనారాయణరాజు, వీరయ్య, లలిత శ్రీనివాస్, పట్టాభి శ్రీనివాస్, సివిల్ సప్లై అధికారులు ఉన్నారు.

# చలికి వణుకుతున్న తెలంగాణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబర్10:** తెలంగాణ రాష్ట్రంలో శీతల గాలులు వీస్తున్నాయని, వాటి ప్రభావంతో చలి తీవ్రత పెరిగిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉత్తర తెలంగాణ జిల్లాలపై చలి ప్రభావం అధికంగా ఉందని వాతావరణ శాఖ అధికారి ధర్మరాజు తెలిపారు. సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు తెలిపారు. నాలుగైదు రోజుల్లో చలి తీవ్రత మరింత పెరుగుతుందన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 12.5 డిగ్రీలుగా నమోదైందని, రానున్న నాలుగు రోజుల్లో మరింతగా తగ్గుతాయని స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో చలి తీవ్రత అధికంగా ఉంటుందని, పొగ మంచు, శీతల గాలుల కారణంగా రాత్రి పూట చలి ఎక్కువగా ఉంటుందన్నారు. చీప్నిజి

11-11Pg3exHMNWJQECKP 3_11-11Pg3exHMNWJQECKP.qxd 10/Nov/25 11:33 PM Page 1



# ముందు అవగాహన.. ఆ తర్వాతే చలానా



ఆర్టీజీఎస్‌పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**ట్రాఫిక్ నిబంధనల అమల్లో సరికొత్త మోడల్ అమలు**
**రోడ్డు ప్రమాదాలు, తొక్కిసలాటలు, అగ్నిప్రమాదాల నివారణపై ఫోకస్ పెట్టండి**
**ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సిఎం చంద్రబాబు ఆదేశాలు**

**విజయవాడ నవంబర్ 10, ప్రభాతవార్తప్రతినిధి:** రోడ్డు ప్రమాదాల నివారణపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. నిబంధనల ఉల్లంఘనలపై అవగాహన కల్పించిన తర్వాతే చలానా విధించే అంశాన్ని పరిశీలించాలని స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్‌పై ముఖ్యమంత్రి సమీక్షి ంచారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి దాని ఆవశ్యకతను వివరించాలని సూచించారు. భారీ ఎత్తున చలానాలు వేయాలన్న అధికారుల ప్రతిపాదనలను సీఎం సున్నితంగా తిరస్కరించారు. చలానాలు వేసి ప్రజలను భయ భ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. ఈ క్రమంలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ముందుగా హెల్మెట్లు, సీట్ బెల్ట్ లేకుండా వాహనాలు నడిపే వారికి అవగాహన కల్పించడంతోపాటు... వారు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారనే విషయాన్ని వారి ఫోన్లకు మెసేజీలు పంపాలని సూచించారు. ఆ తర్వాత కూడా వారి నిబంధనలు ఉల్లంఘిస్తుంటే అప్పుడు చలానాలు వేయాలని స్పష్టం చేశారు. దీని వల్ల నిబంధనలు ఉల్లంఘించిన వారికి తాను తప్పు చేసినందు వల్లే చలానాలు వచ్చాయనే భావన కలుగుతుందని చెప్పారు. ఇందులో కేరళ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో జరిగిన వరుస రోడ్డు ప్రమాదాలు, తొక్కిసలాట, అగ్ని ప్రమాదాలు వంటి అంశాలను సీఎం ప్రస్తావించారు. ఇలాంటివి జరగ్గకుండా ఉండేలా పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి... నిర్మాణత్మక ప్రణాళికను తయారు చేయాలని నిర్దేశించారు. దీనికి సంబంధించి ఎస్ఓపీలను సిద్ధం చేసి వారం రోజుల్లోగా అందివ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు. జన సమూహాల్లో తొక్కిసలాటలు జరగకుండా క్రౌడ్ మేనేజ్మెంట్‌ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా రోడ్డు ప్రమాదాలను ఏ మేరకు నియం త్రించగలమనే అంశాన్ని కూడా విశ్లేషించాలని చెప్పారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు, డ్రైనేజీలు, నీటి నిర్వహణ, ఉద్యోగ, ఉపాధి కల్పన, పంటలకు మద్దతు ధర... ఇవే తన ప్రాధాన్యతలని స్పష్టంగా చెప్పారు. అధికారులు ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రాధాన్యతలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. ఇప్పటికీ రోడ్లు సరిగా లేవనే ఫీడ్ బ్యాక్ వస్తుందని అలా జరగకుండా చూసుకోవాలని చెప్పారు. గత పాలనలో రహదారుల నిర్వహణ కూడా పట్టించు కోలేదని... ఆ నిధులను వేరే కార్యక్రమాలకు మళ్లించారన్నారు. అందువల్లే రహదారులు దారుణంగా ఉన్నాయన్నారు. కారణలేమైనా.. రోడ్లపై గుంతల్లేకుండా చూడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వం ఉందన్నారు. తక్షణం ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇదే విధంగా డ్రైనేజీల నిర్వహణ కూడా సరిగ్గా చేపట్టాలన్నారు. నిర్వహణ సరిగా లేకపోవడం కారణంగా నీళ్లు నిలిచిపోయే పరిస్థితి రాకూడదని సీఎం స్పష్టం చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా జాబ్ మేళాలు నిర్వ హించాలన్నారు. వాటి గురించి నిరుద్యోగ యువతకు తెలిసేలా విస్తృతంగా ప్రచారం చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని, రైతులకు సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు.

## వ్యక్తిగత హాజరు మినహాయింపు ఇవ్వాలన్న జగన్ అభ్యర్థనపై కౌంటరు దాఖలు చేయండి

### సిబిఐకి హైకోర్టు ఆదేశాలు

**విజయవాడ,నవంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యక్తిగత హాజరు మినహాయింపు ఇవ్వాలన్న వైఎస్ జగన్ అభ్యర్థనపై కౌంటరు దాఖలు చేయాలని సీబీఐని హైదరాబాద్ సీబీఐ కోర్టు ఆదేశించింది. గత నెలలో యూరప్ పర్యటనకు వెళ్లేందుకు జగన్‌కు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. అయితే యూరప్ నుంచి వచ్చిన తర్వాత ఈనెల 14 వరకూ వ్యక్తిగతంగా వచ్చి పర్యటన వివరాలు తెలపాలని జగన్‌కు సీబీఐ కోర్టు షరతు విధించింది. యూరప్ వెళ్లి వచ్చిన జగన్ వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ సీబీఐ కోర్టులో పిటిషన్ వేశారు. తాను కోర్టుకు వస్తే భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేయాల్సి వస్తుందని తెలిపారు. అందుకే హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని లేదా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుకు అనుమతివ్వాలని కోరారు. జగన్ అభ్యర్థనపై స్పందించాలని సీబీఐని ఆదేశిస్తూ న్యాయస్థానం విచారణను రేపటికి వాయిదా వేసింది. యూరప్ పర్యటనకు వెళ్లి వచ్చాక కోర్టులో హాజరుకావాలన్న ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని కోరుతూ అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడైన వైఎస్ జగన్ గత గురువారం హైదరాబాద్ సీబీఐ కోర్టులో మెమో దాఖలు చేశారు. అక్టోబరు 1 నుంచి 30లోగా 15 రోజులపాటు జగన్ యూరప్ పర్యటన నిమిత్తం సీబీఐ కోర్టు అనుమతి ఇస్తూ వెళ్లే ముందు పర్యటన వివరాలు, ఫోన్ నంబరు, ఈమెయిల్ వివరాలు సమర్పించాలన్నారు.

# తిరుమల సమాచారం

## కొండపై ఉన్న సిసికెమెరాలు ఐసిసిసితో అనుసంధానం

- క్యూలైన్ల నిర్వహణ మరింత పటిష్టం - అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,నవంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ హిందూ పుణ్యక్షేత్రం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి రోజూ లక్షమందివరకు భక్తులు వస్తుండటంతో భద్రతను మరింత కట్టుదిట్టంచేసే స్థాయిలో టిటిడి అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా దర్శన క్యూలైన్లను పటిష్టంగా నిర్వహించడంతోబాటు వైకుంఠం క్యూకాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు, లోపల, బయట క్యూలైన్లలోని సిసికెమెరాలను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. ఈ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మరింతగా బలోపేతం చేసేందుకు అధునాతన సాంకేతిక అభివృద్ధిచేసేందుకు చర్యలుతీసుకోవడంపై అధికారులతో ఆయన చర్చించారు. భక్తుల కదలికలపై ,భక్తుల గణాంకాలను ఎప్పటికప్పుడు విశ్లేషించి నిర్ణయాలు తీసుకుని సదుపాయాలు కల్పించేలా చూడాలన్నారు. సోమవారం తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, వింగ్ విఎస్ఒ ఎస్టీవిరామ్‌కుమార్, విఎస్ఒ అల్లంసురేంద్ర, ఐటి జిఎం ఫణికుమార్‌నాయుడు, డిప్యూటీ ఇఒ లోకనాథం, డిజిఎం ఐటి వెంకటేశ్వర్‌నాయుడు, కార్య ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు జయప్రసాద్, రవి తదితరులతో అదనపు ఇఒ వెంకయ్యచౌదరి సమీక్షించారు. విజిలెన్స్, వైకుంఠం, ఆలయ సిబ్బంది క్యూలైన్లలో భక్తుల సౌకర్యాలు, రద్దీ తదితరవాటిని నిరంతరం పర్యవేక్షించడం సులభమవుతుందన్నారు.

## స్వామివారి ఆశీస్సులందుకున్నా : జస్టిస్ రజని



**తిరుమల,నవంబర్ 10ప్రభాత వార్తప్రతినిధి:** కార్తీక మాసంలో సోమవారం రోజు శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం మన స్సు ఆనందంగా ఉందని రాష్ట్ర ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజని తెలిపారు. విఐపి బ్రేక్‌లో ఆమె కుటుంబంతో కలసి ఆలయం లోనికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు.

## తిరుమల, తిరుపతిలో భద్రత దళాలు నిఘా



**తిరుమల,నవంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** దేశరాజధాని ఢిల్లీనగరంలో సోమవారం సాయంత్రం ఎర్రకోటవద్ద భారీ బాంబులు పేలడంతో పుణ్యక్షేత్రాల్లో హై అలర్ట్ ప్రకటించింది. కేంద్ర హోంశాఖ ఆదేశాలతో రాష్ట్ర హోంశాఖ ఉన్నతాధికారులు తిరుపతి జిల్లా పోలీసులను అప్రమత్తం చేసింది. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆగమేఘాలపై తిరుమల, తిరుపతితోబాటు శ్రీకాళహస్తి క్షేత్రాల్లో పోలీస్ అధికారులను, ఏఆర్ బలగాలను, ఆక్టోపస్ దళాలను రంగంలోకి దించారు. తిరుమల ఆలయం పరిసరాల్లో మరింతగా నిఘా పెంచారు. తిరుమలకు వచ్చే అలిపిరి టోల్‌గేట్‌లో, కొండపై జిఎన్‌సి టోల్‌గేట్‌లో ఆక్టోపస్ దళాలు పహరాకాస్తూ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటికే ఆధ్యాత్మిక నగరం, యాత్రాస్థలం తిరుపతినగరంలో గతంలో కొద్దిరోజులుగా నకిలీ మెయిల్స్ బాంబు బెదిరింపులు భయపెట్టాయి. వెంటనే పోలీసు అధికారులు, బాంబుడిస్పోజల్ టీమ్ పోలీసులు, పోలీసు జాగిలాలు అణువణువూ నిశితంగా తనిఖీలు చేశారు. ఎక్కడా ఎలాంటి బాంబులు లేవని తేలడంతో అంతా ఊపిరిపీల్చుకుంటున్నారు. తిరుమల తిరుపతి నగరం ప్రాముఖ్యతతో 24గంటలూ పోలీసు విభాగంఅప్రమత్తంగా వ్యవహరిస్తూ ఉంది. నగరం శివార్లలో, ప్రధాన వాణిజ్యసంస్థలు, హోటళ్ళు, లాడ్జీలు, స్టార్‌హోటళ్ళు, నగరానికి ప్రధాన ప్రవేశ కూడళ్ళు, నగరం అంతా అత్యాధునిక నిఘానేత్రాలు డేగకళ్ళతో పహరాకాస్తున్నాయి. ఈ నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానం పోలీసులు మరింతగా వినియోగించుకుని ప్రజలకు భద్రత కల్పిస్తున్నారు. నగరంలో డ్రోన్ కెమెరాలతో కూడా పోలీసు యంత్రాంగం 24గంటలూ పహరాకాస్తోంది. ఇప్పుడు కేంద్రహోంశాఖ హెచ్చరికలతో మరింతగా అలర్ట్ అయ్యారు.

## నిందితుడి పట్ల ఉదాసీనత ఎందుకు చూపారు?

- ఎఫ్ఐఆర్ తరువాత అరెస్ట్ చేయలేదెందుకు?
- పోలీసు అధికారులను విచారణ చేసిన సిఐడి



**తిరుపతి,నవంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణిలో 2023 ఏప్రిల్‌నెలలో అమెరికన్ డాలర్లు చోరీ కేసుపై ఎఫ్ఐఆర్ చేసినా నిందితుడైన సివి రవికుమార్‌ను ఎందుకు అరెస్ట్ చేయలేక పోయారని, ఈ కేసులో నిందితుడిపట్ల ఉదాసీనత చూపాల్సిన అవసరం ఏ ముందని సిఐడి అధికారులు పూర్వ తిరుమలలో పనిచేసిన ప్రస్తుత విఆర్‌లో ఉన్న సిఐ జగన్మోహన్‌రెడ్డిని, ఎస్ఐ లక్ష్మీరెడ్డిని ప్రశ్నించినట్లు సమాచారం. ఈ కేసులో మీపై ఎవరైనా ఒత్తిడి చేశారా, టిటిడి అధికారులు ,అప్పటి బోర్డు కలుగజేసుకుందా అనే ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టినట్లు తెలిసింది. చట్టపరంగా మీకున్న అధికారాలను ఎందుకు ఉపయోగించుకోలేకపోయారని అడిగిన దానికి సమాధానం తీసుకున్నట్లు, ఈ వ్యవహారం మొత్తం పరకామణి కేసు దర్యాప్తు చేపట్టిన సిఐడి బృందం వీడియో రికార్డు చేసినట్లు తెలుస్తోంది. 2023 ఏప్రిల్‌లో పరకామణిలో గుమస్తాగా ఉన్న సివి రవికుమార్ ఏకంగా 920 విదేశీ డాలర్లు, 11నోట్లు చోరీ చేసిన తరువాత అప్పటి ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్ ఫిర్యాదుపై ఎలా స్పందించారని వివరాలు సేకరించారు. తదనంతరం ఆధారాలు సేకరించి ఎఫ్ఐఆర్ చేసిన తరువాత చట్టప్రకారం నిందితుడ్ని ఎందుకు అరెస్ట్ చేయలేదనేది కీలకంగా వివరాలు రాబట్టడం విశేషం. పూర్తిస్థాయిలో ఆధారాలు ఎందుకు సేకరించలేకపోయారని, నిందితుడి నుండి సమగ్ర కేసు వివరాలు రాబట్టలేకపోవడం వెనుక ఆంతర్యమేమని ప్రశ్నించడం తెలుస్తోంది. అయితే ఏవిఎస్ఒ ఈ కేసులో ఫిర్యాదిదారుడు కావడంతో టిటిడి నిబంధనల మేరకు కేసులో మధ్యవర్తిత్వం జరిపి రాజీచేసుకునే పరిస్థితులు వివరించారని వెల్లడించినట్లు సమాచారం. చివరకు మూడునెలల్లోనే లోక్‌అదాలత్‌లో కేసు రాజీ చేసుకున్నారని ఈ తతంగం మొత్తం టిటిడి అధికారుల నుండి ఏవిఎస్ఒ వివరణమేరకు జరిగిందని పోలీస్ అధికారులు వివరించినట్లు తెలిసింది. పూర్వ టిటిడి విజిఒగా పనిచేసిన ప్రస్తుత డిఎస్పీ గిరిధర్ కూడా ఈ కేసులో కేవలం నిమిత్తమాత్రులమేనని, టిటిడిలో ఉన్నతాధికారులు, బోర్డు కీలకమని సిఐడి దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఎవరికీ దురుద్దేశ్యం లేదని, టిటిడి అధికారుల సూచనల మేరకు అన్ని జరిగాయని పోలీస్ అధికారులు వివరించినట్లు తెలుస్తోంది. ఇప్పుడు టిటిడి పూర్వ అధికారులను విచారణకు పిలుస్తారా లేక మళ్ళీ నిందితుడు రవికుమార్‌కు సంబంధించి పూర్తి వివరాలు సిఐడి బృందం దర్యాప్తు చేసి హైకోర్టుకు నివేదిక సమర్పించేందుకు త్వరత్వరగా ముందుకు కదులుతోంది. ఈ కేసులో గత పోలీస్ అధికారులను సిఐడి విచారణ చేయడంతో టిటిడిలో ఉలిక్కిపడుతున్నారు. రవికుమార్ ఆస్తుల వివరాలను సిఐడి సేకరించే పనిలో నిమగ్నమైంది. గత టిటిడి బోర్డు సభ్యులు, గత టిటిడి అధికారుల గుండెల్లో భయం పట్టుకుందని తెలుస్తోంది. రవికుమార్ పరకామణిలో ఎంతకాలంగా ఇలా విదేశీ కరెన్సీ దొంగతనం చేశాడనేది పోలీసులు సమగ్రంగా విచారణ చేయలేదనేది సిఐడి బృందం తేల్చిన ప్రధాన అంశం.

### 14న తిరుపతిలో కార్తీకదీపోత్సవం

**తిరుమల,నవంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన కార్తీకమాసంలో తిరుపతిలో 14వతేదీ శుక్రవారం కార్తీకదీపోత్సవం నిర్వహిస్తున్నారు. టిటిడి ఆధ్వర్యంలో ప్రతి ఏడాది కార్తీకదీపోత్సవాలను మహిళా భక్తులతో జరిపించడం పరిపాటి. ఈ ఏడాది శుక్రవారం ఈ కార్యక్రమానికి టిటిడి పరిపాలన భవనం మైదానాన్ని సిద్ధం చేస్తోంది.



## అలిపిరి మెట్లమార్గంలో కార్మికుల మాంసాహార భోజనం

**తిరుమల,నవంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రతను కాపాడి భక్తుల మనోభావాలు పరిరక్షించాల్సిన కార్మికులు నిబంధనలు ఉల్లంఘించి ఆదివారం రోజు మాంసాహార భోజనాన్ని ఏకంగా అలిపిరి మెట్లమార్గంలో తినడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పవిత్రతకూ తూట్లుపొడిచిన ఈ ఘటన కలకలంరేపింది. అలిపిరి మెట్లమార్గంలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు మాంసాహార భోజనం తింటుండగా కొందరు భక్తులు సెల్‌ఫోన్‌లలో వీడియోలు తీశారు. ఈ వీడియోలను టిటిడి వెబ్‌సైట్‌లో, వాట్సాప్‌కు పంపడంతో టిటిడి అధికారులు వెంటనే స్పందించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సరసమ్మ, రామస్వామిలుగా గుర్తించారు. వెంటనే వారిపై చర్యలు తీసుకుని విధుల్లోంచి తప్పించారు. దీనిపై తిరుమల 2టౌన్ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. దీనిపై టిటిడి అధికారులు కూడా అధికారికంగా ప్రకటన వెలువడించారు. జరిగిన తప్పిదంపై వెంటనే వారిని తొలగించామని తెలిపింది.

## కెఎ పాల్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

**విజయవాడ,నవంబరు 10,పభాతవార్త ప్రతినిధి:** ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ పాల్‌పై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏపీలో మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో నిర్వహించాలనే ఏపీ ప్రభుత్వం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. మీడియాలో ప్రచారం కోసం పిటీషన్లు దాఖలు చేస్తున్నారని జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. దీనిపై హైకోర్టును ఆశ్రయించాలని కేఎ పాల్‌కు సూచించింది.

## ప్రముఖకవి అందెశ్రీ మృతి పట్ల ఎపి సిఎం,డిప్యూటీ సిఎం, మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్, కొలుసు పార్థసారధి సంతాపాలు

**విజయవాడ,నవంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** కవి, రచయిత అందెశ్రీ కన్నుమూయడంపై పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. అందెశ్రీ మృతిపై సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు .'ప్రముఖ కవి, రచయిత, తెలంగాణకు రాష్ట్ర గీతాన్ని అందించిన డాక్టర్ అందెశ్రీ మరణ వార్త దిగ్భ్రాంతిని కలిగించిందని ఏపీ సిఎం చంద్రబాబునాయుడు ట్వీట్ చేసారు. తెలుగు సాహితీ లోకానికి ఇది తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ... అందెశ్రీ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాను. అంటూ సిఎం చంద్రబాబు ఎక్స్ సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. 'ప్రముఖ తెలుగు సాహితీవేత్త, గేయ రచయిత అందెశ్రీ మరణం భాధాకరం అని పేర్కొన్నారు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్...అందెశ్రీ ఆత్మకు శాంతి చేయాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. ఆయన చచనా ప్రస్థానం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. గొర్రెల కాపరిగా, భవన నిర్మాణ కూలీగా జీవితం మొదలుపెట్టి అక్షర యాత్ర చేశారు. తెలంగాణ జానపదాలపై, మాండలికంపై పట్టు కలిగిన రచయిత ఆయన....పలు సినీగీతాలు రచించారు. 'మాయమై పోతున్నా డమా ్మ మనిషన్నవాడు...' గీతం వింటే సమాజాన్ని అందెశ్రీ ఎంతగా చదివారో అర్థమవుతుంది. తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెంగాణ జననీ జయకేతనం' రచించి తెలంగాణ చరిత్రలో ఆయన చిరస్మరణీయంగా నిలిచారు. అందెశ్రీ మృతి పట్ల తీవ్ర సంతాపం తెలియచేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను అంటూ ఓ ప్రకటన విడుదల చేశారు పవన్‌కళ్యాణ్. ఒక 'ప్రముఖ కవి, రచయిత, తెలంగాణకు రాష్ట్ర గీతాన్ని అందించిన డాక్టర్ అందెశ్రీ మరణవార్త దిగ్భ్రాంతిని కలిగించింది. తెలుగు సాహితీ లోకానికి ఇది తీరని లోటు...ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ... అందెశ్రీ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాను' అంటూ ట్విట్టర్‌లోఏపీ మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. ఉత్తమోత్తమ సాహిత్య ద్రష్టగా అందెశ్రీని ఏపీ సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ వ్యాఖ్యానించారు. పెద్దగా విద్యలేకున్నా సామాజిక అవగాహనతో ఆయన జాగృతన సాహిత్యం మరువలేనిదన్నారు. అందెశ్రీ తెలుగు భాషకు గుర్తింపు తెచ్చిన ప్రజా కవి అని మంత్రి కొలుసు పార్ధసారధి అన్నారు.

# పుట్టపర్తికి ప్రధాని రాక నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు

## శతజయంతి వేడుకల ఏర్పాట్లపై సిఎం చంద్రబాబు సమీక్ష



**విజయవాడ,నవంబర్ 10. ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 19న పుట్టపర్తికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, 22వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రానున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్రపతి సహా వివిధ ప్రముఖులు హాజరుకానున్న దృష్ట్యా ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సత్యసాయిబాబా జయంతి వేడుకల నిర్వహణపై సచివాలయంలో మంత్రులు, సీఎస్ విజయానంద్, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పుట్టపర్తికి ప్రముఖులు రానున్న నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, పట్టణాన్ని సుందరంగా అలంకరించాలని సీఎం సూచించారు. ఏర్పాట్ల పర్యవేక్షించేందుకు మంత్రుల కమిటీ పుట్టపర్తిలో పర్యటించాలని ఆదేశించారు. శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నందుకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. సత్యసాయిబాబా మహాసమాధి దర్శన నిమిత్తం పుట్టపర్తి నిలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. వచ్చే వాహనాలకు పార్కింగ్‌తో పాటు పట్టణంలో రాకపోకల ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. బాబా మహాసమాధి దర్శనానికి ఎంత మంది భక్తులు రావచ్చనేదానిపై అంచనా వేసి అందుకు తగ్గట్లుగానే ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తుల కోసం అవసరమైన మేరకు ఆర్టీసీ బస్సులను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ముందుస్తు జాగ్రత్తగా మెడికల్ క్యాంపులు సైతం ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. పుట్టపర్తిలోని వేర్వేరు ప్రాంతాల్లో 10 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు సీఎంకు తెలియజేశారు. పారిశుద్ధం విషయంలో ఎలాంటి నిరక్ష్యం ఉండకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పుట్టపర్తికి వచ్చే భక్తులకు చిన్నపాటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు సీఎంకు వివరించారు. పారిశుద్ధం నిర్వహణకు 250 మంది సిబ్బంది, వచ్చే భక్తులకు తాగునీరు, ఆహారం, మరుగుదొడ్లు వంటి సదుపాయాలను కల్పిస్తున్నట్లు అధికారులు సీఎంకు తెలిపారు.

## రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు సాంకేతిక అత్యాధునిక యంత్రాలు

### కామన్ ఫెసిలిటీ సెంటర్ల ద్వారా సౌకర్యాల కల్పన

**విజయవాడ,నవంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం లోని సూక్ష్మ, చిన్న మధ్య తరహా(ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు సాంకేతిక అత్యాధునిక యంత్రాలను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒకే తరహా ఉత్పత్తులు చేసే పరిశ్రమలు ఉన్న క్లస్టర్లలో ప్రభుత్వ నిధులతో కామన్ పెసిలిటీ సెంటర్ల(సీఎఫ్‌సీ) ఏర్పాటుకు నిర్ణయించింది. ఒక్కో దానికి రూ.10 కోట్ల వరకు ప్రభుత్వం భరిస్తుంది. రూ.200 కోట్లతో ప్రాజెక్టును సిద్ధం చేసింది. రాష్ట్రంలో కనీసం 100 సీఎఫ్‌సీల ఏర్పాటును లక్ష్యంగా నిర్దేశించింది. చిన్న పరిశ్రమల నిర్వాహకులపై మూలధన పెట్టుబడి భారాన్ని తగ్గించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీపడేలా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ ఆలోచనచేస్తుంది. ఒక్కో సిఎఫ్‌సీకి రూ.10 కోట్ల వరకు ప్రభుత్వం ఇస్తుంది. దీని కోసం 10 మంది సూక్ష్మ చిన్న పరిశ్రమల నిర్వాహకులు ప్రత్యేక వాహన నౌక (ఎస్‌పీవీ)ని ఏర్పాటు చేయాలి. సీఎఫ్‌సీ నిర్వహణను ఎస్‌పీవీ పర్యవేక్షిస్తుంది. యంత్రాల కొనుగోలుకు చేసే ఖర్చులో 80 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. సిఎఫ్‌సీ లోని యంత్రాలు, సాంకేతికత వినియోగించుకున్న యూనిట్ల నుంచి నామమంత్రంగా సర్వీసు ఛార్జీలు వసూలు చేసి, ఆ మొత్తాన్ని నిర్వహణను ఎస్‌పీవీ వినియోగిస్తుంది. సీఎఫ్‌సీ ఏర్పాటకుకు తక్కువ వ్యవధిలో అవసరైన అనుమతులను ప్రభుత్వం ఇస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. చిన్న పరిశ్రమలు ఏర్పాటైన తర్వాత యంత్రాలు ,సాంకేతికతలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకునేందుకు ఆర్థిక పరిస్థితి వారికి సహకించడం లేదు.

వాటిలోనే ఉత్పత్తి చేస్తుండటం పట్ల నిర్వహణ వ్యయం పెరుగుతోంది. నాణ్యమైన ఉత్పత్తులు సాధ్యం కావడం లేదు.

ఇదే సమయంలో అదే ఉత్పత్తులను కార్పొరేట్ సంస్థలు తక్కువ ధరకు మార్కెట్‌లో అందుబాటులోకి తెస్తున్నాయి. అవి ఆధునాతన యంత్రాలను (ఆటోమేషన్)వినియోగించడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ వస్తు ఉత్పత్తి జరుగుతోంది. దీంతో కార్పొరేట్ సంస్థలతో ధరల్లో పోటీ పడే స్థాయి ఎంఎస్ఎంఈలకు ఉండటం లేదు. ఆ సమస్యలను సీఎఫ్‌సీల ద్వారా పరిష్కారం లభించనుంది. డిజైన్లు, పరిశోధన,

అభివృద్ధిఅత్యాధునిక సదుపాయాలు క్వాలిటీ కంట్రోల్ సెంటర్లునైపుణ్య శిక్షణముడిసరకు డిపోలు, ఉత్పత్తుల విక్రయాలు..మార్కెటింగ్ డిస్‌ప్లే సెంటర్లు పరిశ్రమలకు వచ్చే మరికొన్ని ప్రయోజనాలుడిజైన్లలో వచ్చే మార్పులు, టెస్టింగ్, శిక్షణ సహా విస్తృత శ్రేణి సేవలు అందుబాటులో ఉంటాయి. కామన్

నీటి శుద్ధి ప్లాంటు వ్యవస్థ ఉంటుంది. అంతర్జాతీయ మార్కెట్‌తో

పోటీ పడేలా ఉత్పత్తుల తయారీ వంటి సీఎఫ్‌సీల్లో ఉండే సౌకర్యాలుగా అధికారులు చెబుతున్నారు.

## విశాఖ ఆర్థిక ప్రాంత అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- క్లస్టర్లుగా ఈ ప్రాంతంలో ప్రాజెక్టుల అభివృద్ధికి బ్లూ ప్రింట్..
- విఇఆర్‌కు అవసరమైన పాలసీల రూపకల్పన - విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు..

**విజయవాడ నవంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకూ ఉన్న విశాఖ ఆర్థిక ప్రాంత అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో వచ్చే పెట్టుబడులు, పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం అవసరమైన పాలసీలను రూపొందించాలని సూచనలు జారీ చేశారు. సోమవారం సచివాలయంలో జరిగిన విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి సీఎస్ కే.విజయానంద్, ఆర్థిక, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, పర్యాటక, ఐటీ , మున్సిపల్, పరిశ్రమలు, వ్యవసాయ, ప్రణాళికా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. వీఈఆర్ ప్రాంతం రాష్ట్రానికి గ్రోత్ హబ్ గా తీర్చిదిద్దే అంశంపై ముఖ్యమంత్రి వివిధ శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకూ ఉన్న వివిధ జిల్లాలను విశాఖ ఎకనామిక్ రీజియన్ గా అభివృద్ధి చేసే విషయంలో స్థానికంగా ఉన్న ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడులు, ప్రజల జీవన ప్రమాణాలు, సుస్థిరాభివృద్ధి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. దీనికి సంబంధించిన ఎకనామిక్ మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని సీఎం స్పష్టం చేశారు. మొత్తం ఏడు అంశాల ఆధారంగా వీఈఆర్ గ్లోబల్ ఎకనామిక్ హబ్ గా మారుతుందని సీఎం వ్యాఖ్యానించారు. పోర్టుల ద్వారా కార్గో హ్యాండ్లింగ్ తో పెద్ద ఎత్తున లావాదేవీలు జరగాల్సి ఉందని అన్నారు. శ్రీకాకుళం మూలపేట పోర్టు నుంచి రీజియన్ లోని కాకినాడ పోర్టు వరకూ హింటర్ ల్యాండ్ లోని చత్తీస్ ఘడ్, మహారాష్ట్ర, ఒడిశా, మధ్య ప్రదేశ్ లాంటి ప్రాంతాలకు చెందిన కార్గోను కూడా రవాణా జరిగేలా చూడాలని సూచించారు. మూలపేట పోర్టు నుంచి దుగరాజపట్నం పోర్టు వరకూ షిప్ బిల్డింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యేలా చర్యలు ఉండాలని సీఎం పేర్కొన్నారు. ప్రస్తుతం ఉత్తర దక్షి ణాది రాష్ట్రాలను కలుపుతున్న ఏపీ ఇక ఈస్ట్ వెస్ట్ కారిడార్ గానూ మారాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 1215 మాన్యుఫాక్చరింగ్ నోడ్స్ కలిగిన ప్రాంతంగా విశాఖ ఎకనామిక్ రీజియన్ మారుతుందని అన్నారు. ప్రత్యేకించి ఈ రీజియన్ లో క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి ప్రాజెక్టులపై దృష్టి సారించాలని సీఎం సూచించారు. విశాఖ లాంటి ప్రాంతాలు నెక్స్ జెన్ ఐటీ డేటా సెంటర్ , ఏఐ ఇన్నోవేషన్ మారుతున్నాయన్నారు. ఈ రీజియన్ లోని ఇతర ప్రాంతాలు జాతీయ, అంతర్జాతీయ హెల్త్ కేర్ హబ్ గా మార్చాల్సి ఉందన్నారు. అలాగే ప్రణాళికా బద్ధంగా పట్టణీకరణ హౌసింగ్ ప్రాజెక్టులు రావాల్సి ఉందన్నారు. పట్టణ ప్రాంతాల్లో స్లమ్ క్లస్టర్ రీడెవలప్మెంట్ కోసం ప్రత్యేకంగా విధానాన్ని తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

వార్త

శ్రమతో సంపాదించిన సంపదను అనుభవించడమంత మాధుర్యం మరొకటి లేదు. శ్రమించే వారున్నచోటే సంపద ఉంటుంది.

-గోథే

# వీధి కుక్కల బెడద తప్పేనా?

నడిరోడ్డు మీద స్వైరవిహారం చేసే కుక్కల భారినపడకుండా తప్పించుకోగలిగిన మానవ మాత్రుడెవరూ ఉండరు. వీధి కుక్కల నియంత్రణపై పదేపదే తర్జన భర్జన పడటం తప్పడం లేదు. వీధి కుక్కలపై సుప్రీంకోర్టు మరోసారి జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. వీధి కుక్కల బారినపడి రేబిస్ వ్యాధితో మృతిచెందిన కొన్ని కేసులగురించి ఇప్పటికే న్యాయస్థానం ముందుకు రావడంతో గతంలో ఒకసారి సుప్రీంకోర్టు తీవ్రంగా ఆలోచించి కొన్ని కీలకనిర్ణయాలు ప్రకటించింది. అయినప్పటికీ ప్రభుత్వ సంస్థలు కలిసి రాకపోవడం, నిష్క్రియాపర్వాతం కారణంగా తమ తొలి ఆదేశాలు పట్టించుకోకపోవడంతో ధర్మాసనం కాస్త ఆగ్రహించినా కొత్తగా మార్గదర్శకాలు జారీ చేసింది. పౌరుల భద్రత, చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారి రక్షణ రీత్యా ఈ కొత్త మార్గదర్శకాలు వీధికుక్కల బెడదను కాస్తయినా తగ్గించే వీలుంది. విద్యాసంస్థలు, బస్ స్టేషన్లు, రైల్వే ప్రాంగణాలు, క్రీడా సముదాయాల్లో ఎక్కడపడితే అక్కడ వీధి శునకాలు ప్రత్యక్షమవుతుంటాయి. వాటిని ఏమాత్రం అదిలించినా వాటి పక్కనే వెళ్తున్నప్పుడు 'తమ మీదకే వస్తున్నారేమోనన్న' భీతి కలిగినా అవి మానుషుల మీద దాడి చేస్తున్నాయి. ఈ కారణంతో రోజూ వీధి కుక్కల కాట్లకు ఆస్పత్రులపాలైన ఘటనలు ఎన్నో నమోదవుతున్నాయి. అరుదుగా కాదు తరచుగా అత్యంత కీలకంగా ఉన్న ప్రాంతాల నుండి అత్యవసరంగా వీధికుక్కలను షెల్టర్లకు తరలించాలి. వాటిని సంతానోత్పత్తి నియంత్రణ శస్త్ర చికిత్స చేసిన తర్వాత తిరిగి అవి నివసిస్తున్న పాత ప్రాంతంలో వదిలిపెట్టరాదు. వీధి కుక్కల స్వైర విహారాల గురించి చెప్పుకోవాలంటే శనివారం ఒక్కరోజే హైదరాబాద్ నగరంలోని బాలానగర్‌లో కనీసం 25 మందిని వీధికుక్కలు కరిచాయి. ఆయా ప్రాంతాలన్నీ జనసమ్మర్ధంగా ఉంటాయి. అలాంటి చోట చిన్న సంఘటనలేమీ నమోదవవు. భీతిల్లి ఎక్కువ మందినే కరచుకుంటూ వెళ్తాయి. రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు జాతీయ రహదారుల శాఖ, స్థానికసంస్థలు, హైవే గస్తీ బృందాలు తమ ఆదేశాలను తక్షణమే అమల్లోకి తేవాలని సుప్రీం ధర్మాసనం జస్టిస్ విక్రమనాథ్, జస్టిస్ సందీప్‌మెహతా, జస్టిస్ ఎన్.వి అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజల భద్రతే తమకు ముఖ్యమని తేల్చి చెప్పిన ధర్మాసనం ప్రభుత్వ సంస్థలను కూడా హెచ్చరించింది. రెండు వారాల్లోగా ఈ చర్యలను చేపట్టాలని కోరింది. ఆయా ప్రధాన సంస్థలకు ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలను ఆదేశించింది. సాధారణంగా రాష్ట్రప్రభుత్వాలు ఆర్థిక భారం పేరిట వీధి కుక్కల నియంత్రణకు నిధుల్లేవనే సాకుతో మిన్నకుంటాయి. ఈసారలా కాదు. సుప్రీం కోర్టు పర్యవేక్షణలోనే ఈ కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంటుంది. కనుక నిధుల్లేవనే సమస్య ఎదురు కాబోదు. అందుచే ఈ సంస్యకు ఒక పరిష్కారం దొరుకుతున్నట్లే. యానిమల్ బర్త్ కంట్రోల్ నిబంధనల ప్రకారం వాటికి వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయించడం ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నట్లు ఆయా సంస్థల అధికార్లు ప్రతి మూడు నెలలకోసారి నిర్దేశిత జనసమర్థ ప్రాంతాలను తనిఖీచేయాల్సి ఉంటుంది. ఆ ప్రాంతంలో కుక్కలు లేవని నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రాంతంలో కుక్కలను దూరప్రాంతానికి తీసుకుపోయినా మరో ప్రాంతం నుంచి కొత్తకుక్కలు అక్కడకు చేరతాయని, అది నిబంధనలకు విరుద్ధమని కొందరు అభ్యంతరం వ్యక్తం చేసినా కోర్టు తోసిపుచ్చింది. ఇదే సందర్భంలో రోడ్లపై స్వైర విహారం చేసే పశువుల్ని కూడా ఎనిమిది వారాల్లోగా నియంత్రించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రానురాను వీధికుక్కల సమస్య పెరిగిపోవడంతో సుప్రీం ఆదేశాలు అమలు చేయకతప్పని పరిస్థితిఏర్పడింది. కేంద్రప్రభుత్వ గణాంకాల ప్రకారం గత సంవత్సరంలో సగటున రోజుకి 10వేల మందిని కరిచాయి. దేశవ్యాప్తంగా 2024లో 37,15,713 కుక్క కాటు కేసులు నమోదైనాయి. 2025 జనవరిలోనే 4.29 లక్షల మంది వీధికుక్కల బారినపడ్డారు. 2022-24ల మధ్య అత్యధిక కుక్కకాటు కేసులు నమోదైన పది రాష్ట్రాలలో మహారాష్ట్ర (13.5లక్షలతో) ప్రథమ స్థానంలోఉంది. తెలంగాణ3.33 లక్షల కేసులతో ఎనిమిదో స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే రేబిస్ మరణాల్లో 36శాతం భారతదేశానివే. ఇంకా విశేషంగా చెప్పాలంటే మన దేశ జనాభా కన్నా వీధిశునకాలు ఎక్కువగా ఉన్నాయి. దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటుఆస్పత్రులు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లను నిల్వ ఉంచుకోవాలి. తమ ప్రాంగణాలు శుభ్రంగా ఉంచుకుని, వీధికుక్కలు ప్రవేశించకుండా చూసేందుకు ఆయా సంస్థలు నోడల్ అధికారిని నియమించుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చినమార్గదర్శకాల జాబితాలో ఉంది. ప్రాంగణాల చుట్టూ ప్రహారీలు, కంచెలు, గేట్లనిర్మాణంవంటి పనులను 8వారాల్లోగా నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించింది. కుక్కల నియంత్రణలో స్థానికసంస్థలు కొన్ని జాగ్రత్తలు తీసుకున్నా అనేక కారణాల రీత్యా అవేమీ అమలు జరగడం లేదు. ఒకవేళ ఔత్సాహిక యాజమానికార్యనిర్వాహంగా చురుకుగాఉన్న చోట్లవీటిని పాటించినా ప్రజల్నుంచి ప్రభుత్వంనుంచి తగు ఒత్తిడిఉంటే తప్ప ఇలాంటివి ముందుకుసాగే కార్యక్రమాలు కాబోవు. గతంలోనే ధర్మాసనం ప్రభుత్వఉద్యోగుల కాలనీల్లో కుక్కకాటుకు గురవుతున్న ప్రజల ఆక్రందనలు వినిపించుకుని కఠిన నిర్ణయాలు తీసుకుంది. ప్రజలు, ప్రభుత్వాలు, ప్రభుత్వసంస్థలుమూకుమ్మడిగా కుక్కల నియంత్రణకు నడుం కడితేతప్ప కుక్కల భారినుంచి జనాన్ని కాపాడుకోవడం సాధ్యంకాదు.

విజ్ఞానం సాధించువారు ధన్యులు. బంగారాన్ని సంపాదించడం కంటే విజ్ఞానం సంపాదించడం మంచిది.



రవీంద్రనాథ్ ఠాగూర్

ప్రమాణము అంటే వెనుకంజ వేయని నిశ్చయబుద్ధి, దృఢమగు నిశ్చయం లేకపోతే అభివృద్ధికి అవకాశమే ఉండదు.



మహాత్మా గాంధీ

# ప్రజావాక్కు



### రసాయన పరిశ్రమలే ఆధారం

రసాయన పరిశ్రమలు దేశఅభివృద్ధికి వెన్నెముక. వ్యవసాయం నుంచి ఔషధాలు, ప్లాస్టిక్‌లు, విద్యుత్ పరికరాల వరకు మన దైనందిన జీవితంలో ఉపయోగించే అనేక వస్తువులకు ఇవేఆధారం. అయితే, ఈరసాయన పదార్థాల స్వభావం సున్నితమైనది. ఇవి అగ్ని, ఉష్ణోగ్రత, ఒత్తిడి, లేదా ఇతరరసాయనాలతో కలిసినప్పుడు అసాధారణంగా ప్రతిస్పందిస్తాయి. అందుకే ఈ పరిశ్రమల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ఇటీవల గుజరాత్‌లో అగ్ని ప్రమాదం, ఆంధ్రప్రదేశ్‌లో గ్యాస్‌లీక్, తమిళనాడులో నిల్వ లోపాలవల్ల పేలుడు వంటిఘటనలు భద్రతా నియమాలు కేవలం పుస్తకాల్లో కాకుండా, ప్రతిరోజు ఆచరణలో ఉండాలని స్పష్టం చేశాయి. మార్పు, అవగాహన, అప్రమత్తతే ఇందుకు పరిష్కారం. ప్రతి రసాయన పరిశ్రమలో మొదటగా ప్రమాద విశ్లేషణ చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఉచిత ప్రయాణం పేద విద్యార్థి హక్కు

ప్రభుత్వం మహిళల పేరిట ఉచిత ప్రయాణ పథకాన్ని అమలు పరిచింది. వెంటనే ఈ ఉచిత ప్రయాణ వసతిని తొలగించాలి. ఉచిత బస్సుప్రయాణం పేద విద్యార్థులకు చెందవలసిన హక్కుమాత్రమే కానీరాజకీయ వ్యూహాలతో అనవసర పథకాలు పెట్టాల్సిన పనిలేదు. పథకాలు పేద వాడికి భరోసానివ్వాలి కానీ భారాన్ని మిగల్చొద్దు. కాబట్టి ఈ పథకాన్ని రద్దుపరిచి దీని స్థానంలో పేద విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి.

- కాల్వ నిఖిత, సిద్దిపేట

### ఇతర దేశాలపై ఆధారపడడం తగ్గించాలి

భారత ఐటీరంగం ఎంతోవేగంగా అభివృద్ధి చెందుతున్నా, హెచ్1బి వీసాలపై అధిక ఆధారపడటం భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతోంది. ప్రపంచ వలస విధానాలు క్రమంగా కఠినతరమవుతున్న ఈ పరిస్థితుల్లో, స్థిరమైన వ్యూహాలను అవలంబించడం అనివార్యం. స్థానిక నియామకాలనుపెంచడం, రిమోట్ డెలివరీ విధానాలను అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం ద్వారా సంస్థలు తమస్వావలంబనను నిర్ధారించుకోవాలి. అదే సమయంలో స్వదేశీ ప్రతిభను పెంపొందించడం అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశం.

- ఎన్.రామకృష్ణ, నెల్లూరు జిల్లా

### చారిత్రక నిర్మాణాలను సంరక్షించాలి

తెలంగాణ చరిత్రలో కాకతీయుల యుగం ఒక సువర్ణయుగం. ఆ కాలంలో నిర్మించిన దేవాలయాలు, గోపురాలు, కోటలు, బావులు ఆ కాలపు శిల్పకళా ప్రతిభకు నిదర్శనాలు. ఇటీవల కాకతీయుల కాలానికి చెందిన ఒకపురాతన బావి పునరుద్ధరించబడింది. ఈబావి శతాబ్దాలుగా నిర్లక్ష్యానికిగురై మట్టిలో కూరుకుపోయి, కాలగర్భంలో కనుమరుగైపోయింది. ఇప్పుడుఅది తిరిగి తన పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. పురావస్తుశాఖ, స్థానిక ప్రజల సహకారంతో ఈ బావిని శుభ్రపరచి, శిల్పాలను పునరుద్ధరించారు. రాతిబండలపై చెక్కిన కళాత్మక నమూనాలు, నీటి నిల్వకు చేసిన సాంకేతిక ఏర్పాట్లు కాకతీయుల కాలపు ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఈ బావి కేవలం నీటి వనరుగా కాకుండా, ఆ కాలపు ప్రజల సాంస్కృతిక, సామాజిక జీవన విధానాలకు అద్దం పడుతుంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### కార్మికులకు ఉపాధి కల్పించాలి

ఉపాధి హామీలో ప్రస్తుతం తెలంగాణ పరిస్థితి పైకి బాగానే కనిపిస్తున్న లోపల పురుగులన్నవి. పనులను తగ్గించడం, అనుమతించే పనులను తగ్గించడం ఇక్కడ చూడొచ్చు. గత ఉద్యమం ఫలితంగా సాధించుకున్న తెలంగాణలో కొంత నీటి వసతి పెరిగింది కదా. మరి పల్లెల్లో మొలిసిన నెలలో పంటలు సాగు చేస్తాం అని రైతన్నలు అంటుంటే రాష్ట్రం వద్దు అంటున్నది. బీడుభూమిని సాగులోకితెద్దాం అనుకున్నరైతన్నకు నిరాశే మిగులుతుంది. ప్రభుత్వం వెంటనే భూమి చదును కార్యక్రమాలకు అనుమతి ఇవ్వాలి. కనీసం రాష్ట్రప్రభుత్వానికి కొంత చారిత్రక భౌగోళిక స్పృహ అయిన ఉండాలి కదా. సాంకేతికత పేరుతో కార్మికులను పనికి దూరం చేసే పని జరుగుతుంది.

- భారత అవినాష్, జనగామ

### బస్‌స్టాప్‌లను ఏర్పాటు చేయాలి

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఎస్సీఎస్టీ బీసీ మైనారిటీ ప్రతి గురుకులం దగ్గర తప్పకుండా బస్‌స్టాప్‌ను ఏర్పాటు చేయాలి. తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఉన్నత అధికారులు బస్‌స్టాప్ ఏర్పాటు చేసినట్లయితే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, గురుకుల సిబ్బందికి, చుట్టుపక్కల పరిసర గ్రామాల ప్రజలకు సౌకర్యార్థంగా ఉంటుంది. బస్‌స్టాప్ షెడ్ నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులను విడుదల చేయాలి. వెంటనే నిర్మాణం చేపట్టి విద్యార్థులకు ప్రయాణం సౌకర్యం కల్పించాలి.

- ఈదునూరి వెంకటేశ్వరు, నెక్కొండ, వరంగల్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పత్తి కొనుగోళ్ల నిబంధనలు తొలగించాలి!

**గతంలో ఆంధ్రా, తెలంగాణలో ఇలాంటి కుంభకోణాలు వందలాది కోట్ల రూపాయల్లో జరిగాయి. తెలంగాణ రాష్ట్రంలో 2017-18, 2018-19 మధ్యలో పత్తి కొనుగోళ్లలో రూ.400 కోట్లు అవినీతి జరిగినట్లు సిబిఐ అధికారులు గుర్తించారు. ఇలాంటి అవినీతే ఆంధ్రప్రదేశ్లో కూడా జరిగింది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, ఎటువంటి వంకలు లేకుండా రైతుల వద్ద ఉన్న మొత్తం పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, నష్టపోయిన పత్తిధర రైతులకు ఎకరాకు 25వేలు నష్టపరిహారం ఇవ్వాలని, ఏడు క్వింటాళ్ల కొనుగోలు నిబంధన విరమించాలని, క్వింటాల్ ఉత్పత్తికి 10 వేల మద్దతుధర ప్రకటించాలని, దిగుమతి పత్తిపై 30శాతం సుంకం విధించాలని, పత్తి దిగుమతిని పరిమితం చేయాలని, పత్తిరైతులకు బ్యాంకులు ఇచ్చిన పంటరుణాలు రద్దుచేయాలని రెండు రాష్ట్రాల రైతాంగం ఉద్యమించాలి.**

బొల్లిముంతసాంబశివరావు

రెండు తెలుగు రాష్ట్రాల్లో పత్తిరైతులు తీవ్రసంక్షోభంలో ఉన్నారు. ఒకప్పుడు తెల్లబంగారంగా, రైతాంగానికి సిరులపంటగా పేరుపొందిన పత్తిసేద్యం, నేడు రైతాంగానికి ఉరితాడుగా మారుతూ ఉంది. సేద్యపు ఖర్చులు పెరగడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోవటం, గిట్టుబాటు ధర లభించకపోవటం, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల చేయూత లేకపోవటం అందుకు కారణంగా ఉంది. నేడు భారీవర్షాల వల్ల రెండు రాష్ట్రాల్లో మిగిలిన పంట అమ్ముకోవటానికి రైతాంగం తీవ్ర అవస్థలు పడుతున్నారు. భారతదేశంలో పత్తిసాగు విస్తీర్ణం 120.55 లక్షల హెక్టార్లు. ప్రపంచంలో మొత్తంసాగు విస్తీర్ణంలో ఇది సుమారు 36 శాతంగాఉంది. పత్తిసాగులో దేశం మొదటి స్థానంలో ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్పత్తిదారుగా ఉంది. అయినా భారతదేశ అవసరాలకు సరిపోక దిగుమతులు తప్పనిసరి అయ్యాయి. అమెరికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా చైనా దేశాల నుండి దిగుమతులు చేసుకుంటున్నాం. పత్తి దిగుబడుల్లోనూ భారతదేశం బాగా వెనకబడి ఉండటమే అందుకు కారణం. ప్రపంచ విత్తన పత్తి సగటు దిగుబడి హెక్టార్కు 1,670 కిలోలు. భారతదేశంలో సగటు దిగుబడి హెక్టార్కు 500 కిలోలు. చైనాలోప్రపంచ సగటు దిగుబడికన్నా రెట్టింపు ఎక్కువ. పత్తికి కేంద్రప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర ఎప్పుడూ రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా లేదు. అది రైతు ప్రయోజనాలను కాకుండా బడాపారిశ్రామికవేత్తల ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటుందన్నది వాస్తవం. ప్రస్తుతం పత్తిమద్దతు ధర క్వింటాలుకు 8,110గా ఉంది. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం10,075 రూపాయలు ఉండాలి. స్వామినాథన్ సిఫార్సులకు అనుగుణంగా మద్దతు ధరలు ప్రకటిస్తున్నామని కేంద్రప్రభుత్వం చెప్పటంలో ఉన్న మోసం పత్తి మద్దతు ధర ప్రకటన బట్టబయలు చేస్తున్నది. భారతదేశం ప్రతిసంవత్సరం లక్షల బేళ్ల పత్తిని దిగుమతి చేసుకుంటున్నది. ఈ సంవత్సరం మూడు లక్షలబేళ్ల పత్తి దిగుమతి అయ్యింది. ట్రంప్, పశ్చిమదేశాల వత్తిడికిలొంగిన కేంద్ర ప్రభుత్వం పత్తిదిగుమతులపై పూర్తిగా సుంకాన్ని ఎత్తివేసింది. ఫలితంగా విదేశాల నుండి పెద్దఎత్తున పత్తి దిగుమతులు పెరిగాయి. దిగుమతుల వల్ల దేశంలో పత్తి రేట్లు తగ్గుతాయి. ప్రపంచ మార్కెట్లో ప్రస్తుతం క్వింటాల్ గింజ పత్తి ధర 5,720 రూపాయలు. భారతదేశం దిగుమతి సుంకం విధిస్తే దేశంలో దిగుమతి పత్తి ధర ఇంకా ఎక్కువ ఉండేది. అలా చేయకపోవడంతో దిగుమతి పత్తి ధర తక్కువగా ఉండటంతో టెక్స్టైల్ మిల్లుల యజమానులు విదేశాల పత్తినే కొనుగోలు చేస్తున్నారు. దీన్ని గమనిస్తే కేంద్ర ప్రభుత్వానికి దేశ రైతుల ప్రయోజనాల కన్నా విదేశీ పత్తికంపెనీల ప్రయోజనమే ముఖ్యమని చెప్పకనే చెబుతున్నది. పత్తి దిగుమతుల వల్ల భారతపత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 45.32 లక్షల ఎకరాల్లో 24.12 లక్షల మంది రైతులు పత్తిసాగు చేస్తున్నారు. వీరిలో 70శాతం మంది చిన్న,సన్నకారు రైతులే. పత్తి మద్దతు ధరను క్వింటాల్‌కు 7720 నుంచి 8110 రూపాయలుగా కేంద్రం ప్రకటించింది. ప్రతి సంవత్సరం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మద్దతు ధర ఇచ్చి కొనుగోళ్లు చేస్తానని ప్రకటిస్తూ ఉంది. ఈ సంవత్సరం తెలంగాణ రాష్ట్రంలో మూడువారాలు ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలను సీసీఐ ఏర్పాటు చేసింది. ఎకరాకు 11.74 క్వింటాళ్ల పత్తిదిగుబడి వస్తుందనే వ్యవసాయశాఖ ఇచ్చిన నివేదిక ప్రకారం, ఎకరాకు 12క్వింటాళ్ల పత్తి కొను



గోళ్లు ప్రారంభించింది. అకస్మాత్తుగా ఎకరాకు 7 క్వింటాళ్లు మాత్రమే కొనుగోళ్లు చేయాలని రాష్ట్ర అధికారులకు సీసీఐ సమాచారం ఇచ్చింది. సీసీఐ నిర్ణయంవల్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆంధ్రప్రదేశ్లో 4.56 లక్షల ఎకరాల్లో పత్తిసాగు జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. సుమారు 8 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని భావించారు. భారీవర్షాల వల్ల దిగుబడి భారీగా తగ్గింది. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లకు 30కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సీసీఐ తెలిపింది. పత్తివిక్రయానికి ముందుగా రైతుసేవా కేంద్రాల్లో పేరు నమోదు చేసుకోవాలి. సిఎంయాప్ ద్వారా రైతు వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత కపాస్ కిసాన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. ఈ రాష్ట్రంలో కూడా ఎకరాకు7 క్వింటాళ్లకే కొనుగోలు పరిమితం చేసింది. కొంతమంది రైతులకు ఎకరాకు12 క్వింటాళ్లకు పైగా పత్తి దిగుబడి వస్తున్నది. సీసీఐ నిర్ణయం రైతులను వ్యాపారుల దోపిడీకి గురిచేస్తుంది. భారీవర్షాలు, తుఫాన్ల వల్ల దిగుబడి ఏడు క్వింటాళ్లకు తగ్గిందని, అందుకు అనుగుణంగానే కొనుగోలు ఎకరాకు ఏడు క్వింటాళ్లకు తగ్గించడం జరిగిందని తన నిర్ణయాన్ని సీసీఐ సమర్థించుకుంది. ఈ సమర్థనలో వాస్తవం లేదు. ఎందుకంటే విదేశాల నుంచి పెద్ద ఎత్తున పత్తి దిగుమతి కావడం అందుకు కారణం కాబట్టి. పత్తి కొనుగోళ్లకు కూడా సీసీఐ అనేక నిబంధనలు పెట్టింది. తేమ శాతం 12 మించగూడదని, రంగుమారిన పత్తిని కొనుగోలు చేయమని, 12శాతం తేమకంటే ఎక్కువ తేమ ఉంటే ఆ మేరకు ధర తగ్గిస్తామని పేర్కొంది. భారీ వర్షాలకు తెలంగాణలో పత్తి తడిచిపోయి తేమశాతం ఎక్కువగా ఉంది. రైతుల ప్రయోజనం కోరే ఏ ప్రభుత్వమైనా తుఫాన్ సందర్భంగా తడిచిన పంటలను మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుంది అనటానికి సీసీఐ పత్తికొనుగోలుకు విధించిన నిబంధనలే చాలు. అసలే సంక్షోభంలో ఉన్న పత్తి రైతులు సీసీఐ నిబంధనలతో మరింత నష్టపోయి వారి సంక్షోభం తీవ్రమోతుంది. రైతు సీసీఐ కేంద్రాల్లో పత్తి అమ్ముకోవాలంటే కేంద్రప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్‌లో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆయా యాప్‌లో సాల్ట్ బుక్‌చేసుకుంటేనే సీసీఐ అధికారులు రైతులనుండి పత్తికొనుగోలు చేస్తారు. అలా చేసుకోవాలని చాలా మంది రైతులకు తెలియదు. అలా చేసుకోలేని రైతులు సీసీఐ కేంద్రాల్లో అమ్ముకోలేక ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముతున్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నామమాత్రపు పత్తికొనుగోళ్లకే పరిమితం చేస్తూ వస్తున్నది. ఇప్పుడు కూడా ఆ బాటలోనే నడుస్తున్నది. మద్దతుధర ఇవ్వటానికి అనేక వంకలు పెట్టి నిరాకరిస్తున్నది. నేడు రెండు రాష్ట్రాల్లో తేమ, రంగు మార్పు పేరుతో మద్దతు ధరలో తగ్గించి ఇస్తున్నది. ఫలితంగా క్వింటాల్‌కు6,500లోపే రైతుకు దక్కుతున్నది. సీసీఐ పెట్టిన నిబంధనలు, మద్దతుధరలో తగ్గింపువల్ల విసిగిపోయిన రైతాంగం ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. పత్తి కొనుగోలులో సీసీఐ విఫలమైనప్పుడు మద్దతు ధరకు రైతుల నుండి పత్తి కొనుగోళ్లు రాష్ట్రప్రభుత్వాలు చేపట్టాలి. రెండు తెలుగురాష్ట్ర ప్రభుత్వాలు అలాంటి బాధ్యత తీసుకోలేదు. వ్యాపారులు, సీసీఐ అధికారులు కుమ్మక్కై పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు దారితీసింది. రైతుల నుంచి సీసీఐ కొనటానికి నిరాకరించిన పత్తిని వ్యాపారులు రైతుల నుండి చౌకగా కొనుగోలుచేశారు. అలాకొన్న పత్తిని అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతుల పేరుతో పత్తి పండించినట్లు నకిలీపత్రాలు సృష్టించి తిరిగి సీసీఐకే మద్దతుధరకు అమ్ముతున్నారు. గతంలో ఆంధ్రా, తెలంగాణలో ఇలాంటి కుంభకోణాలు వందలాది కోట్ల రూపాయల్లో జరిగాయి. తెలంగాణ రాష్ట్రంలో 2017-18, 2018-19 మధ్యలో పత్తి కొనుగోళ్లలో రూ.400 కోట్లు అవినీతి జరిగినట్లు సిబిఐ అధికారులు గుర్తించారు. ఇలాంటి అవినీతే ఆంధ్రప్రదేశ్లో కూడా జరిగింది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, ఎటువంటి వంకలు లేకుండా రైతుల వద్ద ఉన్న మొత్తం పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, నష్టపోయిన పత్తిధర రైతులకు ఎకరాకు 25వేలు నష్టపరిహారం ఇవ్వాలని, ఏడుక్వింటాళ్ల కొనుగోలు నిబంధన విరమించాలని, క్వింటాల్ ఉత్పత్తికి 10 వేల మద్దతుధర ప్రకటించాలని, దిగుమతి పత్తిపై 30శాతం సుంకం విధించాలని, పత్తి దిగుమతిని పరిమితం చేయాలని, పత్తిరైతులకు బ్యాంకులు ఇచ్చిన పంటరుణాలు రద్దుచేయాలని రెండు రాష్ట్రాల రైతాంగం ఉద్యమించాలి. •

# సామాజిక మాధ్యమాలకు బానిసలవుతున్న యువత


కామిడి సతీష్ రెడ్డి

నేడు యువత సామాజిక మాధ్యమాల బారిన పడి విలువైన భవిష్యత్‌ని సర్వనాశనం చేసుకుంటూ వున్నారు. కొంత మందికి క్రికెట్ అంటే పిచ్చి. స్నేహితులతోకలిసి ఐపీఎల్‌లో ప్రతి క్రికెట్ మ్యాచ్ తిలకించిన తర్వాతసెల్‌ఫోన్లో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లోకి ప్రవేశించి పందేలు కట్టడం వంటి ఆరోపణలు వినవస్తూ వున్నాయి. ఆరంభంలో నగదు రావడంతో మరింత ఉత్సాహం చూపిస్తారు. తరువాత పందేల్లో రూ.వేల నగదు పోగొట్టుకున్న సందర్భాలున్నాయి. తొలుత బంధువులు, తెలిసినవారి వద్ద అప్పులు చేయడం, నగదుకోసం ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకున్న తర్వాత బకాయిలు పెరిగిపోవడంతో చోరీలకు దిగి పోలీసులకు చిక్కిపోతూ వున్నారు. అరచేతిలో ఇమిడే సెల్‌ఫోన్‌తో సమస్త ప్రపంచాన్ని వీక్షించే అవకాశంవచ్చింది. తాము చదివే కోర్సులకు సంబంధించి సమాచారాన్ని సేకరించి, జ్ఞానాన్ని విస్తృతం చేసుకుంటున్నారు. కొందరు మాత్రం సామాజిక మాధ్యమాలు, క్రికెట్ బెట్టింగ్‌లు, ఓటీటీల్లో సినిమాల వీక్షణతో కాలక్షేపంచేస్తూ జీవితాన్ని బలిచేసుకుంటున్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు సెల్‌ఫోన్‌లను ఎక్కువగా వాడతారు. తల్లిదండ్రులు కొనిస్తే అప్పటి నుంచి వానిని రోజూ రాత్రి ఫోన్లో ఓటీటీ ప్లాట్‌ఫాం, యాప్‌లలో వీడియోలు చూడటం, నిద్రపోకుండా తెల్లవారుజామున రెండు, మూడు గంటల వరకు సెల్‌ఫోన్ చూస్తూ గడిపేస్తున్నారు. రాత్రి నిద్రపోకపోవడం వల్ల ఉదయం తరగతి గదిలో మత్తుగా ఉండి అధ్యాపకులు చెప్పే పాఠాలు వారికి అర్థం కావడం లేదు. ఏకాగ్రత దెబ్బతిని చదువుపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. కరోనా లాక్‌డౌన్ కారణంగా ఇంట్లోనే ఉండాల్సి రావడం, ఖాళీసమయం ఎక్కువగా లభించడంతో యువత ఓటీటీలు, యాప్‌లు చూడటానికి అలవాటుపడ్డారు. ఓటీటీలో కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌ల్లో అశ్లీల సన్నివేశాలు, సంభాషణలు నేరుగా ప్రసారమవుతున్నాయి. ప్రస్తుతం ఎలాంటి సెన్సార్‌షిప్ లేకపోవడంతో వీటిని చూసి పిల్లలు, యువత పాడైపోతున్నారని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హింసాత్మక, లైంగిక కార్యకలాపాల దృశ్యాలు నేరుగా ప్రసారం అవుతుండటంతో యువత తీవ్రంగా ప్రభావితమై చెడిపోతున్నారు. విద్యార్థులు ఏకాగ్రత దెబ్బతిని సరిగా చదువుపై దృష్టిసారించలేకపోతున్నారు. తలనొప్పి, కంటిచూపు ఇతర అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. యాంత్రిక జీవనంలో సంస్కృతి, సంప్రదాయాలు మరిచిపోతున్నారు. నైతికవిలువలు, ప్రమాణాలు దిగజారిపోయి అడ్డదారులు తొక్కుతున్నారు. గంజాయి, మత్తు పదార్థాలు, మద్యం అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. జల్సాలకు అలవాటు పడి ఈ దందాలోకి దిగినట్లు పోలీసుల విచారణలో తేలుతుంది. ఎనిమిది నుంచి పది గంటలు స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లలో సినిమాలు, వీడియోలు చూడటం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. పిల్లలు, యువతలో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. తలనొప్పి, కంటిచూపు సమస్యలు వస్తున్నాయి. మానసిక కుంగుబాటుకు లోనవుతున్నారు. మత్తుపదార్థాల సేవనానికి అలవాటుపడి బానిసలై నగదు కోసం నేరాలకు దిగడంచాలా ఆందోళనకరం. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు వచ్చిన తర్వాత పోలీసులు నిఘాపెట్టి పట్టుకోవడం కష్టసాధ్యంగా మారింది. ఐపీఎల్ సమయంలో పెద్దఎత్తున బెట్టింగ్‌లలో యువత భారీఎత్తున నగదు పోగొట్టుకున్నారు. రూ.లక్షల అప్పు చేసి తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతూ తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని మిగుల్చుతున్నారు. సెల్‌ఫోన్‌ను సద్వినియోగం చేసుకుంటే ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు. విద్యార్థులు, యువత పలురకాల ఆటలు ఆడేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని నిపుణులు సూచిస్తున్నారు. వారికి ఇష్టమైన కళలో శిక్షణ ఇప్పిస్తే రాణిస్తారు. యోగ, ధ్యానం సాధన చేయించడం ద్వారా ఏకాగ్రత సాధిస్తారు. పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి పెట్టి దారితప్పక ముందే వారు సన్మార్గంలో నడిచేలా చూడాలి. తల్లిదండ్రులు ఎంత తీరిక లేకుండా ఉన్నా పిల్లలకు మాత్రం తగిన సమయం కేటాయించాలి. వారితో ప్రేమగా మాట్లాడి ఇష్టాయిష్టాలు తెలుసుకోవాలి. మంచి, చెడు గురించి వివరంగా చెప్పాలి. సానుకూల దృక్పథంలో ఆలోచించేలా వుండాలి. •

# విద్యా హక్కు పరిరక్షణ అందరి బాధ్యత

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రతి సంవత్సరం నవంబర్ 11న దేశవ్యాప్తంగాజాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. దీన్నే రాష్ట్రీయ శిక్షా దివస్ అని కూడా పిలుస్తారు. దేశంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన మోలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా పాటిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చాక మన దేశానికి మొదటి విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ పనిచేశారు. 1947 నుంచి 1958 వరకు తన బాధ్యతల్ని సమర్థంగా నిర్వహించారు. భారతదేశానికి మొదటి ఉప రాష్ట్రపతిగా కూడా ఆయన సేవలందించారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని2008నుంచి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. మోలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజు సందర్భంగా విద్యా హక్కు పరిరక్షణ గురించి ఆలోచించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. విద్యను ప్రాథమిక హక్కుగా చేశారు. విద్యాహక్కు చట్టం హామీ ఇచ్చిన విధంగా వీరందరికీ వాళ్ల వయసుకు తగిన తరగతిలో చేర్పించి విద్యనందించడమూ ఒక సవాలే. యునిసెఫ్ ప్రకారం దాదాపు సగం మంది ప్రణాళికా సంఘం అంచనా ప్రకారం సుమారు 43 శాతం మంది బాలబాలికలు ఎనిమిదో తరగతిలోపే బడిమాని వేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాల్లో ఇది 55 శాతం షెడ్యూల్డ్ తెగల్లో 63శాతం దాకా ఉందని అంచనా. విద్యను పొందడం మాత్రమే హక్కు కాదు, సరైన ఉపాధ్యాయుడి వద్ద విద్యను అభ్యసించడం కూడా హక్కే. కాలం ఎంతగా మారినా మన సమాజం ఉత్తమ ఉపాధ్యాయులను అధికంగా తయారు చేయలేకపోతుందనేది సత్యం. సాధారణ ఉపాధ్యాయుడు పాఠాల్ని బోధిస్తాడు. మంచి ఉపాధ్యాయుడు వాటిని వివరిస్తాడు. ఉత్తమ ఉపాధ్యాయుడు విశదీకరిస్తాడు. గొప్ప ఉపాధ్యాయుడు స్ఫూర్తిని అందిస్తాడు. గురువుల బోధనతోనే విద్యార్థులు ప్రపంచాన్ని తెలుసుకుంటారు. ఉన్నత వ్యక్తులుగా ఎదుగుతారు. ప్రపంచంలో సుమారు 80 కోట్ల మంది నిరక్షరాస్యులు ఉండగా అందులో 23.8 కోట్ల మంది మనదేశంలోనే ఉన్నట్లు వెల్లడైంది. నాణ్యమైన విద్యనందించడం ద్వారా ప్రతి ఒక్కరూ అవసరమైన స్థాయిలో చదువు నేర్చుకుని, తర్వాతి తరగతిలోకి ప్రవేశించగలిగేలా చేయాల్సిన బాధ్యత పాఠశాలపై ఉంటుందనీ చట్టం పేర్కొంటోంది. న్యూటన్, పైథాగరస్, సర్వేపల్లి రాధాకృష్ణన్ మొదలైన వారు ఆదర్శంగా నిలిచారు. విశ్వామిత్రుడు, సాందీపుడు, పరశురాముడు, ఆదిశంకరా చార్యులు, ద్రోణాచార్యులు, పరమహంస మొదలైన వారంతా పేరొందిన గురువులు. విద్య అనే ఆస్తిని సమానంగా పంచగల శక్తి ఒక ఉపాధ్యాయుడికే ఉంది. ప్రజాదరణ, అపారమైన గౌరవం ఉన్న కారణంగానే ఎంతోమంది ఉపాధ్యా యులు




నాయకులయ్యారు. వీరిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సిన వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. ఒక అధ్యాపకుడు భారత దేశానికి రాష్ట్రపతిగా పనిచేసిన ఘనత ఆయనకే చెల్లింది. ఆయన పుట్టిన రోజును మనదేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటాము. ప్రఖ్యాత శాస్త్రవేత్త అబ్దుల్ కలాం రాష్టపతిగా పదవీకాలం ముగియగానే చెన్నైలోని అన్నా విశ్వ విద్యాలయంలో అధ్యాపకుడిగా చేరారు. బోధన చేస్తూనే ఆయన తుదిశ్వాస విడిచారు. యావత్ ప్రపంచానికి ఆయన గొప్ప సందేశాన్ని అందించారు. నీతివంతమైన జీవనానికి అలవాటుపడే విద్యార్థులను ఉపాధ్యాయులుతీర్చిదిద్దగలగాలి. సమాజాలు మారొచ్చు, సిద్ధాంతాలుమారొచ్చు. కానీ విద్యార్థి, ఉపాధ్యాయుల మధ్య సంబంధం శాశ్వతమైనది. ఈ విషయాన్ని యువ ఉపాధ్యాయులు గుర్తుంచుకోవాలి. విద్యార్థుల భవిష్యత్‌పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. సమాచారం అందివ్వడంతోనే ఉపాధ్యాయుడి పాత్ర ముగియదని నిజానికి ఉపాధ్యాయుడు రకరకాల నైపుణ్యాల్ని విద్యార్థులకు అందించవలసి ఉంటుందని కొఠారి కమిషన్ పేర్కొంది. జాతి నిర్మాణంలో తల్లిదండ్రుల తర్వాత కీలకపాత్ర పోషించేది గురువే అవుతాడు. అనేక మంది గురువులు విద్యార్థుల మదిలో ప్రముఖ స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. మాతృదేవోభవ పితృదేవోభవ ఆచార్య దేవోభవ అన్నారు పెద్దలు. తల్లిదండ్రుల తరువాతి స్థానం గురువుదే అని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టేవారు తమ వృత్తిని ప్రేమించే లక్షణం కలిగి ఉండాలి. తాము భావిపౌరులను తీర్చిదిద్దుతున్నామనే భావనఉండాలి. విద్యార్థి ఎగిరే గాలిపటం అయితే దానికి ఆధారమైన దారంగురువు. ఉపాధ్యాయులు తమ మేధోసంపత్తిని పెంపొందించుకోవాలి. తమ జీవిత కాలంలో కనీసం నాలుగు తరాల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గమనించాలి. వృత్తి నైపుణ్యాల పెంపు, కంప్యూటర్ వినియోగం, డిజిటల్ లిటరసీ కార్యక్రమాలను నిర్వహించాలి. బాలబాలికల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషిచేయాలి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మార్చలేని గతాన్ని గురించి ఆలోచించవద్దు.. చేతిలోఉన్న భవిష్యత్తు కోసం శ్రమించు అనేవారు. ఉపాధ్యాయ లోకం కానీ రిమోట్ లెర్నింగ్ అందించడానికి, వెనకబడుతున్న విద్యార్థులకు మద్దతు ఇవ్వడానికి, అభ్యాస అంతరాలను తగ్గించేలా ఉపాధ్యాయుల కృషి పరంగా ఇది చాలా కీలక సమయం. విద్య భవిష్యత్తును, బోధనావృత్తిని రూపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా ముఖ్యం. ఉపాధ్యాయుడు తన బోధనా పద్ధతుల్ని పునః సమీక్షించుకొని తదనుగుణంగా విద్యార్థులను నవ సమాజానికి అందించాలి. ఒకప్పుడు గుమాస్తాలను తయారుచేసే విధంగా విద్యా లక్ష్యం వుండేది. నేడు సామాజిక ప్రాధాన్యతలు మారిపోయాయి. దేశానికి పరిశోధకులు కావాలి. వ్యక్తుల స్వభావాన్ని, సామర్థ్యాన్ని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని ప్రవచించిన అబ్దుల్ కలాం పలుకులకు సార్థకత చేకూర్చాలి. నేటి యువ ఉపాధ్యాయులు అందుకు కంకణ బద్ధులై వృత్తిని నిబద్ధతతో నిర్వర్తించాలి. •

# టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీపీ బ్రౌన్ జయంతి వేడుకలు

గుంటూరు, నవంబర్ 10, ప్రభాతవార్త ప్రతినిధి: టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేడు సీపీ బ్రౌన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర



కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యుడు ఏవీ రమణ, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నేతలు నివాళులర్పించారు. అనంతరం నేతలు మాట్లాడుతూ.. తెలుగు భాషా ప్రామాణ్యానికి పదకోశ అభివృద్ధికి అవిరళ కృషి చేసిన సీపీ బ్రౌన్ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన శ్రమ వలన తెలుగు భాషకు కొత్త జీవం లభించిందని టీడీపీ ప్రభుత్వం తెలుగు అభ్యున్నతికి నిరంతర కృషి చేస్తుందని అన్నారు. సీపీ బ్రౌన్ చూపించిన మార్గం కొత్త తరానికి స్ఫూర్తిదాయకమని నేతలు అభిప్రాయపడ్డారు.

# మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి అనుచరుల అక్రమాలు

## టిడిపి గ్రీవెన్స్ లో ఫిర్యాదు

**అర్జీలు స్వీకరించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఏపీ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు**

గుంటూరు, నవంబర్ 10, ప్రభాతవార్త ప్రతినిధి: పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నపాలెం గ్రామానికి చెందిన అంజిరెడ్డి నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.. తమ గ్రామంలో సర్వే నెం. 152/1లో 0.50 సెంట్ల భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. పోతురెడ్డి సుబ్బారెడ్డి అనే వ్యక్తి తమ పొలంను అక్రమంగా సుమారు 0.20 సెంట్లను కబ్జా చేశారు. సుబ్బారెడ్డికి తమకు ఉన్న పొలం హద్దు గట్టుని వ్యవసాయ ట్రాక్టరుతో పగులగొట్టి ఆక్రమంగా దున్నుకొని సాగుచేసుకుంటున్నాడు. రెండు సార్లు సర్వేయర్ ను తీసుకొని వచ్చి హద్దుల రాళ్లుకూడ







వేయించుకున్నాం. అయినా కూడా వాటిని అక్రమంగా తొలగించి తమ దుర్భాషలాడి చంపుతామని బెదిరిస్తున్నాడు. దీనిపై రొంపిచర్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే ఇప్పటివరకు న్యాయం జరగలేదు. అలాగే 04.10.2025న పి. వెంకటేశ్వరరెడ్డి అనే వ్యక్తి య. 1.55 సెంట్ల పొలంలో గట్టు పగులగొట్టి భూమిని ధ్వంసం చేశాడు. దీని వెనుక మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరుల ప్రోత్సాహం ఉంది. రాజకీయ కక్షతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం స్థానిక ఎస్ఐ కూడా న్యాయం చేయకుండా బెదిరింపులకు గురిచేస్తున్నారు. కావునా వారిపై చర్యలు తీసుకొని తమ భూమి సమస్యను పరిష్కరించాలని నేతలు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ మంత్రి, ఏపీ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావుకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.

పల్నాడు జిల్లా ఈపూరు మండలం ఇనుమెళ్ళ గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో వారసత్వంగా ఉన్న సర్వే నెం.427లో సుమారు రెండున్నర ఎకరాలు 1971 పాత పత్రాల ఆధారంగా తమకు హక్కులు ఉన్నప్పటికీ ఐజీవల కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. స్థానిక వి.ఆర్.ఓ. రూ.10,000 లంచం అడుగుతున్నారు. కావునా వారిపై చర్యలు తీసుకొని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడికి చెందిన శ్రీనివాసరావు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నంబర్ 248లో 2 ఎకరాలు 5 సెంట్ల భూమి కలిగి ఉంది. కానీ రికార్డుల్లో 1 ఎకరం 96 సెంట్లు మాత్రమే నమోదు అయ్యింది. సర్వే నంబర్ 248లో మొత్తం 34 సెంట్లు అదనంగా ఉందని అధికారులు చెబుతున్నారు. కానీ తమకు తమ హక్కులో ఉన్న 4 సెంట్లు తగ్గించబడ్డాయి. దయచేసి ఆ భూమిని తిరిగి తమ పేరుపై నమోదు చేయించి న్యాయం చేయాలని కోరారు.

# స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ను సందర్శించిన ఏఎన్యు విద్యార్థులు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబరు10, ప్రభాతవార్త: వర్సిటీలోని సోషియాలజీ అండ్ సోషల్వర్క్ విభాగం విద్యార్థులు సోమవారం తాడికొండ మండలంలోని పెదపరిమి గ్రామంలో ఉన్న ముప్ప వెన్న బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ (ఎంవిబిటి) స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ను సందర్శించారు. విద్యా విధానంలో భాగంగా విద్యార్థులు స్టడీటూర్లో ట్రస్ట్ నిర్వహణపై అధ్యయనం చేశారు. ట్రస్ట్ నిర్వహించే స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ అందించే కోర్సుల వివరాలను ట్రైనింగ్ ఇన్చార్జి శివకృష్ణ అందించారు. అలాగే ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం గురించి అక్కడి వృద్ధులకు



అందించే వసతి, వైద్య సదుపాయాలు గురించి ప్రాజెక్ట్ మేనేజర్ సూర్యనారాయణ విద్యార్థులకు వివరించారు. అనంతరం సెంటర్ ఇన్చార్జి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు అక్కడి వృద్ధులను, స్కిల్ డెవలప్మెంట్ విద్యార్థులను వ్యక్తిగతంగా కలిసి వారి నుంచి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సోషియాలజీ అండ్ సోషల్వర్క్ విభాగాధిపతి ఆచార్య యం.త్రిమూర్తిరావు ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అయిన ఎంవి.లలితకుమారి, ఇతర సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమానికి విభాగం ప్రొఫెసర్ ఆచార్య కె.ధనలక్ష్మి, అతిథి అధ్యాపకులు డాక్టర్ పి.రాజకుమార్, డాక్టర్ ఎస్.రాజశేఖర్ పర్యవేక్షించారు. ఈ టూర్లో పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రంథాలయంలో సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబరు10, ప్రభాతవార్త: ఏఎన్యులో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మెమోరియల్ గ్రంథాలయంలో ఉన్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సైన్స్, ఆర్ట్స్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.వీరయ్య, ఆచార్య యం.సురేష్కుమార్లు విద్యార్థులకు సూచించారు.



గ్రంథాల యంలో విద్యార్థులకు 6రోజుల అవగాహన కార్యక్రమాలు సోమవారం నుంచి ప్రారంభమ య్యాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ అవగాహన కార్యక్రమం లో ఆచార్య కె.వీరయ్య మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పుస్తక పఠనం ద్వారానే ప్రపంచ మేధావిగా గుర్తించ బడ్డారని తెలియజేశారు. అలాగే విద్యార్థులు అంబేద్కర్ను ఆదర్శంగా తీసుకుని మీమీ సబ్జెక్టులలో మాస్టర్ ఆన్ యువర్ సబ్జెక్ట్గా ఎదగాలని సూచించారు. ఆచార్య యం.సురేష్కుమార్ మాట్లాడుతూ వర్సిటీ చరిత్రను వివరించారు. మన గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను అధ్యయనం చేయాలన్నారు. విద్యార్థులకు గ్రంథాలయంలో ఎన్నో సౌకర్యాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య వి.దివ్యతేజోమూర్తి మాట్లాడుతూ గ్రంథాలయం సేవలను ఉపయోగించుకుని వారివారి సబ్జెక్టులలో శాస్త్రీయ పద్ధతులు ద్వారా పరిశోధనలు చేయాలని కోరారు. గ్రంథాలయాధికారి ఆచార్య కె.వెంకట్రావు మాట్లాడుతూ గ్రంథాలయంలో స్టాక్ ఏరియాలో వివిధ విభాగాల సబ్జెక్ట్ బుక్స్, పోటీ పరీక్షల సెల్ నందు కాంపిటేటివ్బుక్స్, రిఫరెన్స్ సెల్లో టెక్ట్బుక్స్, డిజిటల్ లైబ్రరీ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈనెల 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

# గుంటూరు వార్త



# సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి అరెస్ట్

**గుంటూరు క్రైమ్ ప్రభాతవార్త నవంబర్ 10:** సామాజిక మాధ్యమాల్లో ఇతరులపై అనుచిత వ్యాఖ్యలు చేసినా,అసభ్యకర పోస్టులు పెట్టినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు ఈస్ట్ డిఎస్పీ అబ్దుల్ అజీజ్ హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణలో బాగంగా సామాజిక మాధ్యమాలలో ప్రముఖ వ్యక్తులపై అసభ్యకర పోస్టులు, అనుచిత వ్యాఖ్యలు, మార్ఫింగ్ వీడియోలు వంటివి తయారు చేసి, ప్రసారం చేసే వారినీ కట్టడి చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఇచ్చిన ఆదేశాల మేరకు సామాజిక మాధ్యమాలపై పటిష్ట నిఘా ఏర్పాటు చేసి, ప్రముఖులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, అసభ్యకర పోస్టులు పెడుతూ వారి ప్రతిష్ఠకు భంగం కలిగిస్తూ, వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్న వ్యక్తులపై పోలీస్ అధికారులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు.పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని సుద్దపల్లి డొంక ప్రాంతానికి చెందిన గాలి.సతీష్ బాబు అనే వ్యక్తి ప్రతి రోజు మాదిరిగానే తన ట్విట్టర్ ఎకౌంటు చూస్తూ



ఉండగా ఒక అకౌంట్ ద్వార ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి,రాష్ట్ర విద్య శాఖ మంత్రి మీద అసభ్యకరంగా పోస్టులు పెడుతూ, వారి యొక్క ఫోటోలు మార్ఫింగ్ చేసి, అసభ్యకరంగా మార్చి పోస్టు చేసినట్లు గమనించి, ఆ విధంగా ప్రముఖ వ్యక్తుల మీద అసభ్యకరంగా పోస్టులు పెడుతూ, వారి ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్న ఆ ఖాతా నిర్వాహకుడిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పాత గుంటూరు పోలీస్ వారికి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్ కేసు నమోదు చేసి,సాంకేతిక పరిజ్ఞానం ద్వారా దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. సోమవారం పాత గుంటూరు పోలీస్ స్టేషన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈస్ట్ డిఎస్పీ అబ్దుల్ అజీజ్ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత గుంటూరు పోలీస్ స్టేషన్లో నమోదైన కేసును దర్యాప్తు చేసి తెలంగాణ రాష్ట్రం,రాజన్న సిరిసిల్ల జిల్లా తంగేళ్లపల్లి మండలం, జిల్లెల గ్రామానికి(ప్రస్తుతం 815 విదిలి ల్లి, పేట్ బషీరాబాద్, జీడిమెట్ల, హైదరాబాద్) చెందిన తుపాకుల. సతీష్ కుమార్ అనే వ్యక్తి సదరు ట్విట్టర్ అకౌంట్ నిర్వహిస్తూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి,రాష్ట్ర విద్య శాఖ మంత్రి మీద అసభ్యకరంగా పోస్టులు పెడుతూ, వారి యొక్క ఫోటోలు మార్ఫింగ్ చేసి, అసభ్యకరంగా మార్చి పోస్టు చేస్తున్నట్లు సాంకేతిక ఆధారాల ద్వారా నిర్ధారించి, అతన్ని అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం కోర్ట్ కి పంపడమైనదనీ, ఈ కేసులో ఇటువంటి పోస్టులు పెడుతున్న మరో ఇద్దరిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని ఈస్ట్ డిఎస్పీ తెలిపారు.సామాజిక మాధ్యమాల పట్ల నియంత్రణ కలిగి ప్రతి ఒక్కరూ తమకు ఉపయోగపడే విధంగా ఉపయోగించుకోవాలి.అంతే కానీ ఇతరుల ప్రతిష్టకు భంగం కలిగే విధంగా, ఇతరులను కించపరచే విధంగా పోస్టులు పెట్టడం చేయరాదు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ, జిల్లా ఎస్పీ ఇచ్చిన ఆదేశాల మేరకు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు, అనుచిత వ్యాఖ్యలు, అసభ్యకర పోస్టులు పెట్టే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల మేరకు అటువంటి పోస్టులు పెట్టే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేయడం జరుగుతుందనీ డిఎస్పీ తెలిపారు.నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన సిఐ వెంకట ప్రసాద్,ఎస్.ఐ యన్.ప్రసాద్,ఎస్.ఐ అబ్దుల్ రెహమాన్ హెచ్.సి నూరుద్దీన్,పి.సి శివ నాగరాజు,పి.సి మురళిలను గుంటూరు జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ అభినందించారు..

# గుంటూరు జిల్లా ఎస్పీ గ్రీవెన్స్



**గుంటూరు క్రైమ్ ప్రభాతవార్త నవంబర్10:** ప్రతి సోమవారం జరిగే ఎస్పీ గ్రీవెన్స్ కు బాధితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఫిర్యాదులు సేకరించిన ఎస్పీ వకుల్ జిందాల్ బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**నన్ను నమ్మించి మోసం చేశారు బాధితుడు:** రాణా ప్రతాప్అరండల్ పేట **7/4** రాణా ప్రతాప్ కు సొంత బంధువులైన పోలగాని హైమావతి తనకు చెందిన ఎకరం పొలాన్ని రాణా ప్రతాప్ కి అమ్మేందుకు సిద్ధపడింది. అందుకు సంబంధించి ముందస్తుగా హైమావతి ఆమె భర్త అయిన లక్ష్మీ శ్రీనివాస్ ఎకౌంటుకు 7 లక్షల 48 వేల రూపాయలు జమ చేయించుకున్నారు. రాణా ప్రతాప్ కు అమ్ముతాను అన్న పొలం వేరొకరికి విక్రయించారు.విషయం తెలుసుకున్న రాణా ప్రతాప్ తనను మోసం చేశారంటూ తనకు న్యాయం చేయాలని,మోసగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరాడు.

## కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతినిధుల పర్యటనకు సంబంధించి

## భద్రత, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

**గుంటూరు క్రైమ్ ప్రభాతవార్త నవంబర్10:** వెంగళయపాలెం గ్రామంలోని మంచినీటి చెరువు వద్ద మంగళవారం జరగనున్న జాతీయ వాటర్ షెడ్ కార్యక్రమం,అమృత్ సరోవర్ అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనడానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతినిధులు పర్యటించనున్నారు.ఈ నేపథ్యంలో జరుగుతున్న భద్రత,బందోబస్తు ఏర్పాట్లను ఈరోజు సోమవారం గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ అషుతోష్ శ్రీవాస్తవ్ తో కలసి గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,స్వయంగా పరిశీలించారు.జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్) ఏ. హనుమంతు, ట్రాఫిక్ డిఎస్పీ బెల్లం శ్రీనివాస్, సౌత్ సబ్డివిజన్ డీఎస్పీ భానోదయ లీలీ సీఐ అలహరి శ్రీనివాస్, నల్లపాడు సీఐ వంశీధర్ తో కలసి క్షేత్ర స్థాయిలో పర్యటించి,



చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి, కేంద్ర బృంద సభ్యుల భద్రత మరియు బందోబస్తుకు సంబంధించి తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీసి, ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. ఎస్పీ మంచినీటి చెరువు కట్టపై కలియ తిరిగి, ఈ కార్యక్రమానికి సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి, అనువుగా అన్ని భద్రతా ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా భారీ కేడింగ్ ఏర్పాటు చేయడంతో పాటు,హాజరయ్యే కేంద్ర బృందం సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు మొదలైన వారి సంఖ్యను దృష్టిలో ఉంచుకుని తగిన భద్రత,బందోబస్తు చర్యలు చేపట్టాలని వెల్లడించారు.కార్యక్రమానికి సంబంధించిన రూట్ మ్యాప్ ప్రకారం ఏర్పాట్లను జరిగే విధంగా చూస్తూ, అవసరమైన చోట అదనపు ఏర్పాట్లు కూడా చేయాలని, బందోబస్తు నిమిత్తం అవసరమైన పోలీస్ అధికారులు మరియు సిబ్బందిని నియమించడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచనలు చేశారు.కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ బృందం భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటించాలి, ఎటువంటి లోపాలు లేకుండా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.అదేవిధంగా ఈ కార్యక్రమంలో బాగంగా లయోలా పాఠశాలలో జరగనున్న సమావేశం కొరకు ఏర్పాటు చేసిన స్టేజిను పరిశీలించి, స్టేజి నిర్మాణ తీరు, స్టేజి పటిష్టత, స్టేజి కెపాసిటీ, స్టేజిపై ఆశీనులయ్యే వారి వివరాలు,సమావేశానికి హాజరయ్యే ప్రజలకు కొరకు చేస్తున్న సీటింగ్ ఎరేంజ్ మెంట్లను పరిశీలించి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కంపార్ట్మెంట్ల మధ్య భారీ కేడింగ్ పటిష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు.కంపార్ట్ మెంట్లకు సంబంధించి సంఖ్యలను కేటాయించాలని,ప్రతి కంపార్ట్మెంట్ కి ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను ఏర్పాటు చేస్తూ, వాటిని సూచించేలా ప్రత్యేక సూచిక బోర్డులను ప్రదర్శించాలని వివరించారు.కార్యక్రమానికి వచ్చే వీవీఐపీలు, వీఐపీలు, ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రముఖుల వాహనాల పార్కింగ్ కి సంబంధించి కేటాయించిన పార్కింగ్ స్థలాలను పరిశీలించి, వాహనాల పార్కింగ్ కి సంబంధించి తగిన సూచిక బోర్డులను ఏర్పాటు చేసి, ఏ వాహనాలకు కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లో ఆ వాహనాలను మాత్రమే పార్కింగ్ చేయించేలా చూస్తూ, ఎక్కడా ఎటువంటి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, రూట్ బందోబస్తు ట్రాఫిక్ విధుల నిమిత్తం తగినంత మంది పోలీస్ అధికారులు,సిబ్బందినీ నియమించాలనీ తెలిపారు.చెరువు కట్టపై జరిగే కార్యక్రమానికి సంబంధించి అప్రమత్తంగా ఉండాలని, భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్దేశిత సంఖ్య ప్రజలను మాత్రమే అనుమతించాలని, వీవీఐపీ, వీఐపీల భద్రతను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమతించాలని తెలియజేశారు.

# ఏపీ సిఆర్డిఏ - సిఐఐ పార్ట్నర్షిప్ సమ్మిట్లో అమరావతిలో పెట్టుబడి అవకాశాలపై విస్తృత ప్రదర్శన

**గుంటూరు, నవంబర్ 10, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీ సిఆర్డిఏ) బృందం నవంబర్ 14–15, 2025 తేదీలలో విశాఖపట్నంలో జరగనున్న సిఐఐ పార్ట్నర్షిప్ సమ్మిట్ 2025లో పాల్గొననుంది. ఈ సందర్భంగా దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, ప్రముఖ సంస్థలు సీఈఓలు, డెవలపర్లు, విద్యా, వైద్యా, ఎలక్ట్రానిక్స్, మౌలిక వసతుల సంస్థలకు అమరావతి రాజధాని ప్రాంతంలోని పెట్టుబడికి సిద్ధంగా ఉన్న ప్రధాన అవకాశాలను ఏపీ సిఆర్డిఏ విస్తృతంగా వివరించనుంది.ఈ సమ్మిట్లో మౌలిక వసతులు, పట్టణాభివృద్ధి, లాజిస్టిక్స్, మొబిలిటీ, హరిత ఇంధనం, నీటి నిర్వహణ, గృహ నిర్మాణం, స్మార్ట్ సిటీ, పురపాలక సేవలలో సాంకేతికత వినియోగం వంటి విభాగాల వారీగా అభివృద్ధి క్లస్టర్లను ఏపీ సిఆర్డిఏ ప్రతినిధి బృందం ప్రదర్శించనుంది. పెట్టుబడిదారుల కోసం పబ్లిక్ప్రైవేట్ పార్ట్నర్షిప్ విధానంలో రూపొందించిన ప్రాజెక్ట్ నమూనాలు, వ్యూహాత్మకంగా ఉన్న భూభాగాలు, అమరావతిలో నిర్మిస్తున్న 9 థీమ్ సిటీస్, అలాగే ఏపీ సిఆర్డిఏ అందిస్తున్న సౌకర్యాలు, పెట్టుబడిదారులకై అవలంబిస్తున్న సౌకర్యవంతమైన విధానాలను సైతం ఈ సమ్మిట్లో ఏపీ సిఆర్డిఏ ప్రదర్శించనుంది. సిఐఐ పార్ట్నర్షిప్ సమ్మిట్లో పాల్గొనడంపై సిఆర్డిఏ కమిషనర్ కె. కన్నబాబు గారు మాట్లాడుతూ "అమరావతి భవిష్యత్దృష్టి కలిగిన రాజధాని ప్రాంతంగా, సమగ్ర ప్రణాళిక, సమర్థవంతమైన రవాణా వ్యవస్థ, పారదర్శక పాలన విధానాలతో ముందుకు సాగుతోంది. ఈ సమ్మిట్ ద్వారా పట్టణాభివృద్ధి, లాజిస్టిక్స్, మౌలిక వసతుల రంగాల్లో విశ్వసనీయమైన, సుస్థిర పెట్టుబడి అవకాశాలను వెతుకుతున్న సంస్థలతో భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలనుకుంటున్నాం. స్థిరమైన అభివృద్ధి, ఆవిష్కరణ, మరియు నగరాభివృద్ధిలో ఆసక్తి ఉన్న భాగస్వాములను ఆహ్వానిస్తున్నాం" అని తెలిపారు.సమ్మిట్ సందర్భంగా ఏపీ సిఆర్డిఏ క్రింది కార్యక్రమాలను నిర్వహించనుంది: .. పెట్టుబడిదారులతో వ్యక్తిగత సమావేశాలు .. అమరావతి అభివృద్ధి ప్రాజెక్ట్పై ప్రదర్శనలు విధానపరమైన వివరణలు .. దేశీయ, అంతర్జాతీయ వ్యాపార ప్రతినిధులతో సమన్వయ కార్యక్రమాలు .. ఆసక్తి గల పెట్టుబడిదారుల కోసం క్షేత్రస్థాయి సందర్శనలకై షెడ్యూల్ రూపకల్ప న అలాగే, అమరావతి రాజధాని ప్రాంతంలో పెట్టుబడులకు అందుబాటులో ఉన్న ప్రాధాన్య ప్రాజెక్టులు, విధాన ప్రోత్సాహకాలు, సులభతర సౌకర్యాల వివరాలతో కూడిన అందుబాటులో ఉన్న అవకాశాలపై వివరణను కూడా ఏపీ సిఆర్డిఏ విడుదల చేయనుంది. పెట్టుబడులు భాగస్వామ్యాల కోసం సంప్రదించాల్సి న ఏపీ సిఆర్డిఏ ఇన్వెస్ట్మెంట్ ఫెసిలిటేషన్ సెల్ వివరాలకై .అధికారిక వెబ్సైట్: www.apcrda.ap.gov.in చూడవచ్చని తెలిపారు

# అమరావతిలో ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ నిర్మాణానికి భూమిపూజ

**గుంటూరు, నవంబర్ 10, ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలోని పిచ్చుకలపాలెంలో 12 ఎకరాలలో నిర్మించనున్న ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ నిర్మాణానికి సోమవారం భూమి పూజ జరిగింది. రాజధానిలో నిర్మించనున్న ఈ అకాడమీలో విస్తృత శిక్షణ అందించి మెరికలలాంటి క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ అకాడమీ రాజధాని అమరావతిలో ఏర్పాటు కానుంది. భూమి పూజలో రిటైర్డ్ భారత క్రికెటర్ ప్రసాద్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు. 12 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటున్న ఎంఎస్కే ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం, ప్రపంచ స్థాయి క్రీడా శిక్షణ సముదాయంగా అభివృద్ధి చేస్తామని ప్రసాద్ తెలిపారు. అకాడమీ ద్వారా స్థానిక క్రికెటర్లలో ప్రతిభను పెంపొందించడం, అమరావతిలో క్రీడా మౌలిక వసతులను బలోపేతం చేస్తామన్నారు. అమరావతిలో



నిర్మించనున్న సముదాయంలో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన క్రికెట్ మైదానం, ప్రాక్టీస్ గ్రౌండ్లు, పూర్తి స్థాయిలో శిక్షణ సౌకర్యాలను కలిగి ఉంటుంది. అమరావతిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ క్యాంపస్లో .. ఆధునిక నెట్‌లు, క్రీడాకారుల సామర్థ్య విశ్లేషణా వ్యవస్థలతో కూడిన ఇండోర్ ట్రైనింగ్ అకాడమీ(సామర్థ్యం: 400 మంది శిక్షణార్థులు) ..క్రీడలలో శిక్షణతో పాటు అంతర్జాతీయ రెసిడెన్షియల్ పాఠశాల(సామర్థ్యం: 1,000 మంది విద్యార్థులు) .. క్రీడాకారులు సందర్శక జట్ల కోసం వసతి, హాస్టల్ సౌకర్యాలు .. స్థానికంగా టోర్నమెంట్ల నిర్వహణకై మినీ క్రికెట్ స్టేడియం .. అత్యాధునిక జిమ్‌లు, ఫిజియోథెరపీ పునరావాస కేంద్రం .. ఆధునిక ఫిట్నెస్ కండిషనింగ్ సదుపాయాలతో ఇండోర్, అవుట్డోర్ ట్రైనింగ్ జోన్లు .. ఒలింపిక్ ప్రమాణాలతో ఈత కొలను, క్రీడాకారుల ఆరోగ్య సంరక్షణకై సదుపాయాలు ఈ అకాడమీ సముదాయం నిర్మాణం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ స్థాయి క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలనే తన సంకల్పాన్ని మరొకసారి ప్రతిబింబిస్తోంది. అమరావతిని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో దిళిదీతి అకాడమీ నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తోంది.

# వర్షపు నీటిని ఒడిసి పడదాం.. జీవనాధారం పెంచుదాం: కేంద్ర మంత్రి 'పెమ్మసాని'

**గుంటూరు, నవంబర్ 10, ప్రభాతవార్త ప్రతినిధి:** వర్షపు నీటిని ఒడిసి పడదాం.. జీవనాధారం పెంచుదాం అని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్ పిలుపునిచ్చారు. వాటర్ షెడ్ మహోత్సవ్ పై రెండు రోజుల జాతీయ సదస్సు గుంటూరు వెల్కమ్ గ్రాండ్ హోటల్లో సోమవారం ప్రారంభం అయింది. ఈ కార్యక్రమానికి కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరులో మూడవ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. వెంగళాయపాలెంలో వాటర్ షెడ్ మహోత్సవ్ లో భాగంగా అమృత్ సరోవర్ క్రింద 21 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువును ఆహ్లాదకరంగా తయారు చేయడమే కాకుండా చుట్టూ చక్కటి ఉద్యాన వనంగా తీర్చిదిద్దడం జరిగిందని, చిన్నారులకు క్రీడా పరికరాలను, యోగ, వ్యాయామం చేయుటకు అనుగుణంగా పనులను చేపట్టామని, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ నీటి వసతులను పునరుద్ధరణ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా "ఎన్స్యూరింగ్ వాటర్ సెక్యూరిటీ, నర్చరింగ్ వేస్ట్ లాండ్, ఎంపవరింగ్ రూరల్ లైవ్లి హుడ్స్" రాజస్థాన్" అనే పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ సెక్రెటరీ నితిన్ కడే, రాష్ట్ర పంచాయతీ రాజ్ సంచాలకులు మైలవరపు కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ సి.పి.రెడ్డి, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, గ్రామీణ అభివృద్ధి శాఖ వాటర్ షెడ్ విభాగం సంచాలకులు వై.వి.కె. షణ్ముఖ కుమార్, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత వార్త
**స్టాఫ్ రిపోర్టర్లు, న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను**

విస్తృతమైన వార్తా సేకరణ యంత్రాంగం ఉన్న వార్త న్యూస్ నెట్వర్క్ను మరింత పటిష్టవంతంగా చేయాలనుకుంటోంది. పాఠకులకు మరింత తాజా వార్తలను అందించేందుకు పల్నాడు, గుంటూరు జిల్లాల్లో విలేకరుల యంత్రాంగాన్ని విస్తృతపరచాలని నిర్ణయించింది. ఆసక్తి గలవారికి స్టాఫ్రిపోర్టర్లు, న్యూస్ కంట్రిబ్యూటర్లయ్యే సదవకాశం కల్పిస్తోంది.

**అభ్యర్థులకు కావలసిన అర్హతలు**

- 35 ఏళ్ళ లోపు వయస్సు
- స్థానికంగా నివాసం
- ఇంటర్ లేదా డిగ్రీ
- ప్రజల జీవన స్థితిగతులపై అవగాహన

**న్యూస్ కంట్రిబ్యూటర్లు కావల్సిన కేంద్రాలు**

నాదెండ్ల, దుర్గి, రెంటచింతల, అమరావతి, తాడికొండ, మేడికొండూరు, భట్టిప్రోలు, నిజాంపట్నం, నగరం, దుగ్గిరాల, అమృతలూరు

ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటాతో సంప్రదించగలరు

13.11.2025 గురువారం

'వార్త' యూనిట్ కార్యాలయము

NH-5, చిలకలూరిపేట రోడ్, అంకిరెడ్డిపాలెం, గుంటూరు

బ్రాంచి మేనేజర్ ఫోన్: 89786 45935

## ఉర్దూ టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

గుంటూరు విద్య,నవంబర్ 10,ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ భాషాభివృద్ధికి,ఉర్దూ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభివృద్ధికి ఎంతో కృషిచేస్తుందని గుంటూరు మండల విద్యాశాఖాధికారి అబ్దుల్ ఖుద్దూస్,ఉర్దూ పాఠశాలల తనిఖీ అధికారి ఎండి ఖాశీం తెలిపారు.నగరంలోని చౌత్రాసెంటర్‌లోని



ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల్లో 10తరగతి ఉర్దూ మీడియం చదువుతున్న విద్యార్థినులకు సెంటర్ ఫర్ మైనార్టీ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిపుణులైన ఉపాధ్యాయులచే తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించిన స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత ్వం ఉర్దూ భాషకు కల్పిస్తున్న సదుపాయాన్ని ఉపయోగించుకొని విద్యార్థులందరూ చక్కగా చదువుకోవాలని ఉర్దూకు మంచి భవిష్యత్తు ఉందని,గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యుపిఎస్సీ ఫలితాల్లో ఉర్దూ మీడియం విద్యార్థులు ఐఏఎస్‌లుగా రాణించారని కాబట్టి ఉర్దూ భాష ప్రతి ఒక్కరూ నేర్చుకొని వారి జీవితానికి బంగారు బాట వేయాలన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.పద్మజ,సీనియర్ ఉపాధ్యాయులు అబ్దుల్ ఖయ్యూమ్,తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా అధికారులు



కారంపూడి, నవంబరు 10 ప్రభాతవార్త: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంపై జిల్లా ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.రాజేశ్వరి ఆకస్మికంగా సందర్శించారు. గర్భిణులకు అందుతున్న వైద్యసేవలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రల్లో బాలబాలికలకు చేస్తున్న ఆరోగ్య పరీక్షలు గురించి వివరాలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా॥ కె.లక్ష్మీమౌనిక, డా॥ ఎం.రమ్య, జిల్లా సూపర్‌వైజర్ ఎస్‌కే కరిముల్లా, మస్తాన్‌వలి, సీహెచ్‌ఓ మల్లయ్య, పీహెచ్‌సీ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సహాయకులు ఎం.లాలునాయక్, ఆశ కార్యకర్తలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మండల విస్తరణాధికారిగా శ్రీనివాసరెడ్డి



కారంపూడి, నవంబరు 10 ప్రభాతవార్త: కారంపూడి మండల పరిషత్ పంచాయ తీరాజ్ గ్రామీణ అభివృద్ధి విస్తరణాధికారిగా కె.శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. చిలకలూరిపేట నియోజక వర్గంలోని పసుమర్రు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరెడ్డి పదోన్నతిపై కారంపూడి మండల విస్తరణాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జిగా కసిన్యానాయక్‌గా విధులు నిర్వహించారు. ప్రభుత్వం శ్రీనివాసరెడ్డి నియామకం పట్ల ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు కసిన్యానాయక్, బొల్లేటి రవీంద్ర, చెన్నకేశవరెడ్డి, వివిధ గ్రామాల పంచాయతీల కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపి సన్మానించారు.

## మత్తుమందు కేసులో కటకటాల పాలైన బీజేపీనేత?

### తెలంగాణ పోలీసుల విచారణలో కొత్తమలుపు

కారంపూడి, నవంబరు 10 ప్రభాతవార్త: బీజేపీ నేత అరెస్టు వార్త కారంపూడి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. పార్టీ నాయకత్వం ఇంకా స్పందించకపోయినా, స్థానికంగా ఈ సంఘటన పెద్దదుమారమే లేపింది. ప్రజాప్రతినిధులు, వ్యాపార వర్గాలు ఇలాంటి ఘటనలు పార్టీ ప్రతిష్టను



దెబ్బతీస్తాయని అభిప్రాయపడుతున్నారు. పల్నాడు జిల్లా కారంపూడి పట్టణానికి చెందిన బీజేపీ నేత, వీరబ్రహ్మేంద్ర మెడికల్ స్టోర్ యజమాని శెట్టి హనుమంతరావు మత్తుమందు సరఫరా కేసులో తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అక్రమంగా మందులు విక్రయిస్తున్నారన్న ఆరోపణలపై పోలీసులు ఈ చర్య చేపట్టారు.

**మత్తుమందు బిల్లల సరఫరా బయటపడిన విధానం:** తెలంగాణలోని ఈదులగూడెం కూడలిలో పోలీసులు సాధారణ తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో మత్తుమందు బిల్లలతో ఇద్దరు యువకులు మచ్చ నవీన్, నక్క మహేష్ పట్టుబడ్డారు. వారిని ప్రశ్నించగా కారంపూడిలోని శెట్టి హనుమంతరావు మెడికల్ స్టోర్‌లో కొనుగోలు చేసినట్లు తెలిపారు. వారి వాంగ్మూలం ఆధారంగా పోలీసులు కారంపూడిలో దర్యాప్తు జరిపి హనుమంతరావును అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఆయన కుమారుడు శెట్టి జయరామచంద్ర ప్రసాద్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**స్పాస్మోప్రోక్సీవాన్ ప్లస్ బిల్లలే కేంద్రంగా విచారణ:** విచారణలో బయటపడిన వివరాల ప్రకారం స్పాస్మోప్రోక్సీవాన్ ప్లస్ పేరుతో విక్రయించే మత్తుమందు బిల్లలను తెలంగాణ యువతకు సరఫరా చేసే చైన్‌లో హనుమంతరావు, ఆయన కుమారుడి పాత్ర ఉన్నట్లు అనుమానం వ్యక్తమవుతోంది. పోలీసులు ఈ దిశగా మరిన్ని సాక్ష్యాలను సేకరిస్తున్నారు.

**పోలీసుల గాలింపు చర్యలు:** పరారీలో ఉన్న జయరామచంద్ర ప్రసాద్ ఆచూకీ కోసం మిర్యాలగూడ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల మధ్య సంయుక్త సమన్వయం ఉంటుందని సమాచారం.

## ఆంధ్రభాషోద్ధారకుడు సి.పి.బ్రౌన్

గుంటూరు కల్చరల్,నవంబర్ 10,ప్రభాతవార్త : సి.పి.బ్రౌన్ భారతీయుడు కాదు,తెలుగువాడు కాదనీ,కానీ ఆంధ్ర భాషోద్ధారకుడిగా చరిత్ర లో శాశ్వతస్థానం సంపాదించిన మహానుభావుడని అవగాహన సంస్థ సభ్యులు నివాళులర్పించారు.సంస్థ కార్యాలయంలో తెలుగుసూరీడు సి.పి.బ్రౌన్ జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సంస్థ సాంస్కృతిక



కార్యక్రమాల కోఆర్డినేటర్ బి.అశోక్ మాట్లాడుతూ సిపి బ్రౌన్ లేకుంటే మనం ఇవాళ చదువుకుంటున్న ప్రాచీన తెలుగు కావ్యాలు తాటాకులతోనే నిధిగా శిథిలమై పోయి ఉండేవన్నారు.ఆయన కేవలం తూర్పు ఇండియా కంపెనీ ఉద్యోగిగా,జీతగాడిగా ఉండిపోలేదని తన జీతంతో పండితులకు జీతమిచ్చి ప్రాచీన కావ్యాలను పరిష్కరింపచేశారు.తెలుగు-ఇంగ్లీషు,ఇంగ్లీషు-తెలుగు నిఘంటువులను రూపొందించి చాటన్నారు. ఇన్నాళ్ళకు రాష్ట్ర ప్రభుత్వం బ్రౌన్ పుట్టినరోజుని రాష్ట్ర పండుగగా జరపాలని నిర్ణయించడం హర్షణీయమన్నారు.కవయిత్రి పింగళి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్ర భాషామతల్లి సేవకే జన్మనెత్తిన మహా విద్వాంసుడు సి.పి.బ్రౌన్ అన్నారు.చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ కృషి వలన తెలుగుభాష ఆధునిక రూపం దాల్చి వెలుగొందుతుందన్నారు.కార్యక్రమంలో విశ్లేషకులు వి.వి.రావ్,గాయకులు సాయిబాబు,గాయనీ సౌజన్య,కవి జమదగ్ని తదితరులు నివాళులర్పించారు.

## కృష్ణానదిలో వలస కార్మికుని మృతదేహం లభ్యం

తుళ్ళూరు,నవంబర్ 10,ప్రభాతవార్త : మండల పరిధిలోని రాయపూడి లాంచీ రేవు వద్ద కృష్ణా నదిలో వలస కార్మికుడు నాగులపాడు పవన్ గణేశ్వరరావు(22)మృతదేహం సోమవారం లభ్యమైంది.మరో వలస కార్మికుడు పమిడిమర్రి దినేష్ ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్



బృందాలు,గజ ఈతగాళ్ళు గాలింపు కొనసాగిస్తున్నారు.ఆదివారం సాయంత్రం పవన్ గణేశ్వరరావు,దినేష్ మరో ఇద్దరు మణికంఠ,పవన్ కళ్యాణ్ అనే కార్మికులు రాయపూడి లాంచీ రేవు వద్ద కృష్ణానదిలో స్నానానికి దిగగా మణికంఠ,పవన్‌కళ్యాణ్ క్షేమంగా బయటపడగా ఇద్దరు గల్లంతయ్యారు.సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు నదిలో గాలింపు జరిపాయి.అయినప్పటికీ కార్మికుల ఆచూకీ తెలియలేదు.మధ్యాహ్నం గజ ఈతగాళ్ళను పిలిపించారు.పీతామల్లి అనే గజ ఈతగాడు,ఎన్డీఆర్ఎఫ్ బృందాల సాయంతో గాలించి పవన్ గణేశ్వరరావు మృతదేహాన్ని నదిలోంచి బయటకు తీసుకొచ్చాడు.మరో కార్మికుడు దినేష్‌కోసం గాలింపు కొనసాగుతోంది.పవన్ గణేశ్వరరావు తూర్పు గోదావరి జిల్లా,ఉప్పలగుప్తం మండలం,వల్లపల్లి గ్రామం కాగా,దినేష్ ప్రకాశం జిల్లా గిద్దలూరు గ్రామానికి చెందినవాడు,వీరు రాజధాని ప్రాంతం శాఖమూరు వద్ద హ్యాపీనెస్ట్ ప్రాజెక్ట్ నిర్మాణంలో కార్మికులుగా ఉన్నారు.

# ఏఎన్‌యుపై ఉన్నత విద్యామండలి ప్రత్యేక దృష్టి

- నిరంతరం పర్యవేక్షణకు ప్రణాళికలు
- పాలనా వ్యవహారాలపై నిశిత పరిశీలన

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబరు10, ప్రభాతవార్త: ఏఎన్‌యుపై ఉన్నత విద్యామండలి ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. రాజధాని అమరావతిలో ఉన్న ప్రభుత్వ యూనివర్సిటీ ఏఎన్‌యు. ఇక్కడి కార్యకలాపాలపై నిరంతరం పర్యవేక్షణ చేయాలనే ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిసింది. గతేడాది జూలై నుంచి నేటి వరకు వర్సిటీ సాధించిన ప్రగతిపై నివేదికలు తయారుచేసి ఇవ్వాలనే ఆదేశాలు వర్సిటీకి రానున్నాయి. రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో ఉన్న ఏఎన్‌యు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా స్కిల్ డెవలప్‌మెంట్, క్యాంటమ్‌టెక్నాలజీ, ఏఐ అండ్ యంఎల్ వంటి కోర్సులను ప్రారంభించి ఎక్కువమంది విద్యార్థులకు ఉపాధి కల్పించడం, వారిని ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా తీర్చిదిద్దడం జరుగుతుంది. గత బుధవారం మంత్రి లోకేష్ ఉన్నత విద్యపై సమీక్ష నిర్వహించారు. సిలబస్ మార్పు, యూనిఫైడ్ యాక్ట్ రూపకల్పన, పరిశ్రమలతో అనుసంధానం, 100శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పన, వర్సిటీల్లో ప్రతీ విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం తప్పనిసరి చేయాలని ఆదేశించారు. సమర్థ్, ఈ-గవర్నెర్స్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల మెరుగుదల, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు.

ఈక్రమంలో కొద్ది రోజుల క్రితం ఉన్నతవిద్యా మండలిలో ఒ అధికారివద్ద ఏఎన్‌యు అభివృద్ధి ప్రస్తావన వచ్చింది. అ సమయంలో ఏఎన్‌యు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వినికిడి. వర్సిటీకి ఎవరు ఎప్పుడు వస్తారో... ఎవరు తరగతులు నిర్వహిస్తారో తెలియదనే చర్చ జరిగింది. సమయపాలన లేకపోవడం ఏఎన్‌యు అభివృద్ధికి ఆటంకం కలుగుతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారని తెలిసింది. వీసి, రెక్టర్, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు సమయానికి వర్సిటీకి వచ్చినంత మాత్రానా మేము రావాలా అనే భావనలో కొందరు ఉద్యోగులు, అధ్యాపకులు ఉన్నట్లు వర్సిటీలో ప్రధాన చర్చగా ఉంది.

తరగతుల నిర్వహణపై ప్రిన్సిపాల్స్ ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటి వరకు పీజీ కోర్సుల ప్రవేశాల వల్ల తనిఖీలు కొంత ఆలస్యమైనట్లు తెలిసింది. వర్సిటీ ఉన్నతాధికారులు ఈ విషయంపై నిశిత పరిశీలన చేస్తున్నారు.

## ప్రజల సంతృప్తి స్థాయి మెరుగుపడాలి: జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్, నవంబరు 10, ప్రభాతవార్త : జిల్లాలో ప్రజలు నుంచి వివిధ శాఖలకు అందించిన ఫిర్యాదు అర్జీలను దరఖాస్తుదారుల సంతృప్తి స్థాయిని మెరుగుపరిచేలా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సూచించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి ,



డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 261 అర్జీలు ప్రజలు అందించగా, వీటిని పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలను క్షేత్రస్థాయిలో సక్రమంగా విచారించి పరిష్కరించాలని తెలిపారు. దరఖాస్తుదారులకు నిర్దేశిత మార్గదర్శకాలను పాటిస్తూ కచ్చితంగా ఎండార్స్ మెంట్ ఇవ్వాలని తెలిపారు. అధికారులు ముఖ్యమైన అంశాలకు సంబంధించి జాబితాను తయారు చేసుకోవాలని పై అధికారులు అడిగినప్పుడు వెంటనే స్పందించేలాగా ఉండాలన్నారు. పెండింగ్ లో వున్న సి.ఎం.ఓ. గ్రీవెన్స్ ను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడి డీఆర్ డీఏ విజయలక్ష్మి , జిల్లా విద్యాశాఖాధికారి రేణుక , పశుసంవర్ధక శాఖ జె డి ఏ సత్యనారాయణ, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి, ఏడి మైక్రోఇరిగేషన్ వజ్రశ్రీ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ చక్రవర్తి, కలక్టరేట్ ఎఒ పూర్ణ చంద్రరావు, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సుపరింటేండెంట్ మల్లేశ్వరి , తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమ నియోజకవర్గంలో 72 మందికి రూ. 71 లక్షల చెక్కులు పంపిణీ

గుంటూరు వెస్ట్, నవంబర్ 10, ప్రభాతవార్త: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి చేతుల మీదుగా సోమవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ చెక్కుల పంపిణి కార్యక్రమంలో 72 మందికి గాను మొత్తం రూ.77 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే గళ్ళా మాధవి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో ఉన్న ఆపన్నులకు ముఖ్యమంత్రి



చంద్రబాబునాయుడు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రజలకు ఊరట కల్పిస్తున్నారని, ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారు ఎప్పుడూ బడుగు, బలహీన, మధ్యతరగతి వర్గాల క్షేమానికే కృషి చేస్తుంటారు. ఆయన దీవెనలతో ఈరోజు అనేకమంది వైద్య చికిత్సల నిమిత్తం ఆర్థిక సాయం పొందుతున్నారని తెలిపారు.కేవలం గత ఒకటిన్నర సంవత్సర కాలంలోనే పశ్చిమ నియోజకవర్గంలోని 337 మందికి రూ.4 కోట్లు 63 లక్షల రూపాయల సహాయ నిధి చెక్కులను అందజేశాం. ప్రతి ఒక్క లబ్ధిదారు కూడా ఈ సాయం తమ జీవితాల్లో గొప్ప ఊరటగా భావిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయపరిచే నాయకుడు చంద్రబాబు నాయుడేనని, ఆయన నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల క్షేమం కోసం కృషి చేస్తూనే ఉంటుంది," అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, వైస్ ప్రెసిడెంట్లు, కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## గుంటూరు ఛానల్లో యువకుని గల్లంతు

మంగళగిరి, నవంబర్ 10, ప్రభాతవార్త మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి కాలనీ సమీపంలో గల గుంటూరు ఛానల్ కాలవలో స్నానం చేసేందుకు భవాని మాలను స్వీకరించిన తాడేపల్లి కి చెందిన ఇరువురు గట్టుపై అదుపుతప్పి కాలువలో పడిన ఘటనలో ఓ వ్యక్తి గల్లంతయిన ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది.గల్లంతైన వ్యక్తి తన స్నేహితునితో కలిసి గుంటూరు ఛానల్‌కాలవ



సమీపంలోని ఓ అపార్ట్మెంట్ పనికి వచ్చినట్లు సమాచారం . రక్షి ంచేందుకు అతనితో స్నానం ఆచరించడానికి వెళ్లిన స్నేహితుడు కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, తనతోపాటు అతను కూడా మునిగిపోయే పరిస్థితి ఏర్పడడంతో చేసేదిలేక తన స్నేహితుడిని కాపాడలేక బయటికి వచ్చేసానని భవాని స్వామి తెలిపారు.కాలువపారుదల ఎక్కువగా ఉండటం, అలాగే అందులో గుంటూరు ఛానల్ కాలవ మొత్తం గుర్రపు డెక్క ఎక్కువగా ఉండటంతో స్నేహితుని కాపాడలేకపోయానని స్నేహితుడు బోరున విలపించారు.ఘటన స్థలానికి చేరుకున్న పట్టణ పోలీసులు కల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మంగళగిరి ఫైర్ అధికారులు వెంకట్ రెడ్డి వారి సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందం , స్థానిక పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.గల్లంతైన వ్యక్తికి 22 సంవత్సరాలు ఉండవచ్చునని తెలుస్తుంది. తల్లిదండ్రులు లేకపోవడంతో వారి బంధువుల వద్ద సిమెంటు పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## ఎస్ఎస్‌సి పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

గుంటూరు విద్య ప్రభాతవార్త: వచ్చే ఏడాది మార్చి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు నిర్దిష్ట పరీక్ష ఫీజులను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు చెల్లించే అంశాలలో షెడ్యూల్ ను, బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ వారు విడుదల చేశారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజును ఆయా ప్రధానోపాధ్యాయులకు ఈనెల 13వ తేదీ నుండి 20వ తేదీ వరకు చెల్లించవచ్చు. 50 రూపాయల ఫైన్ తో నవంబర్ 26 నుంచి డిసెంబర్ 3 వరకు చెల్లించవచ్చు. 200 రూపాయల ఫైన్ తో డిసెంబర్ 4 నుంచి 10 వరకు చెల్లించవచ్చు. 500 రూపాయల ఫైన్ తో డిసెంబర్ 12 నుంచి డిసెంబర్ 15 వరకు ఆయా విద్యార్థులు చెల్లించవచ్చు. రెగ్యులర్ విద్యార్థులు 125 రూపాయలు పరీక్ష ఫీజుగా చెల్లించాలి. మూడు సబ్జెక్టుల కంటే ఎక్కువ ఉన్న విద్యార్థులు కూడా 125 రూపాయలు చెల్లించాలి. మూడు సబ్జెక్టులు అంతకంటే తక్కువ సబ్జెక్టులు ఉన్నవారు 110 రూపాయలు, ఒకేషనల్ విద్యార్థులు అదనపు సబ్జెక్టు 60 రూపాయలు చొప్పున చెల్లించాలి. వయసు కాండి నేషన్ అభ్యర్థులు 300 చెల్లించాలి.

## మీ డబ్బు - మీ హక్కు పోస్టర్ ను ఆవిష్కరించిన కలెక్టర్

గుంటూరు వెస్ట్, నవంబరు 10, ప్రభాతవార్త : ఆర్థిక రంగంలో క్లైమ్ చేయని ఆస్తుల యొక్క ఆర్థిక అవగాహన పై కేంద్ర ఆర్థిక శాఖ " మీ డబ్బు - మీ హక్కు "పేరుతో దేశ వ్యాప్త ప్రచారం నిమిత్తం రూపొందించిన పోస్టర్ ను సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె ఖాజావలి , డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి , లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి తో కలసి ఆవిష్కరించారు. జిల్లాలో 7,18,055 రిటైల్ ఖాతాలలో రూ.120 కోట్లు , 24,221 ఇన్స్యూరెన్స్ మరియు ఆర్గనైజేషన్ ఖాతాలలో రూ. 22.02 కోట్లు , 6,672 గవర్నమెంట్ ఖాతాలలో రూ.7.03 కోట్లు మొత్తం రూ. 149.47 కోట్లు అన్ క్లైమ్డ్ డిపోజిట్స్ వున్నాయని ఎల్ డి యం పేర్కొన్నారు. బీమా పాలసీ క్లైమ్స్ , బ్యాంక్ డిపాజిట్లు , డివిడెండ్ లు, షేర్లు మరియు మ్యూచువల్ ఫండ్ రాబడులతో సహా ప్రజలు క్లైమ్ చేయని ఆర్థిక ఆస్తులు క్లైమ్ చేసేందుకు " మీ డబ్బు - మీ హక్కు " అనే నినాదంతో ప్రచారం నిర్వహించడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో పిడి డీఆర్ డీ ఏ విజయలక్ష్మి , జిల్లా విద్యాశాఖాధికారి రేణుక , పశుసంవర్ధక శాఖ జె డి ఏ సత్యనారాయణ, జిల్లా ఉపాధి అధికారి



దుర్గాబాయి, , ఏడి మైక్రోఇరిగేషన్ వజ్రశ్రీ, ఆర్డ బ్ల్యూఎస్ ఎస్ఈ చక్రవర్తి, కలక్టరేట్ ఏఓ పూర్ణ చంద్రరావు, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సుప రింటేండెంట్ మల్లేశ్వరి పాల్గొ న్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక



కాకుమాను నవంబర్ 10(ప్రభాతవార్త): స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఒక అర్జీ అందినట్లు తహసిల్దార్ బి.వెంకటస్వామి మీడియాకు తెలిపారు. అర్జీలను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపి సత్వరమే అర్జీను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు

పెదనందిపాడు నవంబర్ 10 (ప్రభాతవార్త) మండలంలోని నాగులపాడు ఎస్టి కాలనీలోని ఎంపీపీ ఎస్ పాఠశాల. నాగుపాడు మెయిన్ పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం భోజనం పథకం తో పాటు రికార్డు లను మండల విద్యాశాఖ అధికారి కెఎఫ్ కెనడి పరీక్ష చేశారు. ఈ సంవత్సరం గారు



మాట్లాడుతూ విద్యార్థులకు భోజనం తయారు చేసే విషయంలో అశ్రద్ధ వహిస్తే సహించేది లేదని. హెచ్చరించారు చిన్నారులతో కూర్చొని వారికి తయారుచేసిన భోజనాన్ని ఆయన స్వయంగా తిన్నారు. ఇదే విధంగా ప్రతిరోజు మెనూ ప్రకారం తయారు చేయాలని ఆదేశించారు. రికార్డులు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ వెంట పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉమా. మోనికలతో పాటు ఆయా పాఠశాలల సిబ్బంది ఉన్నారు.

## యంఎన్‌డి డెవలప్‌మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్‌కు కలిసిన వర్సిటీ ఉద్యోగులు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబరు10, ప్రభాతవార్త: ముస్లిం నూర్‌భాషా దూదేకుల (యంఎన్‌డి) డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన షేక్ షుకూర్‌ను సోమవారం వర్సిటీ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి అందిన ఆహ్వానం మేరకు వర్సిటీ సూపరింటెండెంట్ కె.బాజీబాబు, డైలీవేజ్ వర్కర్స్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ బి.రత్తయ్యలు శుకూర్‌ను



మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం శుకూర్‌పై నమ్మకంతో డైరెక్టర్ బాధ్యతలు అప్పగించడం అభినందనీయం అన్నారు. కార్పొరేషన్ అభివృద్ధికి శుకూర్ కృషిచేస్తారని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో శుకూర్ ఉన్నతశిఖరాలు అధిరోహించాలని కోరారు.

**నేడు జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు**


వర్సిటీలోని విద్యా విభాగం ఆద్వర్యంలో మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ఆచార్య పి.బ్రహ్మాజీరావు తెలిపారు. ఉదయం 11.30గం.లకు ఆచార్య దక్షిణామూర్తి సెమినార్ హాల్‌లో వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. చీఫ్ గెస్ట్‌గా వీసి ఆచార్య కె.గంగాధరరావు, గౌరవ అతిథులుగా రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.వీరయ్య, ఆచార్య యం.సురేష్‌కుమార్‌లు హాజరౌతారని వివరించారు.

**ఐసిఎస్ఐ ఆధ్వర్యంలో నేడు సింపోజియం**

ద ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసిఎస్ఐ) అమరావతి చాప్టర్, ఏఎన్‌యు కామర్స్ విభాగం సంయుక్తంగా కార్పొరేట్ గవర్నెన్స్ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ ద ఫైనాన్షియల్ ఫ్రాడ్స్ అనే అంశంపై మంగళవారం సింపోజియం నిర్వహిస్తున్నట్లు కామర్స్ విభాగాధిపతి, రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ తెలిపారు. ఆచార్య వి.బాలమోహన్ దాస్ సెమినార్ హాల్‌లో సింపోజియం జరుగుతుందని పేర్కొన్నారు.

## ఆర్‌విఆర్ జేసి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు


గుంటూరు విద్య,నవంబర్ 10,ప్రభాతవార్త : ప్రపంచ ప్రఖ్యాత ఆటోమొబైల్ భాగాల తయారీ సంస్థ డెల్ఫీ టివిఎస్ శ్రీపెరంబూదూర్ కంపెనీ ఇటీవల తమ కళాశాల్లో నిర్వహించిన ప్రాంగణ నియామకంలో భారీ సంఖ్యలో 114మంది విద్యార్థులు ఎంపిక కావడం గర్వకారణమని,వీరికి ఆకర్షణీయమైన ప్యాకేజీతోపాటు,ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.18000లు స్టైఫండ్ కూడా



కంపెనీ అందించడం ఆనందదాయకమని ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్,డాక్టర్ జగదీష్ కె.మద్దినేని తెలిపారు.ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను సోమవారం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ,కళాశాల సిబ్బంది అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం నుండి 62మంది,ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం నుండి 33మంది,మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం నుండి 19మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు.కార్యక్రమంలో కళాశాల అకడమిక్ అండ్ ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర,ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు సిహెచ్ శ్రీనివాసరావు,డాక్టర్ కె.సురేష్‌బాబు,వివిధ శాఖల విభాగాధిపతులు,ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## కార్మికులకు చీరల పంపిణీ

గుంటూరు విద్య,నవంబర్ 10,ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి జన్మదినం సందర్భంగా వారి కుటుంబ ఆప్తులు చెరుకూరి రమేష్ ఆధ్వర్యంలో నగరంలోని మిర్చియార్డులో పని చేస్తున్న 60మంది మహిళా కార్మికులకు ప్రముఖ



విద్యావేత్త డాక్టర్ కన్నా మాస్టారు చేతుల మీదుగా చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కన్నామాస్టారు మాట్లాడుతూ పేద,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతున్న అయ్యన్నపాత్రులు మరియు వారి సతీమణి పద్మావతి నిండూ నూరేళ్ళు ప్రజల మన్ననలకు పాత్రులై ప్రజాసేవలో వర్ధిల్లాలని వారికి పేదల ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయన్నారు.వారి సతీమణి వారికి చేదోడు వాదోడుగా ఉంటూ వారు కూడా ప్రజాసేవ చేయడంలో వెనకడుగు వేయని మహిళా నాయకురాలని వారి సేవలను ప్రశంసించారు.కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు అబ్దుల్ ఖుద్దూస్,ఎండి ఖాశీం పాల్గొన్నారు.

# ప్రయాణీకులకు తప్పని తిప్పలు

రేపల్లె, ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకానికి విశేషమైన ఆదరణ లభిస్తున్నప్పటికీ అవసరమైన స్థాయిలో బస్సులు లేకపోవడంతో ఆర్టీసీ ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ పథకం అమలుతో బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య ఏ స్థాయికి చేరిందంటే పురుషులు నిలబడి ప్రయాణించే స్థాయికి చేరుకుంది.కొన్ని బస్సుల్లో సీట్లు లేక మహిళలు నిలబడే ప్రయాణించాల్సి వస్తోంది.ఈ పథకానికి పూర్వం మహిళలు, వృద్ధులకు ప్రతి బస్సులోనూ సీటు రిజర్వేషన్ సౌకర్యం ఉండేది. వారికి కేటాయించిన సీట్లలో ఎవరైనా పురుషులు కూర్చుని ఉంటే వారిని ఖాళీ చేయించేవారు.ఇప్పుడు సీటు రిజర్వేషన్ అటకెక్కింది.మహిళా ప్రయాణీకులే ఎక్కడ సీట్లు ఉంటే అక్కడ కూర్చుంటున్నారు. బస్సులోకి ప్రవేశించాలంటే సీట్ల కోసం తోపులాట, వాదోపవాదాలు చోటు చేసుకోవడం నిత్యకృత్యమైంది.పురుష ప్రయాణీకులు పోటీ పడలేక మహిళలు బస్సులోకి ప్రవేశించాక చేరుకోవాల్సి వస్తోంది.ఆయా బస్ స్టేషన్లలో ప్లాట్ ఫారంపై బస్సులు ఆగక ముందే ఎదురు వెళ్ళటంతో డ్రైవర్లు ఓ పక్కన బస్సును నిలుపుకుని ప్రయాణీకులు నిండాక బయల్దేరి వెళ్ళాల్సి వస్తోంది.బయల్దేరటానికి ముందే ప్రతి బస్సు రద్దీ కారణంగా గ్రామీణ ప్రాంతాల్లోని బస్ స్టాప్ లలో బస్సులు ఆగకుండానే వెళ్తున్నాయి.దిగే వాళ్ళు ఉంటే స్టేజికి ముందో దాటాకనో దింపేసి వెళ్తున్నారు.ఇక రిక్వెస్ట్ స్టాప్ లలో ఆర్టీసీ బస్సులు ఆగటం లేదు.ప్రయాణీకులతో బస్సుల ఆలస్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ఉన్నతాధికారులే రిక్వెస్ట్ స్టాప్ లు రద్దు చేశారని కండక్టర్లు చెబుతున్నారు.అయితే రిక్వెస్ట్ స్టాప్ లను పునరుద్ధరించాలని ప్రయాణీకులు డిమాండ్ చేస్తున్నారు.బస్సుల సంఖ్య పెంచితే రద్దీ సమస్యకు తావులేకుండా అందరూ ప్రయాణించే అవకాశం లభిస్తుందని ప్రయాణీకులు సూచిస్తున్నారు.





## సమస్యలను పరిష్కరిస్తాం: ఆర్డీవో రామలక్ష్మి

రేపల్లె, నవంబరు 10, ప్రభాతవార్త:ప్రజల నుంచి తమ దృష్టికి వచ్చిన సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారిణి ఎన్.రామలక్ష్మి చెప్పారు.సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమంలో సమస్యలకు సంబంధించిన మూడు అర్జీలు అందాయని ఆర్డీవో రామలక్ష్మి వెల్లడించారు.నిజాంపట్నం మండలంలోని ఆముదాలపల్లిలో తన భూమిని ఆన్లైన్లో ఉంచి నమోదు చేయాలని కోరుతూ భట్టిప్రోలు మండలంలోని పెదపులివర్రుకు చెందిన శీలం పాప అర్జీ సమర్పించారు.నిజాంపట్నం మండలంలోని దిండి గ్రామంలో తనకు చెందిన 96 సెంట్లు భూమిని సర్వే చేయించాల్సిందిగా పి.చెంచురామారావు అర్జీ సమర్పించారు.చెరుకుపల్లి మండలంలోని పొన్నపల్లిలో తమ నివాసం పక్కనే ఉన్న బిర్యానీ పాయింట్ నుంచి వెలువడే పొగ కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చర్యలు తీసుకోవాలని కోరుతూ జూపూడి లక్ష్మీ కుమారి అర్జీ సమర్పించారు.



## పేదలకు న్యాయం చేయాలి



రేపల్లె, నవంబరు 10, ప్రభాతవార్త:తుఫాన్ పునరావాస కేంద్రాలలో పేర్లు నమోదైన వారందరికీ నష్టం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు.సోమవారం పట్టణంలోని పిఎంఎవై ఎన్టీఆర్ నగర్,20వ వార్డు పెట్రోల్ బంకు వెనుక కాలనీ, లోతట్టు ప్రాంతాల ప్రజలు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ సాంబశివరావుకు సమర్పించారు.ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ పేదల నివాసాల చుట్టూ నిలిచిపోయిన నీటిని తోడించాలని బ్లీచింగ్ చల్లించాలని కోరారు.మురుగునీటి పారుదల వ్యవస్థ, రహదారులు లేనందున పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కమిషనర్ సాంబశివరావు దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో బాధితులు,పిఎంఎవై ఎన్టీఆర్ నగర్ అభివృద్ధి కమిటీ,సిపిఎం నేతలు కె.నాంచారమ్మ,డి.అగస్టీన్,వి.ధనమ్మ,కె.ఆశీర్వాదం,ఎం.డి.ఫర్జానా,బి.రాము,కె.సింధూదేవి తదితరులు పాల్గొన్నారు.

## పాడిపరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలి

రేపల్లె, నవంబరు 10, ప్రభాతవార్త:పాడి పరిశ్రమ అభివృద్ధికి దోహదపడుతున్న పాల ఉత్పత్తిదారులు అభినందనీయులని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు, సీనియర్ టిడిపి నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు.సోమవారం ఇసుకపల్లి పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పాడిపరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఇసుకపల్లి పాల ఉత్పత్తిదారుల వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎం.ఎస్.తేజకుమార్,కె.నాంచార రావు,సిహెచ్.ప్రశాంత్,వై.యానాదిరావు, వీరశంకర్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.





## కాపు కార్పొరేషన్ డైరెక్టర్లను నియమించాలి

రేపల్లె,నవంబరు 10,ప్రభాతవార్త: రాష్ట్రంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్లను నియమించాలని కాపు పొలిటికల్ జెఏసి ఛైర్మన్ వేల్పూరి శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం భట్టిప్రోలులో ఆయన మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటానికి కాపు సామాజికవర్గం శక్తి వంచన లేకుండా పనిచేసిన వాస్తవాన్ని విస్మరించరాదన్నారు.అన్ని కార్పోరేషన్లకు డైరెక్టర్లను నియమించిన ప్రభుత్వం వెంటనే కాపు కార్పోరేషన్ కు డైరెక్టర్లను నియమించాలని సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు లేఖ రాసినట్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా విన్నకోట శ్రీనివాసరావు

మంగళగిరి, నవంబర్ 10, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గా తెలుగుదేశం పార్టీ నాయకులు విన్నకోట శ్రీనివాసరావు ను నియమించారు. సోమవారం సాయంత్రం విడుదలైన నామినేటెడ్ పదవుల జాబితాలో విన్నకోట శ్రీనివాసరావు కు పేరును ఖరారు చేస్తూ, ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విన్నకోట శ్రీనివాసరావు మాట్లాడుతూ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవిని కేటాయించిన రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. కాపు సామాజిక వర్గం అభ్యున్నతికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## స్కేటింగ్ లో సుంకర ధరణీశ్వర్‌కు స్వర్ణం



తాడేపల్లి,నవంబర్ 10,ప్రభాతవార్త : విశాఖపట్నం శివాజీ పార్కులో విశాఖపట్నం రోలర్ సే ్కటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7,8తేదీల్లో జరిగిన జిల్లాస్థాయి 37వ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్-2025పోటీల్లో ఇండియన్ అమెచ్యూర్ రోలర్ అకాడమీ స్కేటర్,విశాఖపట ్నంలో ఉంటున్న చినకాకానికి చెందిన సుంకర ధరణీశ్వర్ గోల్డ్,సిల్వర్‌మెడల్స్ సాధించాడు.ఇన్‌లైన్ ఫ్రీ స్టైల్ స్కేటింగ్ విభాగంలోని స్పీడ్,క్లాసిక్ పోటీల్లో దరణీశ్వర్ తలపడి రెండు మెడల్స్ సాధించాడు.స్కేటింగ్ క్లాసిక్ విభాగంలో ప్రథమస్థానంలో గోల్డ్‌మెడల్ సాధించగా,సీ ్పడ్ విభాగంలో ద్వితీయ స్థానం సిల్వర్ మెడల్ సాధించాడు.ముఖ్యఅతిధిగా హాజరైన తూర్పు గోదావరి జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి మురళీ చేతుల మీదుగా ధరణీశ్వర్ మెడల్స్ అందుకున్నాడు.మెడల్స్ అందుకున్న ధరణీశ్వర్‌ను అకాడమి కార్యదర్శి శీలం లక్ష్మణ్,కోచ్‌లు సింహాచలం,కెవిఎం మనోహర్ అభినందించారు.ఈ సందర్భంగా ధరణీశ్వర్ మెడల్స్ సాధించడానికి ఉత్తమ శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు,అకాడమీ ప్రతినిధులకు క్రీడాకారుడు ధరణీశ్వర్ తల్లిదండ్రులు సుంకర ఉమామహేశ్వరరావు,అనితాదేవి ధన్యవాదాలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో సూర్యప్రకాష్ మృతి



కొల్లిపర,నవంబరు 10 ప్రభాతవార్త: మండల పరిధిలోని అన్నవరం గ్రామానికి చెందిన యువకుడు వైజాగ్‌లో ఉద్యోగం చేస్తూ ప్రమాదవశాత్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది.బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కారుమంచి చిన సూర్యప్రకాశ్ (44) వైజాగ్‌లో హిందూజా పవర్ ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు.ఆదివారం విధులు ముగించుకుని ఇంటికి వచ్చే క్రమంలో ఇతను ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొనటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.మృతునికి భార్య..ఇద్దరు పిల్లలు ఉన్నారు.సూర్యప్రకాష్ మృతితో అన్నవరంలో విషాద చాయలు అలముకున్నాయి.

# బాపట్ల జిల్లా వార్త



## మున్సిపల్ గ్రీవెన్స్‌కు 5 ఫిర్యాదులు

తెనాలి మున్సిపాలిటీ, నవంబర్ 10, (ప్రభాతవార్త):ప్రతి సోమవారం పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించే,ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.సదరు అర్జీలను సంబంధిత విభాగాధిపతులకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా పంపించారు.ఇంజనీరింగ్ విభాగం నుండి ఈ-సేవా భవనంలో ఉన్న ఇనుప మంచాలను తొలగించవలెనని,రోడ్డు ఎత్తును



పెంచుతూ కాలువ నిర్మాణం చేయవలెనని,ఇంటికి నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో నీటి కుళాయి తొలగించవలెనని,పట్టణంలోని బస్‌స్టాండ్ సమీపంలో కొత్త స్ట్రీట్ లైట్ ఏర్పాటు చేయవలెనని,అర్జీలు అందాయి. అలాగే టౌన్ ప్లానింగ్ విభాగానికి,రోడ్డు విస్తరణ ద్వారా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించవలెనని ప్రజలు కోరినారు.సోమవారం పురపాలక సంఘ పరిధిలోగల వైకుంఠపురం దగ్గర నుండి విఎస్ఆర్!! ఎన్వీఆర్ వంతెన వరకు ప్రధాన రహదారి సెంట్రల్ లైటింగ్ పనులను పరివేక్షి ంచి సిబ్బందికి తగిన సూచనలు తెలిపిన మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఇంజనీర్ మరియు సిబ్బంది.అనంతరం 1వ వార్డునందు నిర్మించబోవుచున్న పైకాస్ థీమ్ పార్క్ ను సందర్శించి, పార్కుకు కావలసిన పరికరాల గురించి సిబ్బందికి తగిన సూచనలు తెలిపిన మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్ మరియు సిబ్బంది.

## రైతుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం: రైతుసంఘం విమర్శ

తెనాలి టౌన్ నవంబర్ 10 (ప్రభాతవార్త): రైతుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు విమర్శించారు. సోమవారం పట్టణంలోని ఐతానగరంలో గల నన్నపనేని సీతారామయ్య ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన తెనాలి డివిజన్ రైతు సంఘం మహాసభలో పలువురు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్న శివ శంకర్రావు మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని రైతాంగానికి ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు పరచలేదన్నారు. ప్రధానంగా వారు ఇచ్చిన హామీలైన అన్నదాత సుఖీభవ ద్వారా ప్రతి రైతుకు రు.20వేలు,పాడి రైతుకు సబ్సిడీ రుణాలు లాంటి పథకాలను ఇంతవరకు అమలు పరచలేదని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు.




ఎన్నికల్లో అధికారం కోసం రైతాంగానికి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకోకపోవడం వల్ల,భవిష్యత్తులో కూటమి ప్రభుత్వానికి రైతులు మద్దతు ఇవ్వరని, అలాగే ఈమధ్య వచ్చిన భారీవర్షాలు తుఫానుకు రాష్ట్రంలో చాలా జిల్లాల్లో రైతులు పంటలను కోల్పోయి,నేటికీ ప్రభుత్వ పరంగా పంట నష్టం అంచనాకి అధికారులు రాలేదని, నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతేకాకుండా పంటలకు కనీస మద్దతు ధర కల్పించి రైతాంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉందని ఏపీ రైతు సంఘం తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు జొన్న శివశంకరరావు తెనాలి డివిజన్ నాయకులు మొలక శివ సాంబిరెడ్డి పలువురు రైతులు రైతు కూలీలు పాల్గొన్నారు.

## కాలువలోకి దూసుకెళ్లిన ఇసుక ట్రాక్టర్

తెనాలి టౌన్ నవంబర్ 10 (ప్రభాతవార్త): రూరల్ మండల గ్రామం అంగలకుదురు లోని ప్రధాన మార్గంలో సోమవారం ఉదయం ఇసుకలోడు కలిగిన ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకు వెళ్ళింది. బ్రహ్మంగారి గుడి సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో,రోడ్డుపై ఉన్న భారీ గుంతలో పడి ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న పంటకాలవలోకి దూసుకెళ్లింది. దీంతో రోడ్డుపై ఇసుక చెల్లా చెదురుగా పడింది.ఎవరికి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.ఇసుక ట్రాక్టర్ అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోవటానికి ప్రధాన కారణం రోడ్డుపై ఉన్న భారీ గుంత అని గ్రామస్తులు చెబుతున్నారు. నడిరోడ్డుపై నిత్యం వందలాది బస్సులు లారీలు ట్రాక్టర్లు ద్విచక్ర వాహనాలు ప్రయాణించే ప్రధాన మార్గంలో సుమారుగా అడుగున్నర మేర రోడ్డు కృంగిపోయి గుంత ఏర్పడి తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని,వాహనందగ్గరకు వచ్చేవరకు గుంత కనపడదని,గత నాలుగు నెలలుగా ఇదే విధంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవట్లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



## శైవక్షేత్రాల్లో కార్తీక దీపారాధనలు

తెనాలి మున్సిపాలిటీ నవంబర్ 10 (ప్రభాతవార్త): ఎంతో పవిత్రమైన కార్తీకమాసంలో,విశేషమైన కార్తీక సోమవారం నాడు, పట్టణంలోని శివాలయాలు కార్తీక దీపాలంకరణ వెలుగుల్లో నిండిపోయింది. పట్టణంలోని గంగానమ్మపేటలో వేంచేసిన శ్రీ పర్వత వర్ధిని సమేత శ్రీ రామేశ్వర స్వామి వారి దేవస్థానంలో భక్తులు లక్ష వత్తుల నోము నిర్వహించారు కార్తీక మాసం సందర్భంగా ఆలయ తోట



ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు రంగవల్లులు తీర్చిదిద్ది దీపాలు వెలిగించారు అనంతరం భక్తులకి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని నెహ్రూ రోడ్లో గల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం ఆవరణలో కార్తీక దీపాలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా స్వామివారి,శంఖు చక్ర నామాలు,పుష్పాలతో చేసిన కార్తీక దీపాలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.శ్రీ లక్షీ ్మ కూచిపూడి నృత్యకళానికేతన్ విద్యార్థులు,తల్లిదండ్రులు దీపాలంకరణ సేవలో పాల్గొని జ్యోతులు వెలిగించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పీజీఆర్ఎస్‌కు ఏడు అర్జీలు

పొన్నూరు, నవంబరు 10,ప్రభాతవార్త: ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)కు వివిధ సమస్యలకు సంబంధించి ఏడు అర్జీలు అందినట్లు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ పేరాల దుర్గారావు తెలిపారు. అందులో రెవెన్యూకు సంబంధించి-4, వ్యవసాయ శాఖకు సంబంధించి-1,గృహనిర్మాణశాఖకు సంబంధించి-1,వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి-1 అందినట్లు చెప్పారు. వీటి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ నారాయణరావు, వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ మొగసాటి శ్రీనివాస్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## 12న నిరసన ర్యాలీని జయప్రదం చేయండి

చేబ్రోలు(పొన్నూరు), నవంబరు 10,ప్రభాతవార్త: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా ఈ నెల 12వ తేదీ నియోజకవర్గ కేంద్రం అయిన పొన్నూరులో జరిగే నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. చేబ్రోలు మండల పరిధిలోని యడ్లపాటి నగర్‌లో జరిగిన నిరసన ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఇటీవల కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయబోతున్నట్లు నిర్ణయించిందన్నారు. సదరు నిర్ణయానికి నిరసనగా మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాలలో నిరసన ర్యాలీలు చేసేందుకు పిలుపునిచ్చారన్నారు. జగనన్న పిలుపు మేరకు 12వ తేదీ ఉదయం 9గంటలకు పొన్నూరులో జరిగే నిరసన ర్యాలీలో వేలాదిగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబటి పిలుపునిచ్చారు. ర్యాలీ అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. అందుకు సంబంధించిన కరపత్రాన్ని స్థానిక నాయకుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, చేబ్రోలు మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ళ శ్రీరామిరెడ్డి, నియోజకవర్గ మీడియా కన్వీనర్ బద్దూరి భాస్కరరెడ్డి, మండల బూత్ కమిటి కన్వీనర్ కొల్లి శేషిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు యాతం మమత, చేనేత కార్మిక మండలాధ్యక్షురాలు శ్రీదేవి, బీసి అధ్యక్షుడు గుర్రం శంకరరావు, గట్టుపల్లి పోలేశ్వరరావు తదితరులున్నారు.




## 16న శివ కళ్యాణం



పొన్నూరు, నవంబరు 10,ప్రభాతవార్త: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఈ నెల 16వ తేదీ ఉదయం 9గంటలకు బ్రాహ్మణ బజారులోని శంకరమఠంలో శివ కళ్యాణము నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ మహాసభ అధ్యక్షుడు, పూర్వాధ్యక్షుడు గణపవరపు రామశాస్త్రి, పివిఎస్ఎస్వి ప్రసాద్ తెలిపారు.అదే రోజు సాయంత్రం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషకాలు కూడా జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 25వ కార్తీక సమారాధన, 46 వార్షికోత్సవ సభ జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర,జిల్లా కార్యవర్గాలలో స్థానాలు పొందిన సభ్యులకు చిరు సత్కార కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ మహాసభ నాయకులు, కార్యకర్తలు, కమిటి సభ్యులు, కార్యవర్గ సభ్యులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయంతం చేయాలని వారు కోరారు.

## రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ నాటకపోటీల్లో తెనాలికి ప్రథమస్థానం

తెనాలి టౌన్ నవంబర్ 10 (ప్రభాతవార్త):పల్నాడుజిల్లా నరసరావుపేట లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల నాటిక పోటీల్లో,గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఉపాధ్యాయులు ప్రథమ స్థానం గెలుచుకున్నారు.చదువు లేకపోతే ఎన్ని అనర్ధాలు? రేపు ఏంటో తెలియకపోతే ఎలా?దివాకర్ బాబు రచించిన, బెల్లంకొండ వెంకట్ దర్శకత్వం వహించిన "రేప్నేది" నాటికకు ప్రథమ బహుమతి



వరించింది. ఎన్సిఆర్ఎస్ఎం హైస్కూల్ నుండి ఎమ్మెల్యే గా బెల్లంకొండ వెంకట్,ఛైర్మన్ గా పాలపర్తి శ్రీనివాసరావు,టిఎస్ఆర్ఎం హైస్కూల్ నుండి హెడ్ మాస్టర్ గా సోమరౌతు శ్రీనివాసరావు,ఎమ్మెల్యే అసిస్టెంట్ గా వెలగా సుభాష్ చంద్రబోస్,ఎమ్మెల్యే కుమారుడిగా తన్నీరు విష్ణు వర్ధన్ (ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్ స్టూడెంట్ ) నటించారు. రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం మన తెనాలి వారికి రావడం ఎంతో గర్వకారణంఅని,పలు ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## శివ..శివ నామంతో హోరెత్తిన శివాలయాలు

### ఘనంగా కార్తీక సోమవారం పూజలు

కొల్లిపర,నవంబరు 10 ప్రభాతవార్త: కార్తీకమాసం..కృష్ణానదిలో స్నానాలు..ఆలయాలలో ప్రత్యేక పూజలు...వంటివి చేస్తూ మహిళలు శివన్నామస్మరణలో పూర్తిగా లీనమై భక్తిపారవశ ్యంలో మునిగితేలారు.కార్తీక సోమవారం కావటంతో శివాలయాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు పోటెత్తారు.శివ..శివ..అనుకుంటూ ఆలయం అంతా హోరెత్తించారు.ఉదయాన్నే కృష్ణానదిలో



స్నానమాచరించి శివాలయంలో ధీపాలు వెలిగించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.దీనిలో భాగంగా మండల కేంద్రం కొల్లిపర శ్రీగంగా పార్వతీ సమేత శ్రీముక్తేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక సోమవారం పురస్కరించుకుని భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసారు.భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.కొందరు ఉదయం



సమయాల్లో..మరి కొందరు మహిళలు సాయంత్రం వేళల్లో అభిషేకం చేయించుకున్నారు.ఉపవాసంతో సాయసంధ్యావేళ కొందరు భక్తులు వత్తులతో ధీపాలు వెలిగించారు. శ్రీజనార్ధనస్వామి ఆలయంలో అర్చకులు పరాశరం జగన్నాధాచార్యులు స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేసారు.ఇదే విధంగా కార్తీకమాసం పురస్కరించుకుని మండలంలోని అత్తోట,తూములూరు,మున్నంగి,వల్లభాపురంతో పాటు పలు గ్రామాలలోని శివాలయాలలో ఘనంగా పూజలు నిర్వహించారు.గ్రామం చల్లగా ఉండాలని..ఆయురారోగ్యాలతో తమ కుటుంబం చల్లగా ఉండాలని స్వామివారిని వేడుకున్నారు.

## పేట పురపాలక సంఘ కార్యాలయంలో బ్రౌన్ జయంతి



చిలకలూరిపేట, నవంబర్ 10, ప్రభాతవార్త: చిలకలూరిపేట పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం సిద్ధి బ్రోన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సిద్ధి బ్రోన్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడంతో, పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ రఫాని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ రఫాని మాట్లాడుతూ, సిద్ధి బ్రోన్ రచనలు, కథలను ఆంగ్లం నుండి తెలుగులోకి అనువదించడం ద్వారా నేటి యువత ఎంతో మంది పుస్తకాలు చదవడం ప్రారంభించారని, ఇది ఒక మంచి పరిణామం అని కొనియాడారు. సిద్ధి బ్రోన్ సాహితీ సేవను ఆయన గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, దీని రహీమ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## తన అవినీతి భాగస్వాముల్ని కాపాడుకోవడానికే పోలీసులు, ప్రభుత్వంపై రజనీ నిరాధార ఆరోపణలు : టీడీపీ నేతలు

చిలకలూరిపేట, నవంబర్ 10, ప్రభాతవార్త: పోలీస్ వ్యవస్థపై రాజకీయ విమర్శలు చేసిన రజనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలనిమార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ పిల్లి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ మంత్రి రజనీ కల్లబొల్లి మాటలు, మహానటిని తలపించే నటను నియోజకవర్గ ప్రజలు ఎప్పటికీ నమ్మరన్నారు. ఆమె



అరాచకాలు, అన్యాయాలు, దోపిడీ దెబ్బ నుంచి ప్రజలు కోలుకునే పరిస్థితి లేదన్నారు. గతంలో ప్రజలు ఇచ్చిన ఓటమితో రజనీకి మతి భ్రమించినట్టుందన్నారు.. తన అనుచరుల మోసాలకు బలైన బాధితులు న్యాయం కోసం పోలీసుల్ని ఆశ్రయిస్తే, రజనీ పోలీసుల్ని బెదిరించడం, వారిపై రాజకీయ విమర్శలు చేయడం చట్టవిరుద్ధం అని పేర్కొన్నారు. ఎస్.ఎమ్.ఎస్ సుభానీ టీడీపీ వ్యక్తి అయినప్పటికీ, తన బిడ్డకు మంచి ఉద్యోగం వస్తుందన్న ఆశతో రజనీ పీఏలను, అనుచరుల్ని నమ్మి మోసపోయాడన్నారు. పట్టణంలో 36 వ వార్డు కౌన్సిలర్ గా పోటీచేసింది ఎవరో, వారికి తనకు ఉన్న సంబంధం ఏమిటో రజనీనే చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఆమె తప్పు తెలుసుకొని తన దురాశకు బలైన బాధితులకు న్యాయం చేయాలి." అని రవి డిమాండ్ చేశారు. సమావేశంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు పఠాన్ సమాద్ ఖాన్, పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, పార్టీ బిసి సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు గుంజి వీరాంజనేయులు టీడీపీ మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎమ్.ఎస్ సుభాని, తదితరులు మాట్లాడారు.

## ఘనంగా కలశ పూజ, అభిషేకాలు



చిలకలూరిపేట, నవంబర్ 10, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలం గోవిందపురం గ్రామంలో 18 కలశ పూజ 11 అభిషేకాలు మరియు అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుచుండగా గుత్తా అమర్ గురు స్వామి మరియు అయ్యప్ప స్వాముల ప్రత్యేక ఆహ్వానంపై ఆ పూజా కార్యక్రము నకు హాజరై నూతలపాటి శ్రీనివాసరావు గురుస్వామి గారి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకం చేసిన శాసనమండలి సభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ గారు... ఈ కార్యక్రమంలో డప్పు శ్రీను గురు స్వామి , వాసు గురు స్వామి గార్ల భజన కార్యక్రమంతో అయ్యప్ప మాలధారణ చేసుకున్న స్వాములు మరియు గ్రామస్తులు పరవశంతో ఊగిపోయారు. స్వామి వారి సేవలో తరించారు.

## శాఖా గ్రంథాలయంలో సి.పి. బ్రౌన్ జయంతి

చిలకలూరిపేట, నవంబర్ 10, ప్రభాతవార్త: జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ సొసైటీ (గార్డ్స్), గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో తెలుగు సాహిత్యానికి విశేష సేవ చేసిన ఆంగ్లేయుడు సి.పి. బ్రౌన్ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ



కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీ విమర్శకులు డా.పీవీ సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. సిపి బ్రౌన్ తెలుగు సాహిత్యానికి చేసిన సేవ గురించి వివరించారు. సిపి బ్రౌన్ లేకుంటే మను చరిత్ర, వసుచరిత్ర వంటి గొప్ప ప్రబంధాలు వెలుగు చూసేవి కాదన్నారు. మరో అతిథి జనవిజ్ఞానవేదిక డివిజన్ ప్రధాన కార్యదర్శి బి.ఆజయ్ బాబు మాట్లాడుతూ తాళ పత్రాలలో ఉన్న తెలుగు సాహిత్యాన్ని వెలికితీసి శుద్ధ ప్రతులు రాయించి భద్రపరిచిన గొప్ప సాహితీ సేవకుడు బ్రౌన్ దొర అని కొనియాడారు. వేలాది వేమన పద్యాలు సేకరించి మనకందించిన మహనీయుడు బ్రౌన్ అన్నారు. ఈ కార్యక్రమంలో గార్డ్స్ ఉపాధ్యక్షులు గేరా యాకోబు, వైయుసియే అధ్యక్షులు మక్కు విన్సెంట్ పాల్, టి.ప్రభురెడ్డి, దార్ల బుజ్జిబాబు, షేక్ లాలూ దాదాసాహెబ్ సేవా సమితి అధ్యక్షులు షేక్ సిద్ధాంత్ కరిముల్లా గ్రంథాలయ అధికారి డి. వీర్రాజు ,సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మార్టిన్ లూథర్ 542వ జయంతి



చిలకలూరిపేట, నవంబర్ 10, ప్రభాతవార్త: పట్టణంలోని మార్టిన్ లూథర్ విగ్రహ సెంటర్లో వున్న మార్టిన్ లూథర్ విగ్రహం వద్ద మత సంస్కరణ సంస్కర్త మార్టిన్ లూథర్ 542వ జయంతి కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. పాస్టర్ రెవరెండ్ నల్లపు మరియదాసు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పాస్టర్లు లూథరన్ సంఘస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మరియదాసు మాట్లాడుతూ చీకటిలో వున్న క్రైస్తవ సమాజానికి బైబుల్ లోని వాక్యాల ద్వారా వెలుగు చూపిన దీక్షాశీలి మార్టిన్ లూథర్ అన్నారు. ఆనాటి క్యాథలిక్ మతాన్ని ధిక్కరించి ప్రొటెస్టెంట్ మత ఆవిర్భావానికి బాటలు వేసిన గొప్ప వైభవశీలుడు లూథర్ అని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ లో ఎక్కడ లేని విధంగా చిలకలూరిపేటలో ప్రజా సమూహాల మధ్యలో ఆయన విగ్రహం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ దేవకుమార్, రెవరెండ్ యేసురత్నం, రెవరెండ్ రాజేష్ కుమార్, రెవరెండ్ మోహనరావు, రాజశేఖర్, రిచర్డ్, ధయరత్నం, బుచ్చయ్య , న్యాయవాదులు చిట్టిబాబు, వెంకయ్య, తదితరులు వున్నారు.

## తెలుగు సాహిత్యానికి విశేష సేవ చేసిన సిపి బ్రౌన్

యడ్లపాడు, నవంబర్ 10, ప్రభాతవార్త : తెలుగు సాహిత్యమునకు విశేష సేవ చేసిన ఆంగ్లేయుడు, తొలి తెలుగు శబ్దకోశమును ఈయనే పరిష్కరించి ప్రచురించాడని, బ్రౌన్ డిక్షనరీని ఇప్పటికీ విద్యార్థులు



ప్రామాణికంగా ఉపయోగిస్తారని, తెలుగు జాతికి సేవ చేసిన నలుగురు ఆంగ్లేయులలో ఒకరిగా బ్రౌన్ పరిగణిస్తారని తహశీల్దార్ విజయశ్రీ పేర్కొన్నారు. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా కార్యక్రమాలు ఏర్పాటుచేయాలని పిలుపునివ్వటం జరిగిందని, అందులో భాగంగానే కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించటం జరిగిందని తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సుబ్బారావు, వీఆర్వోలు వాలి, జగన్మోహనరావు, షేక్ బాషా, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## పురుగు మందు తాగి రైతు ఆత్మహత్య

యడ్లపాడు, నవంబర్ 10, ప్రభాతవార్త : పంటలు పండక సరియైన దిగుబడులు లేక తెచ్చిన అప్పులు పెరిగిపోయి దానిని తట్టుకోలేక రైతు ఆత్మహత్యకు పూనుకున్న సంఘటన చోటుచేసు కుంది. సంఘటనకు సంబంధించి ఎస్సై టి శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండల



పరిధిలోని పుట్టకోట గ్రామానికి చెందిన చింతకాయల వెంకట్రావు(72) రెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ సుమారు 11లక్షల వరకు అప్పులు చేసి చేసిన అప్పులు తీర్చలేక పంట దిగుబడి రాకపోవడంతో నష్టాలు వాటిల్లడంతో మానసిక ఆందోళనకు గురయ్యాడని, ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేదిన మధ్యాహ్నం సమయంలో గ్రామ శివారులో ఉన్న అంజనేయ స్వామి గుడి వెనుక పురుగుల మందు తాగినట్లు తన చిన్న కుమారుడు లక్ష్మీనారాయణకు ఫోన్ ద్వారా తెలపటం జరిగిందన్నారు. దీని గురించి తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అయనను గుంటూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించటం జరిగిందన్నారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం అయనను గుంటూరు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ 8వ తేది ఉదయం మరణించటం జరిగిందన్నారు. మృతుని కుమారుడు చింతకాయల గోపి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయటం జరిగింది.

# పల్నాడు జిల్లా వార్త



## కలెక్టర్ కార్యాలయంలో అన్నా క్యాంటీన్ ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే

నరసరావుపేట, నవంబరు 10 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఫిర్యాదుదా రుల కొరకు నూతనంగా ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ను కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ దూర



ప్రాంతాల నుండి వివిధ సమస్యలను అధికారులకు తెలిపేందుకు వచ్చే వారి సౌలభ్యం కొరకు ఈ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు పేద ప్రజల నుండి ఎంతో అదరణ పొందుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్నా క్యాంటీన్లలో రుచితో పాటు ఎంతో పరిశుభ్రమైన ఆహారం అందించటం జరుగుతుందన్నారు. ఈ సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా,ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబులు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయం అధికారులు,టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక చేయూత

నరసరావుపేట, నవంబరు 10 ప్రభాతవార్త : ప్రమాదంలో కనుమూసిన కార్యకర్తల కుటుంబాలకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆర్థిక చేయూతను అందించారు. సోమవారం స్దానిక పార్టీ కార్యాలయంలో జరిగినకార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలోని నలుగురికి రూ.5లక్షలు చొప్పున మొత్తం రూ.20లక్షలు కార్యకర్తల కుటుంబసభ్యులకు అందించటం



జరిగిందన్నారు. సియం నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోనిపార్టీ, ప్రభుత్వం ఖచ్చితంగా టిడిపి కుటుంబాలను ఆదుకునే కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. రొంపిచర్లకు చెందిన సురేష్, రావిపాడు గ్రామానికి చెందిన లాజర్, ఇక్కుర్రు గ్రామానికి చెందిన జజ్జురి నాగరాజుల కుటుంబాలకు రూ.20లక్షలు అందించటం జరిగిందని ఎమ్మెల్యే వివరించారు.

**రోడ్డు నిర్మాణ పనులకు శంఖుస్దాపన....**

మండలంలోని అరవపల్లి రోడ్డు నుండి ఉప్పలపాడు బైపాస్ వరకు రూ.60లక్షలతో నిర్మించే తారు రోడ్డు పనులకు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శంఖుస్దాపన చేసారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీ రాజ్‌శాఖ స్పెషల్ గ్రాంట్‌తో ఈ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుసహకారంతో నియోజకవర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో పాటు పార్టీ నాయకులు, అధికారులు ఉన్నారు.

## తిరుమల కళాశాలలో ప్రారంభమైన అటల్ ఎఫ్‌డిపి



నరసరావుపేట, నవంబరు 10 ప్రభాతవార్త : స్దానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఎఐసిటిఈ స్పాన్సర్డ్ ఆఫ్‌లైన్ ఆరు రోజుల అటల్ ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాలు కళాశాలను సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా తీర్చిదిద్దడానికి ఉపయోగపడతాయని తెలిపారు. ఎ.ఐ పరిజ్ఞానం మంచి ప్రయోజనాల కొరకు ఉపయోగించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్ అధ్యాపకుల చేతుల్లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జగదీష్, కో-ఆర్డినేటర్ యస్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్‌లో భావన విద్యార్థినికి ప్రథమ స్థానం



నరసరావుపేట, నవంబరు 10 ప్రభాతవార్త : పట్టణంలోని భావన జూనియర్ కళాశాల విద్యార్థిని బి మృదులా బ్యాడ్మింటన్లఓ అద్భుత ప్రతిభ చూపారు. వివరాలను కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి రామచంద్రారెడ్డి తెలిపారు. మృదులా అభినందన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మైనేడి శ్రీనివాసరావు, డైరెక్టర్లు చేకూరి కోటేశ్వరరావులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నరసరావుపేట డిఎస్ఏలో జరిగినటీమ్ ఈవెంట్‌లో మృదులా ప్రథమ స్దానం సాధించటం జరిగిందన్నారు. నవంబర్ 5,6తేదీలలో తిరుపతిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో పాల్గొని మూడవ స్దానం పొందటం విశేషమని తెలిపారు.

## ముప్పాళ్ల ఎస్ఐగా అనిల్‌కుమార్ బాధ్యతల స్వీకారం



ముప్పాళ్ల, నవంబర్ 10, ప్రభాతవార్త: ముప్పాళ్ళ నూతన ఎస్సైగా సోమవారం పి.అనిల్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సహచరులు, స్థానికులు, పలువురు ఆయనను అభినందించారు. ముప్పాళ్ళ లో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానని, ప్రజలతో సఖ్యతగా ముందుకు సాగుతానని అయన తెలిపారు. చట్టవిరుద్ధమైన పనులు, నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

## రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



సత్తనపల్లి, ప్రభాతవార్త: పెదకాలువ సమీపంలో సోమవారం తెల్లవారుజామున డ్రైవర్ నిద్రమత్తు కారణంగా కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజమండ్రికి చెందిన పార్వతి (45), జ్యోతి (26) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే 108 సహాయంతో వారిని సత్తెనపల్లి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించినట్లు డాక్టర్లు తెలిపారు. ఈ ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది

## ముస్లిం మైనార్టీల సంక్షేమాభివృద్ధికి పెద్దపీట

### ఎంపి శ్రీ కృష్ణదేవరాయలు,చీఫ్‌విప్ జీ.వీ


వినుకొండ,నవంబర్10,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల సంక్షేమాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందని నర్సరావుపేట ఎంపి లావు శ్రీ కృష్ణదేవరాయలు,ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు,డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు ఉద్ఘాటించారు. పట్టణంలోని తిమ్మాయిపాలెం రోడ్డు నందు గల ఈద్గా వద్ద రూ.40లక్షల నిధులతో



చేపట్టిన ప్రహరీగోడ నిరామణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ఎంపి లావు శ్రీ కృష్ణదేవరాయలు,ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ,డీసీసీబీ ఛైర్మన్ మక్కెన ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ గత వైకాపా పాలనలో ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేసిందని,కూటమి ప్రభుత్వం పాలనలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు పెద్దపీట వేసి అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. చీఫ్‌విప్ జీ.వీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. మదర్‌సాకు రోడ్డు పనులు రెండు నెలల్లోగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. మైనార్టీల విద్య ఉన్నతికి టిడిపి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తే జగన్ వాటిని రద్దు చేసి మైనార్టీల ద్రోహిగా మిగిలారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు కృషి వల్ల మరళా మైనార్టీ విద్య,ఉద్యోగ అవకాశాలు మెరుగుపడ్డాయని చెప్పారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా మైనార్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేయనున్నట్లు తెలిపారు. మదర్సా అభివృద్ధికి రూ.25వేలు మత పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైరమన్ మక్కెన,మస్లిం మత పెద్దలు,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని ప్రజలు పురోభివృద్ధి సాధించాలి

వినుకొండ,నవంబర్10,ప్రభాతవార్త: బ్యాంకులు కల్పిస్తున్న రుణ సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని నర్సరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు,చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు,డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (ఏపీజీబి) ఆధ్వర్యంలో పట్టణంలోని వై కన్వెన్షన్ హాలు నందు రుణ వితరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా





ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు,చీఫ్‌విప్ జీ.వీ,డీసీసీబీ ఛైర్మన్ మక్కెనలు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని రైతులు,స్వయం సహాయక సంఘాలకు,చిన్న వ్యాపారులు,చేతి వృత్తుల వారికి రుణ మంజూరు పత్రాలు,చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు,చీఫ్‌విప్ జీ.వీలు మాట్లాడుతూ పల్నాడులో డ్వాక్రా గ్రూపులకు రూ.650కోట్ల రుణాలు విడుదల చేయడం చారిత్రాత్మకమన్నారు. వినుకొండ నియోజకవర్గంలో చిన్న,సన్నకారు రైతులు,తక్కువ ఆదాయం కల్గిన చిరు వ్యాపార,చేతివృత్తుల కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని అభివృద్ధి చెందాలంటే బ్యాంకు రుణాలు కీలకమని చెప్పారు. రైతులకు పంట రుణాలు,పండ్ల తోటలు,పశుపోషణ,నీటి సదుపాయాల అభివృద్ధికి,పాల ఉత్పత్తి పెంపు వంటి వ్యవసాయ కార్యకలాపాలకు రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకులు మరింత సానుకూలంగా వ్యవహరించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన,పల్నాడు జిల్లా బ్యాంకింగ్ కో ఆర్డినేషన్ కమిటీ అధికారులు,వివిధ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు,స్వయం సహాయక సంఘాల నాయకులు,లబ్ధిదారులు,ప్రజలు పాల్గొన్నారు.

## మహిళపై గొడ్డలితో దాడి, నిందితుడి అరెస్టు



మాచర్ల, నవంబరు 10 ప్రభాతవార్త: దుర్గి మండలం ధర్మవరం గ్రామంలో తాగిన మైకంలో ఓ వ్యక్తి భార్యపై గొడ్డలితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మవరం గ్రామానికి చెందిన చిన్న నాగేష్ తాగి వచ్చి ఇంట్లో గొడవపడ్డాడు. రాత్రి వేళ నిద్రిస్తున్న భార్య నాగెండ్ల మరియమ్మపై గొడ్డలితో దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె ముక్కు మీద తీవ్రగాయమంది. గాయపడిన మరియమ్మను మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

## వరికపూడిసెల పూర్తిచేయాలని తహశీల్దారుకు వినతి

కారంపూడి, నవంబరు 10 ప్రభాతవార్త: మాచర్ల నియోజకవర్గ ప్రజల 70 ఏళ్ల కల వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని వరికపూడిసెల సాధన సమితి, సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కారంపూడి తహశీల్దారు వెంకటేశ్వర్లు నాయక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శంకుస్థాపనలు వద్దు - నిర్మాణం ముద్దు అనే నినాదాన్నిచ్చారు. పాలకలు మారినా వెల్దుర్తి మండల ప్రజల గొంతు తడవడం లేదన్నారు. తాగు, సాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ముగ్గురు




ముఖ్యమంత్రులు శంకుస్థాపనలు చేశారు కానీ నిర్మాణం చేయలేదన్నారు. వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి, మాచర్ల, కారంపూడి, పుల్లలచెరువు మండలాలకు వరికపూడిసెల జీవనాధారం అన్నారు. రాబోయే బడ్జెట్ సమావేశాల్లో వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు పూర్తిస్థాయిలో కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంసీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు, సీపీఐ మండల కార్యదర్శి షేక్ సైదా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బత్తుల వీరయ్య, కొక్కెర సురేష్, దొంతా అంజి, వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి పొందుగుల శ్రీను, నాయకులు చిలుకూరి రవీంద్రారెడ్డి, సూరే హనుమంతరావు, ఎంసీహెచ్ కోటిరెడ్డి, పాగాల శశిదేవి, ఏకే నాగమణి, గురజాల అప్పారావు, తూము శ్రీనివాస్, నూనె వెంకటేశ్వరరావు, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, ఒంటేరు పోలయ్య, చల్లంచర్ల రౌద్రయ్య, ఏకే మణికంఠ, శెనగపాటి బ్రహ్మాచారి, గాలం శ్రీనివాస్, పి.మణి, తండా సైదాబీ, షేక్ మహబూబ్ సుభాని పాల్గొన్నారు.

## వెల్లివిరిసిన మతసామరస్యం

క్రోసూరు, నవంబర్ 10 (ప్రభాతవార్త): క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామంలో మతసామరస్యం వెల్లివిరిసింది. స్థానిక ముస్లిం నేత, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు మొఘల్ జాను అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.సోమవారం శిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో సుమారు 300 మంది అయ్యప్ప స్వాములు తరలివచ్చారు. ఈ సందర్భంగా మొఘల్ జాను మాట్లాడుతూ



"అన్నీ దానలకన్నా అన్నదానం గొప్పది. మతాలు వేరు అయినా, మనుషులంతా ఒక్కటే అన్న భావనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిపాడు బాషా, సూరయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

11-11Pg5 9_11-11Pg5.qxd 10/Nov/25 9:57 PM Page 1



## భారత్ సరిహద్దుల చుట్టూ
# పాక్ ఉగ్ర కేంద్రాలు!



**న్యూఢిల్లీ, నవంబరు 10:** భారత్ చుట్టూ ఉగ్రవాదాన్ని విస్తరించేందుకు పాకిస్థాన్ కుట్రలు పన్నుతుందని భారత నిఘా వర్గాలు గుర్తించాయి. భారత సరిహద్దు దేశాలైన నేపాల్, బంగ్లాదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఉగ్ర నివాసాలు, శిక్షణ కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. బంగ్లాదేశ్, నేపాల్ సరిహద్దులకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉగ్ర స్థావరాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు భారత ఇంటెలిజెన్స్‌ను ఉటంకిస్తూ ఆంగ్ల మాధ్యమ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఈ కార్యకలాపాలు మరింత వేగవంతమైనట్లు తెలుస్తోంది. ఉగ్రవాద శిక్షణ పొందే వారి కోసం బంగ్లాదేశ్, నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో కొత్త శిక్షణ శిబిరాలు, నివాస సముదాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. సరిహద్దులోని రాష్ట్రాల్లో ఇటీవల ఉగ్రవాద సంస్థలకు చెందిన వారిని అరెస్టు చేయగా, వారి విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను పెంచినట్లు నిఘా వర్గాలు తెలిపాయి. పొరుగు దేశాల్లో విదేశీ నిధులతో ఏర్పాటవుతున్న పలు ప్రాజెక్టులపై కూడా నిఘా ఉంచినట్లు పేర్కొన్నాయి. లష్కరే తోయిబా, జైష్ ఏ మహమ్మద్ వంటి ఉగ్రవాద సంస్థలు నేపాల్‌లో తమ సంస్థలను విస్తరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఆల్‌ఖైదా, ఐసిస్ గత ఐదు నెలలుగా బంగ్లాదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశాయని తెలిపాయి. ఇందులో భాగంగా పాక్‌లోని పలు ప్రాంతాల నుంచి బంగ్లాదేశ్‌కు, నేపాల్‌కు నిరంతర వలసలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నాయి. ఆయా దేశాల్లో ఉగ్రవాద శిబిరాల నిర్మాణాలకు, నిర్వహణకు అవసరమైన నిధులను తుర్కియే సమకూరుస్తున్నట్లు సమాచారం. ఢాకాలోని జమాత్‌ఈఇస్లామీ కార్యాలయం పునరుద్ధరణకు టర్కీ నిఘా సంస్థ నిధులు సమకూర్చినట్లు కూడా ఈ నిఘా వర్గాలు వెల్లడించాయి.

## కోల్‌కతాలో స్పైస్‌జెట్ అత్యవసర ల్యాండింగ్

**కోల్‌కత్తా, నవంబరు 10:** ముంబై నుంచి కోల్‌కతా వెళ్తున్న స్పైస్‌జెట్ విమానానికి త్రుటిలో ప్రమాదంతప్పింది. విమానం గాల్లో ఉండగా ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో కోల్‌కతా విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఈ ఘటనలో ప్రయాణికులు, సిబ్బంది అంతా సురక్షితంగా బయటపడటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. స్పైస్‌జెట్‌కు చెందిన ఎస్‌జీ 670 విమానం ఆదివారం రాత్రి ముంబై నుంచి కోల్‌కతాకు బయలుదేరింది. కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండింగ్ కోసం కిందకు దిగుతున్న సమయంలో, విమానంలోని ఒక ఇంజిన్ విఫలమైనట్లు పైలట్లు గుర్తించారు. వెంటనే వారు అప్రమత్తమై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)కు సమాచారం అందించారు. పైలట్ల నుంచి సమాచారం అందగానే విమానాశ్రయ అధికారులు వెంటనే ఫుల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. అగ్నిమాపక, సహాయక బృందాలను రన్‌వే వద్ద సిద్ధంగా ఉంచారు. రాత్రి 11:38 గంటలకు విమానం సురక్షితంగా ల్యాండ్ అయిన తర్వాత ఫుల్ ఎమర్జెన్సీని ఉపసంహరించుకున్నట్లు ఓ అధికారి తెలిపారు. ప్రయాణికులందరినీ సురక్షితంగా విమానం నుంచి కిందకు దించారు. ఈ ఘటనపై స్పైస్‌జెట్ సంస్థ ఈ ఉదయం ఒక ప్రకటన విడుదల చేసింది. కోల్‌కతాలో ల్యాండింగ్ సమయంలో తమ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తిన మాట వాస్తవమేనని, అయితే విమానం సురక్షితంగా ల్యాండ్ అయిందని తెలిపింది. "ప్రయాణికులు, సిబ్బంది అందరూ సాధారణంగానే విమానం నుంచి కిందకు దిగారు" అని స్పైస్‌జెట్ ప్రతినిధి వివరించారు. ప్రస్తుతం విమానాన్ని ఇంజినీరింగ్ బృందాలు క్షుణ్ణంగా పరీక్షిస్తున్నాయని సంస్థ పేర్కొంది.



## కెంపెగౌడ ఎయిర్‌పోర్టులో
# ముస్లింల నమాజ్
### తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసిన బిజెపి

**బెంగళూరు, నవంబరు 10:** కర్ణాటకలో మరో కొత్త వివాదం రాజుకుంది. బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణంలో కొందరు నమాజ్ చేయడంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే హై సెక్యూరిటీ జోన్‌లో ఇలాంటి వాటికి ఎలా అనుమతి ఇచ్చారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఐటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే స్పష్టతనివ్వాలని డిమాండ్ చేసింది. ఈ ఘటన కెంపెగౌడ విమానాశ్రయంలోని టెర్మినల్ 2లో జరిగినట్లు బీజేపీ అధికార ప్రతినిధి విజయ్ ప్రసాద్ తెలిపారు. దీనికి సంబంధించిన ఫోటో, వీడియోను ఆదివారం రాత్రి ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "హై సెక్యూరిటీ జోన్‌లో నమాజ్ చేయడానికి వీరు ముందస్తు అనుమతి పొందారా ఇది అత్యంత సున్నితమైన ప్రాంతంలో తీవ్రమైన భద్రతా సమస్య కాదా అని ఆయన ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ నిబంధనల ప్రకారం అనుమతి తీసుకుని పథ సంచలన్ నిర్వహిస్తే అభ్యంతరం చెప్పే ప్రభుత్వం, ఇలాంటి కార్యకలాపాలను ఎందుకు చూసీచూడనట్లు వదిలేస్తోందని ఆయన విమర్శించారు. టెర్మినల్ 2లో భారీ భద్రత ఉంటుంది. కానీ పోలీసులు గానీ, ఇతర సిబ్బంది గానీ వారిని ఆపడానికి ప్రయత్నించలేదు. ఇది ఒక వర్గాన్ని సంతృప్తిపరిచే కాంగ్రెస్ ప్రభుత్వ తీరును స్పష్టం చేస్తోంది. ఈ చర్యను సీఎం, ఐటీ మంత్రి సమర్థిస్తారా అని విజయ్ ప్రసాద్ ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, బహిరంగ ప్రదేశాల్లో కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రైవేటు సంస్థలు అనుమతి తీసుకోవాలన్న ప్రభుత్వ ఆదేశం కేవలం ఆర్ఎస్ఎస్‌ను లక్ష్యంగా చేసుకున్నది కాదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల స్పష్టం చేశారు. ఆ ఉత్తర్వుల్లో మేము ఎక్కడా ఆర్ఎస్ఎస్ పేరును ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. ఏ సంస్థ అయినా కార్యక్రమం నిర్వహించాలంటే జిల్లా అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. దాన్ని వారు ఆర్ఎస్ఎస్ గురించి అనుకుంటే మేమేం చేయగలమనివ్యాఖ్యానించారు.

## సుంకాల రాబడుల్లో ప్రతి అమెరికన్‌కు 2 వేల డాలర్లు
### అమెరికన్లకు ట్రంప్ తీపి కబురు

**వాషింగ్టన్, నవంబరు 10:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన దూకుడైన టారిఫ్ విధానాన్ని సమర్థించుకుంటూ సంచలన ప్రకటన చేశారు. తన ప్రభుత్వం టారిఫ్ పన్నుల ద్వారా వసూలు చేస్తున్న ఆదాయం నుంచి త్వరలోనే ప్రతి అమెరికన్‌కు కనీసం 2వేల డాలర్ల చొప్పున పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే, అధిక ఆదాయం ఉన్న సంపన్నులకు ఈ పథకం వర్తించదని ఆయన స్పష్టం చేశారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ వేదికగా ఈ ప్రకటన చేశారు. తన టారిఫ్ విధానాన్ని విమర్శిస్తున్న వారిపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. టారిఫ్‌లను వ్యతిరేకించేవాళ్లు మూర్ఖులని ఘాటుగా వ్యాఖ్యానించారు. తన హయాంలోనే అమెరికా ప్రపంచంలోనే అత్యంత సంపన్న, గౌరవనీయమైన దేశంగా మారిందని, ద్రవ్యోల్బణం దాదాపు లేదని, స్టాక్ మార్కెట్ రికార్డు స్థాయిలో ఉందని ఆయన చెప్పుకొచ్చారు. టారిఫ్ పన్నుల ద్వారా దేశానికి ట్రిలియన్ల కొద్దీ డాలర్ల ఆదాయం వస్తోందన్నారు.




# బీహార్‌లో మలి విడత పోలింగ్ నేడే



**- 122 అసెంబ్లీ నియోజకవర్గాలు.. 1,302 మంది అభ్యర్థులు - 3.70 కోట్ల మంది ఓటర్లు.. 45,399 పోలింగ్ కేంద్రాలు - 4 లక్షల మంది పోలీసులు, పారామిలటరీ బలగాలతో భద్రత - బరిలో పలువురు మంత్రులు, లెజిస్లేటివ్ లీడర్లు, పిసిసి చీఫ్ - 7 రాష్ట్రాల్లో 8 అసెంబ్లీ స్థానాలకూ పోలింగ్..**

**న్యూఢిల్లీ, నవంబరు 10:** బీహార్ ఎన్నికల రెండవ మరియు చివరి దశ విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. 122 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంగళవారం పోలింగ్ జరుగనుంది. నితీష్ కుమార్ ప్రభుత్వంలోని అరడజనుకు పైగా మంత్రులు సహా 1,302 మంది అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. 3.70 కోట్లకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్‌కు సంబంధించిన ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. తూర్పు, పశ్చిమ చంపారన్, సీతామర్హి, మధుబాని, సుపాల్, అరారియా, కిషన్‌గంజ్ తదితర జిల్లాలు నేపాల్ సరిహద్దులో ఉన్నందున కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. 4 లక్షలకు పైగా పోలీసులు, పారామిలటరీ బలగాలను మోహరించారు. ఇక సీమాంచల్ ప్రాంతంలో ముస్లిముల ప్రాబల్యం అధికం. ఇక్కడ వారిదే నిర్ణయాత్మక ఓటు. మైనారిటీ ఓట్లపై ఆధారపడిన ఇండియా కూటమి, చొరబాటుదారులను రక్షిస్తోందంటూ ఆరోపిస్తున్న ఎన్‌డిఏ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రముఖ అభ్యర్థులలో జెడియు సీనియర్ నాయకుడు, రాష్ట్ర మంత్రివర్గంలో అత్యంత సీనియర్ సభ్యుడు బిజేంద్రప్రసాద్ యాదవ్ ఉన్నారు. ఆయన రికార్డు స్థాయిలో 8వ సారి తన సుపాల్ స్థానాన్ని నిలుపుకోవాలని చూస్తున్నారు. మరో మంత్రి, బిజెపి అభ్యర్థి ప్రేమ్‌కుమార్ పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. 1990 నుండి గయా నుండి ఏడుసార్లు గెలుపొందారు. ఈసారి మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వీరితోపాటు బిజెపికి చెందిన రేణు దేవి (బెట్టయ్య), నీరజ్‌కుమార్ సింగ్ 'బబ్లూ' (ఛాతాపూర్), జెడియుకు చెందిన లేషి సింగ్ (ధమ్దహా), శీలా మండల్ (ఫుల్పరాస్), జామా ఖాన్ (చెయిన్‌పూర్) ఉన్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి తార్కిషోర్ ప్రసాద్, వరుసగా ఐదోసారి కతిహార్ స్థానాన్ని నిలుపుకోవాలని చూస్తున్నారు. కతిహార్ జిల్లాలో బలరాంపూర్, కద్వా అసెంబ్లీ స్థానాలు కూడా ఉన్నాయి. ఇక్కడి సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతలు మెహబూబ్ ఆలం, షకీల్ అహ్మద్ ఖాన్ హ్యాట్రిక్ విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎన్‌డిఏ భాగస్వామి పక్షాలు కేంద్ర మంత్రి జితిన రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందూస్థానీ అవామ్ మోర్చా (హెచ్ఎఎం), రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహా రాష్ట్రీయ లోక్ మోర్చాకు బలపరీక్షగా కూడా చూస్తున్నారు. ఈ రెండు పార్టీలు చెరో ఆరు స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. హెచ్ఎఎం పోటీ చేసిన ఆరుస్థానాలకూ రెండో దశలో ఎన్నికలు జరుగనున్నాయి. వీటిలో నాలుగు ఇమామ్‌గంజ్, బారాచట్టి, టికారి, సికంద్రాలు ప్రస్తుతం పార్టీ ఆధీనంలో ఉన్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ తమ అదృష్టాన్ని పరీక్షించుకునే అవకాశమిచ్చింది. గత ఏడాది గయా నుండి లోక్‌సభకు ఎన్నికయ్యే వరకు మాంఝీ ఇమామ్‌గంజ్ స్థానాన్ని కలిగి ఉన్నారు. తరువాత జరిగిన ఉప ఎన్నికలో దానిని అతని కోడలు దీప విజయం సాధించారు. దీపా తల్లి జ్యోతి దేవి బారాచట్టి నుంచి ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇక ఆర్ఎల్ఎం అభ్యర్థులలో కుష్వాహా భార్య స్నేహలత ససారాం నుంచి, అతని విశ్వాసపాత్రుడు మాధవ్ ఆనంద్ మధుబని నుంచి తమ భవితవ్యం తేల్చుకోనున్నారు. మరో ముఖ్యమైన అభ్యర్థి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ కుమార్, ఆయన వరుసగా రెండోసారి 'కుటుంబ' నుంచి గెలుపొందాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఓటర్లు ఎవరు వైపు మొగ్గు చూపుతారో నవంబరు 14 కౌంటింగ్ రోజున తేలనుంది. బీహార్‌తోపాటు ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఉప ఎన్నిక జరుగనుంది. ఇందుకు సంబంధించి ఎన్నికల సంఘం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జమ్మూకాశ్మీర్‌లోని బుద్గామ్, నగ్రోటా, అంటా (రాజస్థాన్), ఘట్‌శిలా (జార్ఖండ్), జూబ్లీహిల్స్ (తెలంగాణ), టర్న్ టరన్ (పంజాబ్), డంపా (మిజోరం), నువపడ (ఒడిశా) నియోజకవర్గాల్లోనూ మంగళవారం పోలింగ్ జరుగనుంది. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఏర్పాట్లు చేశారు.

## విద్యాసంస్థల్లో వందేమాతరం పాడాల్సిందే
**- ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్**



**గోరఖ్‌పూర్, నవంబరు 10:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని అన్ని విద్యాసంస్థల్లో వందేమాతరం గీతం ఆలపించాల్సిందేనని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. ప్రతి పాఠశాల, విద్యా సంస్థలో 'వందేమాతరం' పాడటం తప్పనిసరి చేస్తామన్నారు. గోరఖ్‌పూర్‌లో సోమవారం ఏక్తా యాత్ర కార్యక్రమంలో సిఎం యోగి మాట్లాడుతూ, ఈ చర్య భారత మాత, మాతృభూమి పట్ల పౌరులలో భక్తి భావాలను ప్రేరేపిస్తుందన్నారు. జాతీయ గీతం వందేమాతరం పట్ల ప్రతి పౌరుడిలో గౌరవ భావం ఉండేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సిఎం ఆదిత్యనాథ్ వివరించారు. ఇలా ప్రతీ పాఠశాలలో జాతీయ గేయాన్ని పాడటం ద్వారా.. పిల్లలకు చిన్ననాటి నుంచే దేశభక్తితో పాటు జాతీయ గేయంపై గౌరవభావం వంటివి అలవడతాయన్నారు. వందేమాతరంను వ్యతిరేకించే వారు దేశ ఐక్యత, సమగ్రతను అవమానించినట్టేనని ఈ సందర్భంగా యోగి అన్నారు. దేశంలో నివసించే ప్రతి పౌరుడూ విధేయతగా, ఐక్యత కోసం పనిచేయాలని కాంక్షిస్తున్నట్టు ఆయన చెప్పారు. కులం, ప్రాంతం, భాషల పేరుతో సమాజాన్ని విభజించే వంటి అంశాలను గుర్తించి ఎప్పటికప్పుడు వాటిని వ్యతిరేకించాలని యోగి సూచించారు. ఇలాంటి విభజనలు కొత్త జిన్నాలను సృష్టించే కుట్రలో భాగమని అని ఆయన చెప్పుకొచ్చారు. దేశంలో నూతన జిన్నాలకు తెరలేపకుండా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.



## జడ్జిలపై ఆరోపణలు చేయడం ఫ్యాషనైపోయింది
**- సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్**

**న్యూఢిల్లీ, నవంబరు 10:** జడ్జిలపై ఆరోపణలు చేయడం ఇటీవల ట్రెండ్‌గా మారిపోయిందని, ఇది న్యాయ వ్యవస్థకు మంచిది కాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ అభిప్రాయపడ్డారు. తమకు అనుకూలంగా తీర్పులు రానప్పుడు న్యాయవాదులు ఆరోపణలు చేస్తున్నారని, దీనిపై సిజె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి పద్ధతులను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఎన్. పెద్దిరాజు అనే వ్యక్తిపై నమోదైన కోర్టు ధిక్కరణ కేసు విచారణ సందర్భంగా సీజెఐ సోమవారం ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌషుమి భట్టాచార్యపై పెద్దిరాజు తీవ్రమైన ఆరోపణలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసింది. అయితే, పిటిషనర్ పెద్దిరాజు చెప్పిన క్షమాపణను సదరు న్యాయమూర్తి అంగీకరించారని సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే కోర్టుకు తెలిపారు. దీంతో ధర్మాసనం ఈ కేసును మూసివేసింది. అయినప్పటికీ, ఈ ధోరణిపై చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "న్యాయస్థానానికి సేవకులుగా ఉండే న్యాయవాదులకు కోర్టు పట్ల ఒక బాధ్యత ఉంటుంది. శిక్షించడంలో కాదు, క్షమాపణ చెప్పినప్పుడు క్షమించడంలోనే చట్టం గొప్పతనం ఉంటుంది. ఆరోపణలు ఎదుర్కొన్న హైకోర్టు న్యాయమూర్తే క్షమాపణను అంగీకరించారు. కాబట్టి తాము ఈ కేసును ముందుకు తీసుకెళ్లడం లేదు. అయితే, న్యాయమూర్తులపై ఆరోపణలు చేసే పిటిషన్లపై సంతకాలు చేసే ముందు న్యాయవాదులు చాలా జాగ్రత్తగా ఉండాలి" అని సిజెఐ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఈ నెల 23న పదవీ విరమణ చేయనున్న సిజెఐ బిఆర్ గవాయ్, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసే ఇలాంటి చర్యల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

## ఆధార్ కస్టమర్ల కోసం కొత్త మొబైల్ అప్లికేషన్!


**న్యూఢిల్లీ, నవంబరు 10:** భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యుఐడిఎఐ) ఆధార్ వినియోగదారుల కోసం మరో కొత్త మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్‌ఫోన్‌లోనే ఆధార్ వివరాలను సురక్షితంగా భద్రపరచుకోవడంతో పాటు, అవసరమైన సమాచారాన్ని సులభంగా పంచుకునేందుకు ఈ యాప్‌ను ప్రత్యేకంగా రూపొందించినట్లు యూఐడీఏఐ తెలిపింది. ఈ కొత్త యాప్‌తో ఇకపై భౌతికంగా ఆధార్ కార్డును వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదని, ఇది పూర్తిస్థాయి పేపర్‌లెస్ అనుభవాన్ని అందిస్తుందని పేర్కొంది. ఈ యాప్‌లో పలు ఆకర్షణీయమైన ఫీచర్లను పొందుపరిచారు. ముఖ్యంగా, ఒకే డివైజ్‌లో కుటుంబ సభ్యులందరి ఆధార్ వివరాలను కూడా భద్రపరచుకునే వెసులుబాటు కల్పించారు. వినియోగదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఫేస్ అథెంటికేషన్ ద్వారా లాగిన్ అయ్యే సౌకర్యం కల్పించారు. మన ఆధార్ వివరాలను ఇతరులతో పంచుకోవాల్సి వచ్చినప్పుడు, కేవలం అవసరమైన సమాచారాన్ని మాత్రమే పంపే అవకాశం కూడా ఉంది. బయోమెట్రిక్ వివరాలను లాక్ లేదా అన్‌లాక్ చేసుకునే ఆప్షన్, ఆధార్ కార్డు చివరిసారిగా ఎక్కడ ఉపయోగించారో తెలుసుకునే హిస్టరీని చెక్ చేసుకునే సౌకర్యం కూడా ఇందులో ఉన్నాయి. ప్రస్తుతం వాడుకలో ఉన్న ఎంఆధార్ యాప్‌కు ఇది ప్రత్యామ్నాయం కాదని యూఐడీఏఐ స్పష్టం చేసింది. ఎంఆధార్‌లో లభించే డిజిటల్ కార్డు డౌన్‌లోడ్, పీవీసీ కార్డు ఆర్డర్, మొబైల్/ఈమెయిల్ వెరిఫికేషన్ వంటి సేవలు ఈ కొత్త యాప్‌లో ఉండవు. కేవలం ఆధార్ డేటాను సురక్షితంగా నిల్వ చేయడం, షేర్ చేయడం కోసమే దీనిని తీసుకొచ్చారు. ఆండ్రాయిడ్ యూజర్లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి, ఐఫోన్ యూజర్లు యాపిల్ యాప్ స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. యాప్‌ను ఇన్‌స్టాల్ చేశాక, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, ఓటీపీ, ఫేస్ అథెంటికేషన్ పూర్తి చేయాలి. అనంతరం, భద్రత కోసం ఒక పిన్ నంబర్‌ను సెట్ చేసుకుని యాప్‌ను ఉపయోగించడం ప్రారంభించవచ్చు. ఈ కొత్త యాప్‌తో ఆధార్ సేవలు మరింత సులభంగా, సురక్షితంగా మారతాయని అధికారులు భావిస్తున్నారు.

## ఉగ్రవాదుల ఏరివేతలో తొమ్మిది మంది అరెస్ట్
### భారీ ఎత్తున ఆయుధాలు, సామగ్రి స్వాధీనం

**శ్రీనగర్, నవంబరు 10:** జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాలు భారీ ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌ను చేపట్టాయి. లోయ వ్యాప్తంగా పలు జిల్లాల్లో విస్తృతంగా నిర్వహిస్తున్న సోదాల్లో భాగంగా నిన్న ఒక మహిళ సహా తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్ నేడు కూడా కొనసాగుతోంది. ఉగ్రవాదుల కదలికలపై అందిన పక్కా సమాచారంతో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇంటెలిజెన్స్ వర్గాల నివేదికల ప్రకారం ఎత్తైన పర్వత ప్రాంతాల్లో క్రియాశీలంగా ఉన్న ఉగ్రవాదులు శీతాకాలం సమీపిస్తుండటంతో మైదాన ప్రాంతాల్లో సురక్షితమైన ఆశ్రయం కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ సమాచారం ఆధారంగా భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. రాంబన్, కిష్త్వార్, దోడా, కథువా, రియాసి, పూంచ్, రాజౌరి జిల్లాల్లోని డజన్ల కొద్దీ ప్రదేశాలలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ దాడులు, సోదాలు సోమవారం కూడా నిరంతరాయంగా కొనసాగాయి. అనుమానిత స్థావరాలపై భద్రతా బలగాలు జల్లెడ పడుతున్నాయి. ఉగ్రవాదుల ప్రణాళికలను భగ్నం చేసి, వారిని ఏరివేయడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ జరుగుతోంది. అదుపులోకి తీసుకున్న నిందితులపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా) సెక్షన్లు 13, 28, 38, 39 కింద, అలాగే ఆయుధాల చట్టంలోని సెక్షన్ 7/25 కింద కేసులు నమోదు చేశారు. లోయలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి ప్రయత్నాన్నైనా అడ్డుకునేందుకు భద్రతా బలగాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాయి. నిషేధిత ఉగ్రవాద సంస్థలు జైష్ ఏ మొహ్మద్, అన్సార్ ఘజ్వత్ ఉల్ హింద్‌తో సంబంధం ఉన్న ఓ అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌ను జమ్మూ కశ్మీర్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో పలువురు కీలక అనుమానిత ఉగ్రవాదులను అరెస్టు చేయడంతో పాటు భారీగా ఆయుధాలు, మందుగుండు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అక్టోబర్ 19న శ్రీనగర్‌లోని బున్‌పోరా, నౌగామ్‌లో పోలీసులు, భద్రతా దళాలను హెచ్చరిస్తూ జైష్ ఏ మహ్మద్ పోస్టర్లు వెలిశాయి. ఆ తర్వాత పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నెట్‌వర్క్‌లో పలువురు విద్యావంతులతో పాటు, ప్రొఫెషనల్స్ ఉన్నారని.. విదేశీయ పరిచయాల ద్వారా పని చేస్తున్నట్లుగా తేలింది.

## సంక్షిప్తంగా..

### దగ్గుమందు తయారీకి మార్గదర్శకాలు



**న్యూఢిల్లీ, నవంబర్ 10:** కోల్డ్‌రిఫ్ దగ్గుమందు వల్ల ఆయా రాష్ట్రాల్లో చిన్నారులు మృతి చెందిన ఘటన కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఔషధ తయారీదారులకు కేంద్ర ప్రభుత్వం అల్టిమేటం ఇచ్చింది. జనవరి ఒకటి నాటికి అంతర్జాతీయ ప్రమాణాలు పాటించాలని ఆదేశించింది. లేకపోతే కంపెనీలు మూసుకోవాల్సిందేనని హెచ్చరించింది. ఈ మేరకు సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆదేశాలు జారీ చేసింది. జనవరి ఒకటి నాటికి ఔషధ తయారీ సంస్థలు గ్లోబల్ గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీసెస్‌కు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేసింది. ఈ తేదీలో ఎలాంటి పొడిగింపులు ఉండవని తేల్చి చెప్పింది. భారత్‌లో తయారైన కొన్ని దగ్గుమందుల వల్ల స్వదేశంతో పాటు విదేశాల్లో పిల్లల మరణాలు సంభవించిన సంగతి తెలిసిందే. భారత్ నుంచి ఎగుమతి అయిన ఈ మందుల వల్ల గాంబియా, ఉజ్బెకిస్థాన్ దేశాల్లో చిన్నారులు మృతి చెందారు.

### భారత్‌లో అమెరికా రాయబారిగా సెర్గియోగోర్



**వాషింగ్టన్, నవంబరు 10:** భారత్‌లో అమెరికా కొత్త రాయబారిగా నియమితులైన సెర్గియో గోర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా పాల్గొననున్నారు. సోమవారం జరగనున్న ఈ కార్యక్రమానికి ట్రంప్ హాజరవుతారని వైట్‌హౌస్ ఆదివారం ఒక ఈమెయిల్‌లో అధికారికంగా ధ్రువీకరించింది. ట్రంప్‌కు అత్యంత సన్నిహితులలో ఒకరిగా పేరున్న సెర్గియో, ఈ కార్యక్రమం ముగిసిన వెంటనే న్యూఢిల్లీలో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. కేవలం 38 ఏళ్ల వయసున్న సెర్గియో గోర్, భారత్‌లో అమెరికా రాయబారిగా పనిచేయనున్న అత్యంత పిన్న వయస్కుడిగా నిలవనున్నారు. గతంలో వైట్‌హౌస్‌లో ప్రెసిడెన్షియల్ పర్సనల్ ఆఫీస్ డైరెక్టర్‌గా సేవలందించారు.

### ప్రముఖ తమిళనటుడు అభినయ్‌కింగర్ మృతి



**చెన్నై, నవంబరు 10:** తమిళ చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ నటుడు అభినయ్ కింగర్ ఈ ఉదయం కన్ను మూశారు. గత కొన్నేళ్లుగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో కోలీవుడ్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. అరుముగ్, ఆరోహణం, సక్సెస్ వంటి పలు చిత్రాల్లో నటించి అభినయ్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన చివరిసారిగా వల్లవనుక్కు పుల్లుం ఆయుధం అనే చిత్రంలో కనిపించారు. అనారోగ్య సమస్యలు తీవ్రం కావడంతో నటనకు పూర్తిగా దూరమై చికిత్స తీసుకుంటున్నారు. మరణాన్ని ముందే ఊహించినట్లుగా మూడు నెలల క్రితం అభినయ్ ఒక వీడియోను విడుదల చేశారు. అందులో తాను కేవలం ఏడాదిన్నర మాత్రమే జీవిస్తానని చెప్పినట్లు పేర్కొన్నారు.

### ఆస్ట్రేలియాలో మైనర్లకు సోషల్ మీడియా

**కాన్‌బెర్రా, నవంబరు 10:** పిల్లల ఆన్‌లైన్ భద్రతను పరిగణనలోనికి తీసుకుని ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రధాననిర్ణయాన్ని ప్రకటించింది. దేశవ్యాప్తంగా 16 సంవత్సరాలలోపు వయసున్న పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడంపై నిషేధం విధిస్తున్నట్లు ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటించారు. ఈ కొత్త నిబంధన ఈ ఏడాది డిసెంబర్ 10వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. ఈ మేరకు 'ఆన్‌లైన్ సేఫ్టీ అమెండ్‌మెంట్ (సోషల్ మీడియా మినిమమ్ ఏజ్) బిల్ 2024' పేరుతో ప్రభుత్వం ఒక కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం 16 ఏళ్లలోపు మైనర్లు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, స్నాప్‌చాట్, ఎక్స్ (గతంలో ట్విట్టర్), యూట్యూబ్, రెడ్డిట్, కిక్ వంటి ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో అకౌంట్లు తెరవడం లేదా వాటిని వినియోగించడం చట్టవిరుద్ధం అవుతుంది.

### అనుమానాస్పద స్థితిలో మోడల్ మృతి

**భోపాల్, నవంబరు 10:** అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన ఒక మోడల్‌ను ఆమె ప్రియుడు ఆసుపత్రిలోనే వదిలేసి వెళ్లిపోయాడు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. 27 ఏళ్ల ఖుష్బూ అహిర్వార్ అలియాస్ ఖుషీ వర్మ కాలేజీ చదువును మధ్యలో మానేసింది. మోడల్‌గా ఆమె చేస్తున్నది. పలు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు కూడా చేసింది. 'డైమండ్ గర్ల్' పేరుతో ఇన్‌స్టాగ్రామ్ పోస్టులతో ఆమె పాపురల్ అయ్యింది. కాగా, మోడల్ గత మూడేళ్లుగా భోపాల్‌లో నివసిస్తున్నది.

# మెడికల్ కాలేజీల ఫీజులు ఖరారు

విజయవాడ, నవంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని ప్రైవేటు అన్‌ఎయిడెడ్ ప్రొఫెషనల్ వైద్య, దంత వైద్య కళాశాలల్లో సూపర్ స్పెషాలిటీ, పీజీ, యూజీ కోర్సులకు 202526 విద్యా సంవత్సరానికి ఫీజుల్ని ప్రభుత్వం ఖరారు చేసింది. 202023 బ్లాక్ పీరియడ్‌లో ఉన్న ఫీజుపై యూజీ కోర్సులకు 10శాతం, సూపర్ స్పెషాలిటీ, పీజీ కోర్సులకు 15శాతం చొప్పున పెంపును తాత్కాలికంగా ఆమోదించింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ మూడు వేర్వేరు ఉత్తర్వులిచ్చింది. సుప్రీంకోర్టు, హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల తుది తీర్పునకు లోబడి ఈ ఫీజు నిర్ణయం ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. సూపర్ స్పెషాలిటీ కోర్సులకు వచ్చేసరికి జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, కాటూరి మెడికల్ కాలేజీ, నారాయణ మెడికల్ కాలేజీ, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ, డాక్టర్ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైద్య కళాశాలలకు రూ.17.25 లక్షలుగా ఫీజును నిర్ధారించింది. ఎంబీబీఎస్‌లో కేటగిరీల ప్రకారం ఫీజు వివరాలు గమనిస్తే ఏకేటగిరీ ఫీజు రూ.16,500, బీకేటగిరీ ఫీజు రూ. 13.20 లక్షలు (మేనేజ్‌మెంట్ కోటా), సీ కేటగిరీ ఫీజుగా రూ.39.60 లక్షలు (ఎన్ఆర్ఐ కోటా) నిర్ణయించారు. బీడీఎస్ (డెంటల్)కు వచ్చే సరికి ఏకేటగిరీ ఫీజు రూ. 14,300, బీకేటగిరీ ఫీజు: రూ.4.40 లక్షలు (మేనేజ్‌మెంట్ కోటా), సీ కేటగిరీ ఫీజు రూ.13.20 లక్షలు (ఎన్ఆర్ఐ కోటా)గా ఉంది. పీజీ కోర్సులకు మెడికల్ విభాగంలో ఫీజుల వివరాలను గమనిస్తే క్లినికల్ డిగ్రీ కోర్సులకు ఏ కేటగిరీ ఫీజు రూ.4,96,800 (కన్వీనర్ కోటా), బీ కేటగిరీ ఫీజు రూ.9,93,600 (మేనేజ్‌మెంట్), సీ కేటగిరీ ఫీజు రూ.57.50 లక్షలు (ఎన్ఆర్ఐ/ ఇన్‌స్టిట్యూషనల్)గాను నిర్ణయించారు. ఇక పారా క్లీనికల్ డిగ్రీ కోర్సులకు ఏ కేటగిరి ఫీజుగా రూ.1,55,250 (కన్వీనర్), బీ కేటగిరీ ఫీజుగా రూ.3,10,500 (మేనేజ్‌మెంట్), సీ కేటగిరీ ఫీజుగా రూ.17.25 లక్షలు (ఎన్ఆర్ఐ/ ఇన్‌స్టిట్యూషనల్), ప్రీ క్లినికల్ డిగ్రీ కోర్సులు ఏ కేటగిరీ ఫీజుగా రూ.70,380 (కన్వీనర్), బీ కేటగిరీ ఫీజుగా రూ.1,40,760 (మేనేజ్ మెంట్), సీ కేటగిరీ ఫీజుగా రూ.9.20 లక్షలు (ఎన్ఆర్ఐ/ ఇన్‌స్టిట్యూషనల్) నిర్ణయించారు. డెంటల్ విభాగంలో క్లినికల్ డిగ్రీ కోర్సులకు ఏ కేటగిరీ ఫీజు రూ.3,41,550 (కన్వీనర్), బీ కేటగిరీ ఫీజు రూ.6,83,100 (మేనేజ్‌మెంట్), సీ కేటగిరీ ఫీజు రూ.13.80 లక్షలు (ఎన్ఆర్ఐ/ ఇన్‌స్టిట్యూషనల్)గా నిర్ణయించారు.

## వర్షపు నీటిని ఒడిసి పడదాం... జీవనాధారం పెంచుదాం

# అభివృద్ధికి బాటలు వేద్దాం

- యేటా 25 వేల చెరువులు పునర్నిర్మాణం
- వాటర్‌షెడ్ మహోత్సవ్‌లో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



గుంటూరు, నవంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: వర్షపు నీటిని ఒడిసి పడదాం.. జీవనాధారం పెంచుదాం అని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. వాటర్ షెడ్ మహోత్సవ్‌పై రెండు రోజుల జాతీయ సదస్సు గుంటూరులోని ఓ హోటల్లో సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరులో మూడవ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం మంచి పథకాలు అమలు చేస్తుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంచి విజన్‌తో ఆ పథకాలను చక్కగా ఉపయోగించుకుని దేశంలోనే ఆదర్శంగా ఉండాలని, ముందు వరసలో నిలబడాలనే ఆశయంతో అడుగులు వేస్తున్నామని చెప్పారు. అభివృద్ధికి మన రాష్ట్రం, మన ప్రాంతం నుండి మంచి భాగస్వామ్యం ఉండాలని ఆశిస్తున్నానని తెలిపారు. జులై నుండి సెప్టెంబర్ వరకు మంచి వర్షాలు కురుస్తాయని, ఆ వర్షపు నీటిని ఒడిసి పట్టి అభివృద్ధికి, జీవనోపాధికి అడుగులు వేయాలని పేర్కొన్నారు. ప్రతి ఏడాది 1700 క్యూబిక్ మీటర్ల నీటి అవసరం ఉందని గుర్తించడం జరిగిందని, అంతకంటే తక్కువ నీరు ఉంటే నీటి కొరతగా పరిగణించడం జరుగుతుందని అన్నారు. నీటి భద్రత జాతీయ భద్రతగా ప్రధాని పరిగణిస్తున్నారని తెలిపారు. ఇందుకుగాను వాటర్ షెడ్ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. నీటిని సద్వినియోగం చేసుకోవడం వల్ల వివిధ రంగాల్లో ఆరు రెట్ల ఉత్పాదకత సాధించవచ్చని చెప్పారు. రెండు, మూడు పంటలు వేసుకునే అవకాశం ఉందని, భూగర్భ జలాలు కనీసం మూడు మీటర్ల పెరుగుదల ఉంటుందని అన్నారు. 2021 నుంచి 26 సంవత్సరం వరకు వాటర్ షెడ్ 2.0ను రూ.13 వేల కోట్లతో అమలు చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం సమీకృత విధానంలో చేపట్టుటకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు మేథోమదనం జరగాల్సిన అవసరం ఉందని వివరించారు. శాఖల మధ్య సమన్వయం, సహకారం అవసరమని, అలా కాకపోతే అమలులో జాప్యం జరిగే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ప్రజలకు, సమాజానికి అవగాహన లేకపోవడం వలన ప్రయోజనాలు కోల్పోయే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ప్రభుత్వ పరంగా చేపట్టిన పనులు నిర్వహణ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవలసిన అవసరాన్ని గుర్తుచేశారు. వాటర్ షెడ్ పథకాల అమలు ప్రాధాన్యతను నొక్కి చెపుతూ కరువు తాండవించే ప్రాంతాలకు ఎక్కువ ప్రాధాన్యత అవసరం అన్నారు. ప్రతి ఏడాది కనీసం 25 వేల వరకు చెరువులు పునఃనిర్మాణం చేయుట వరకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల భాగస్వామ్యం, సమన్వయం, అవగాహనతో అద్భుత ఫలితాలు సాధించవచ్చని, జీవనోపాధులకు బాటలు వేయవచ్చని అన్నారు. వెంగళాయపాలెంలో వాటర్ షెడ్ మహోత్సవ్‌లో భాగంగా అమృత్ సరోవర్ క్రింద 21 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువును ఆహ్లాదకరంగా తయారు చేయడమే కాకుండా చుట్టూ చక్కటి ఉద్యాన వనంగా తీర్చిదిద్దడం జరిగిందని, చిన్నారులకు క్రీడా పరికరాలను, యోగ, వ్యాయామం చేయుటకు అనుగుణంగా పనులను చేపట్టామని, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.

కేంద్ర ప్రభుత్వ భూ సంస్కరణల విభాగం కార్యదర్శి మనోజ్ జోషి మాట్లాడుతూ ప్రభుత్వం దేశంలో నలుమూలలకు నీటి వసతులు కల్పనకు వాటర్ షెడ్ ద్వారా నిధులు సమకూర్చుతుందన్నారు. ఇందుకు స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేస్తున్నామని చెప్పారు. కొన్ని రాష్ట్రాలు త్వరగా మంచి పనులు పూర్తి చేస్తున్నాయని ప్రశంసించారు.

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ నీటి వసతులను పునరుద్ధరణ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా "ఎన్స్యూరింగ్ వాటర్ సెక్యూరిటీ, నర్చరింగ్ వేస్ట్ లాండ్, ఎంపవరింగ్ రూరల్ లైవ్లి హుడ్స్" రాజస్థాన్" అనే పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ సెక్రెటరీ నితిన్ కడే, రాష్ట్ర పంచాయతీ రాజ్ సంచాలకులు మైలవరపు కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ సి.పి.రెడ్డి, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, గ్రామీణ అభివృద్ధి శాఖ వాటర్ షెడ్ విభాగం సంచాలకులు వై.వి.కె. షణ్ముఖ కుమార్, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# మీడియా రిలేషన్స్ పోర్టల్ ప్రారంభం

విజయవాడ (గన్నవరం), నవంబరు 10 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌లు జారీచేసేందుకు మీడియా రిలేషన్స్ పోర్టల్‌ను ప్రారంభించారు. సోమవారం అమరావతిలోని సచివాలయం ప్రచార విభాగంలో జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర సమాచార శాఖా మంత్రి కె.పి.సారధి, సమాచారశాఖ సంచాలకులు కెఎస్.విశ్వనాథ్‌తో కలిసి మీడియారిలేషన్స్ పోర్టల్ (వెబ్‌సైట్)ను ప్రారంబించారు. రాష్ట్రంలోని వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు గతంలో మంజూరు చేసిన అక్రిడిటేషన్‌ల గడవు ఈనెలాఖరుతో ముగియనుండగా, 2026-27 రెండేళ్ళ కాలపరిమితితో కూడిన అక్రిడిటేషన్‌లు మంజూరు చేసేందుకు గానూ ఈవెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయిలో అర్హత కలిగిన జర్నలిస్టులు ఈవెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈపోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులు తమ ధరఖాస్తు ఏదశలో ఉందో తెలుసుకునేందుకు వీలుకలుగుతుంది. ఈపోర్టల్ గురించి ఇప్పటికే సమాచారశాఖ అధికారులకు అవగాహన కల్పించామని సంచాలకులు తెలిపారు. ఈపోర్టల్‌లో ధరఖాస్తు చేసుకునే విధి విధానాలను మంగళవారం ప్రకటిస్తామని ఆయన చెప్పారు.



# చట్టబద్ధ దత్తత ఒక వరం

### మార్గదర్శకాలకు అనుగుణంగా దత్తత తీసుకోవడం శ్రేయస్కరం

### ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, నవంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలకు అనుగుణంగా ఈ ఏడాది నవంబర్ నెలలో దత్తతకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ప్రభుత్వాల మార్గదర్శకాలను అనుసరించి చట్టబద్ధంగా దత్తత తీసుకోవడం ఒక వరమని తెలిపారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి పింగళి వెంకయ్య హాల్‌లో దత్తత అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ దత్తతకు సంబంధించి ఎట్టిపరిస్థితుల్లోనూ దళారీలను నమ్మవద్దని.. చట్టపరంగా దత్తత తీసుకోవడం శ్రేయస్కరమని పేర్కొన్నారు. ఎవరైనా పిల్లలను దత్తత తీసుకోవాలనుకుంటే సమగ్ర బాలల సంరక్షణ పథకం, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖను సంప్రదించవలసినదిగా తెలియజేయుచున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల దత్తత ఇతివృత్తంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ షేక్ రుక్సానా సుల్తానా బేగం, డీఆర్‌వో లక్ష్మీనరసింహం, డీఎంహెచ్‌వో సుహాసిని, డీసీపీవో రాజేశ్వరరావు, జాన్సన్ పాల్గొన్నారు.

# కలసి పని చేద్దాం.. పర్యాటక అభివృద్ధి సాధిద్దాం

### పెట్టుబడులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తే భరోసా కల్పిస్తాం: మంత్రి దుర్గేష్

### విజయవాడ నుండి సింగపూర్ నాన్ స్టాప్ ఫ్లైట్ పోస్టర్ ఆవిష్కరణ



విజయవాడ, నవంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: ఆర్థిక పురోగతి, ఉపాధి అవకాశాలు, రాష్ట్రానికి ప్రాచుర్యం కల్పించడమే లక్ష్యంగా కలిసి దేశ, విదేశాల్లో పర్యటిద్దామని తద్వారా పర్యాటక పెట్టుబడులు సాధించి ఆకాశమే హద్దుగా పర్యాటకాభివృద్ధి చేద్దామని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. సోమవారం విజయవాడలోని గుణదలలో ఓ హోటల్‌లో ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో టూరిజం స్టేక్ హోల్డర్లతో నిర్వహించిన చర్చా వేదికలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా నవంబర్ 15న విజయవాడ నుండి సింగపూర్ ఇండిగో నాన్ స్టాప్ ఫ్లైట్ కు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. నూతన పర్యాటక రంగ పాలసీతో అభివృద్ధికి అడుగులు పడ్డాయని, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల భాగస్వామ్యంతో పర్యాటకం పరుగులు పెడుతుందని మంత్రి దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. అందరికీ ఉపయోగపడేలా పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదాను కల్పించడంతో పాటు, సరికొత్త పర్యాటక పాలసీని తీసుకురావడం ఈ రంగ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ఉపాధి కల్పించడమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని మంత్రి దుర్గేష్ అన్నారు. సరైన రీతిలో అభివృద్ధి చెందితే టూరిజం ద్వారా లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు కల్పించడానికి వీలు కలుగుతుందన్నారు. రాష్ట్రానికి ఉన్న ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం పీపీపీ విధానంపై ఆధారపడిందని, ఆ దిశగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని భావిస్తుందని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. పీపీపీ విధానంలో ఇన్వెస్టర్లు ముందుకొస్తే ప్రభుత్వం తరపున ల్యాండ్ పార్సల్, రాయితీలు, ప్రోత్సాహకాలు తదితర అవసరమైన సహకారం అందిస్తామన్నారు. మంచి గ్రూప్‌లతో టైఅప్ అవ్వాలని సూచిస్తూ ఆకాశమే హద్దుగా అభివృద్ధి చేయాలన్నారు. ప్రభుత్వ పరంగా ఏ ఇబ్బందులు లేకుండా సింగిల్ విండో విధానంలో త్వరితగతిన అనుమతులు జారీ చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పర్యాటక, ఆతిథ్య రంగాలకు స్వర్గధామమని, ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయమని, ఇన్వెస్టర్లకు అన్ని విధాలా తోడ్పాటు అందిస్తామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీటీడీసీ చైర్మన్ డా. నూకసాని బాలాజి, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ, ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షు, ప్రధాన కార్యదర్శులు పొట్లూరి భాస్కరరావు, సుబ్బారావు రావూరి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ బి.రాజశేఖర్, ఏపీ హోటల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.వి.స్వామి, పలువురు పర్యాటక సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### విజయవాడ టు తిరుపతి కొత్తగా వందేభారత్

# ప్రయాణం ఇక 4.30 గంటలే!




విజయవాడ, నవంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ నుంచి తిరుపతికి ఇకపై నాలుగున్నర గంటలే ప్రయాణ సమయం పట్టనున్నది.ఆ దిశలో విజయవాడ,తిరుపతి బెంగుళూరు మధ్యనడిచే వందేభారత్ రైలు అందుబాటులోకి రానున్నది. విజయవాడ బెంగళూరు మధ్య నడిచే వందే భారత్ రైలు ప్రతిపాదనలు గత మే నెలలోనే సిద్ధం అయ్యాయి. ఈ నెలాఖరులో ఈ వందేభారత్ రైలు ప్రారంభం కానుంది. విజయవాడ నుంచి బెంగళూరుకు కేవలం తొమ్మిది గంటల్లోనే చేరుకోవచ్చు. మొత్తం 8 బోగీలు, 7 ఏసీ చైర్‌కార్, ఒకటి ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ కలిగిన బెంగళూరు ట్రెయిన్ తిరుపతి వెళ్లే భక్తులకూ ఉపయోగపడనుంది. విజయవాడ బెంగళూరు ఈ వందే భారత్ ట్రైన్ మంగళవారం మినహా మిగతా అన్ని రోజుల్లో అందుబాటులో ఉంటుంది. విజయవాడలో తెల్లవారు జామున 5.15 గంటలకు బయలుదేరి తెనాలి, ఒంగోలు నెల్లూరు మీదుగా ఉదయం 9.45 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. అదే విధంగా చిత్తూరు, కాట్పాడి జంక్షన్, కృష్ణరాజపురం మీదుగా బెంగళూరు (ఎస్ఎంవిటీ)కి మధ్యాహ్నం 2.15గంటలకు చేరుతుంది. అంటే తిరుపతి వెళ్లే యాత్రికులు కేవలం నాలుగున్నర గంటల్లోనే విజయవాడ నుంచి చేరుకోవచ్చు. అదే విధంగా తిరుగు ప్రయాణంలో ఈ ట్రైన్ (20712) బెంగళూరులో మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరి కృష్ణరాజపురం, కాట్పాడి, జంక్షన్, చిత్తూరు మీదుగా సాయంత్రం 6.55గంటలకు తిరుపతి చేరుకుంటుంది. నెల్లూరు, ఒంగోలు, తెనాలి మీదుగా రాత్రి 11.45గంటలకు విజయవాడ చేరుకుంటుంది. విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లాలంటే ఇప్పటివరకు మచిలీపట్నం యశ్వంతపూర్ "కొండవీడు ఎక్స్‌ప్రెస్" మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంది. ఈ ట్రెయిన్ వారానికి మూడు రోజులు మాత్రమే నడుస్తుంది. ఈ నేపథ్యంలో త్వరలో రాబోయే వందే భారత్ ట్రైన్‌తో తక్కువ సమయంలోనే తిరుపతి సహా, నెల్లూరు, బెంగళూరు చేరుకోవచ్చు. విజయవాడ నుంచి మరో వందేభారత్ పట్టాలెక్కనుంది. ఇప్పటికే విజయవాడ నుంచి చెన్నై వరకు నడుస్తున్న వందేభారత్‌ను తాజాగా గుడివాడ, భీమవరం లో హాల్ట్ సౌకర్యం కల్పిస్తూ నర్సాపురం వరకు పొడిగించారు. తాజాగా విజయవాడ తిరుపతి బెంగళూరు రైలు ఈ నెలాఖరున ప్రారంభం కానుంది.



# సినీఫక్కీలో గంజాయి పట్టివేత

### తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు

తిరుపతి (చంద్రగిరి), నవంబర్ 10 ప్రభాతవార్త: చంద్రగిరి పోలీసుల సమర్ధత, చాకచక్యం 32 కిలోల గంజాయి స్వాధీనంలో చక్కగా దోహదపడినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు అభినందిస్తూ రివార్డులను ప్రకటించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పనపాకం పంచాయతీ, తువ్వచేనుపల్లి జాతీయ రహదారి వద్ద చంద్రగిరి డిఎస్పీ ప్రసాద్ పర్యవేక్షణలో చంద్రగిరి సిఐ సురేష్ కుమార్, పాకాల సిఐ సుదర్శన్, చంద్రగిరి ఎస్ఐ వై.అనిత, ఆర్‌సి పురం ఎస్ఐ భక్తవత్సలం బృందం ప్రత్యేక తనిఖీలలో 32 కిలోలు గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగి ందన్నారు. తమకు లభించిన విశ్వసనీయ సమాచారంతో చంద్రగిరి డిఎస్పీని అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఒరిస్సా నుండి తమిళనాడుకు చెందిన పొన్నుస్వామి సెల్వరాజ్ అత్యంత పగడ్బంధీగా గంజాయిని తన కారులో దాచుకుని వెళుతుండగా పోలీసుల సాధారణ తనిఖీలో వెళ్ళడికాలేదన్నారు. అయితే లభించిన సమాచారంతో సంతృప్తి చెందని పోలీసులు మరోమారు పోలీస్ డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేయించారు. ఈ క్రమంలో కారు డాష్ బోర్డ్, గేర్‌బాక్స్, టైర్ స్టెప్ బాగాలలో దాచిపెట్టిన గంజాయిని జాగిలం కనిపెట్టింది. ఆయ ప్రదేశాలలో తనిఖీ చేయగా 32.730 కిలోలు గంజాయి 27 ప్యాకెట్లు బయటపడినట్లు తెలిపారు. దీంతో కారునడుపుతున్న పొన్నుస్వామి సెల్వరాజ్ (43), శివగంగై జిల్లాకు చెందిన కలనివాసల్‌ను అరెస్ట్‌చేసి, గంజాయితో పాటు 2 మొబైల్స్‌ను సీజ్ చేయడం జరిగిందన్నారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, వినియోగం, విక్రయాలపై పోలీసుల ప్రత్యేక వుంచినట్లు ఎస్పీ తెలిపారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాలకుమత్తు పధార్ధాల సరఫరాకు పాల్పడితే తీవ్రమైన సెక్షన్లతో కేసులు నమోదు చేస్తామన్నారు.

# యాభై కిలోమీటర్లకో పోర్టు

### పోర్టుల అభివృద్ధికి ప్రభుత్వ కార్యాచరణ



విజయవాడ, నవంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని సముద్ర తీరంలో విస్తృతంగా పోర్టులను అభివృద్ధి చేసే దిశలో ఏపీ ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది. ఈ పోర్టులను ప్రధాన జాతీయ రహదారులను అనుసంధానం చేసే దిశలో చర్యలు చేపట్టనున్నది.దీని వలన రవాణా వ్యవస్థ అత్యంత బలీయం చేయనున్నది. ఇప్పటికే కోస్తల్ ఏరియా ఉన్న జిల్లాల్లో మారిటైం ప్రాజెక్టులను వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధం చేసింది.ఈ దిశగా పోర్టు సమీప ప్రాంతాల్లో (పోర్టు నుంచి 2 నుంచి 3 కి.మీ. వరకూ ఉన్న ప్రాక్సిమల్ జోన్‌లో) అవసరమైన మౌలిక సదుపాయాలను రూపుదిద్దేందుకు ప్రభుత్వం రూ. 1,220 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. ఈ క్లస్టర్ల కోసం పోర్టులకు సమీపంలో సహజంగా ఉన్న ఉప్పు భూములను వినియోగించుకుని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఈ భూములను రాష్ట్రానికి కేటాయించాలని, కేంద్రంలోని అంతర్గత వాణిజ్యం, పరిశ్రమల ప్రోత్సాహక శాఖను కోరింది. దీనికి అనుగుణంగా ఏపీ మారిటైం బోర్డు రోడ్‌మ్యాప్‌ను తయారు చేసింది.పోర్టు ఉన్న ప్రాంతాలకు సమీప గ్రామాలను అనుసంధానించి క్రమంగా నగరీకరణ చేయాలని నిర్ణయించింది. పోర్టుల నుంచి 2, 3కి.మీ. పరిధిలో రహదారులు, విద్యుత్ సదుపాయాలు, నీటి సరఫరా, ఇతర మోలిక వసతులు అభివృద్ధిచేయడానికి 11 ప్రతిపాదనలు రూపొందించి, ఇవి సాగరమాల 2.0 పథకం కింద కేంద్ర ఆమోదానికి పంపిస్తున్నారు. మూలపేట పోర్టు రసాయన పరిశ్రమలు, వాటి అనుబంధ యూనిట్లకు తగిన మౌలిక వసతులు కల్పించనున్నారు. విశాఖపట్నం పరిధిలో విశాఖ చుట్టుపక్కల ఫార్మా పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున, ఫార్మా, సముద్ర ఆధారిత వాణిజ్య పరిశ్రమలకు అనుకూలమైన క్లస్టర్ అభివృద్ధి చేయనున్నారు. రాంబిల్లి పరిధిలో నేవల్ కార్యకలాపాలకు ఉపయోగించనున్నారు. ఈ ప్రాంతంలో రక్షణరంగ పరిశ్రమల క్లస్టర్ ఏర్పాటు చేయాలని నిర్ణయం. కాకినాడ పరిధిలో ఇక్కడ ఇప్పటికే చమురు వెలికితీసే పరిశ్రమలు ఉన్నాయి. దీనికి అనుసంధానంగా పెట్రోలియం, లూబ్రికెంట్ ఆధారిత పరిశ్రమల క్లస్టర్ అభివృద్ధి. మచిలీపట్నం పరిధిలో విజయవాడ సమీపంలో ఉండటంతో, హెవీ ఇంజినీరింగ్, ఆటోమొబైల్ రంగానికి అనువైన పారిశ్రామిక మోలిక వసతులు. రామాయపట్నం పరిధిలో ఇక్కడ బీపీసీఎల్ ప్రధానంగా రూ.లక్ష కోట్లు వ్యయంతో చమురు శుద్ధి కర్మాగారం స్థాపించనుంది. కృష్ణపట్నం: తిరుపతి సమీపంలో ఇప్పటికే ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఉన్నాయి. రాయలసీమలో ఉన్న పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులకు అనుసంధానంగా పరిశ్రమ క్లస్టర్ అభివృద్ధి. దుగరాజపట్నం: ఇక్కడ షిప్ బిల్డింగ్, ఓడల రిపేర్, నిర్వహణ, ఓవర్‌హాలింగ్ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసే దిశగా క్లస్టర్ ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, కృష్ణపట్నం వంటి ప్రధాన ఓడరేవులు ఉన్నాయి. ఇవే కాకుండా రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ సెజ్ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. రక్షణ అవసరాల కోసం రాంబిల్లి వద్ద నావల్ ఆపరేషన్లకు అనుకూలంగా మరో పోర్టును అభివృద్ధి చేస్తున్నారు. భవిష్యత్తులో నక్కపల్లి, దుగరాజపట్నం ప్రాంతాల్లో కూడా ఓడరేవుల ఏర్పాటు ప్రధాన లక్ష్యంగా ఉంది. ఈ విధంగా ప్రతి 50 కి.మీ. దూరంలో పోర్టు, ఫిషింగ్ హార్బర్, సముద్ర ఆధారిత పారిశ్రామిక యూనిట్లు ఏర్పడే విధంగా ప్రణాళిక సిద్ధమవుతోంది. దీంతో వాణిజ్యం విస్తృతంగా పెరగడమే కాకుండా, తీర ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుంది.

# పట్టపగలు కొత్తపేటలో దారుణం

### నగల దోపిడీలో వృద్ధురాలు మృతి



కల్లూరు, నవంబరు 10 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి (కొత్తపేట)లో సోమవారం మధ్యాహ్నం దారుణం చోటుచేసుకుంది. బంగారు నగలు దోపిడీలో వృద్ధురాలు మృతి చెందడం మరో వృద్ధురాలకు గాయాలు కావడం జరిగింది. గ్రామస్తులు పోలీసుల కథనం మేరకు. కొత్తపేటలో దామలచెరువు మార్గంలో కళావతమ్మ నివసిస్తున్నది. ఈ గృహంలో పై భాగంలో విమలమ్మ (75) కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నది. సోమవారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు పని నిమిత్తం బయటకు వెళ్లడంతో విమలమ్మ కింద కాపురం ఉంటున్న కళావతమ్మ ఇంటికి వచ్చి కబుర్లు చెప్పుకుంటున్నారు. బయటకు వెళ్లిన విమలమ్మ కుటుంబ సభ్యులు రెండు గంటల తర్వాత తిరిగి ఇంటికి రావడం ఇంటిలో విమలమ్మ లేకపోవడంతో కింద కళావతమ్మ ఇంటికి రాగా తలుపు వేసి ఉండడం జరిగింది. కుటుంబ సభ్యులు తలుపు తీసి చూడగా విమలమ్మ కింద పడిపోయి ఉండడం కళావతి చెవులు నుంచి రక్తం కారుతూ ఉండడంతో అది చూసి వారు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని విమలమ్మను తట్టి లేపగా లేవకపోవడంతో కంగారపడి చూడగా విమలమ్మ మృతి చెందినట్లు గుర్తించారు. కళావతమ్మ భయముతో వణికిపోతూ ఉండడం విషయాలు చెప్పలేకపోయింది. అయితే విమలమ్మ కళావతమ్మ దగ్గర ఉన్న బంగారు నగలు కనబడకపోవడం గుర్తించిన కుటుంబ సభ్యులు స్థానికులు గుర్తు తెలియని వ్యక్తులు నగలు కోసం వచ్చి దారుణానికి ఒడి కట్టినట్లు గుర్తించి కల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కల్లూరు సిఐ జయరామయ్య, కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన కళావతమ్మను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. విమలమ్మ మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. చిత్తూరు డిఎస్పి సాయినాథ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. నగల కోసమే గుర్తు తెలియని వ్యక్తులు ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు తెలిసింది. కొత్తపేట ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడం విశేషం. ఈ విషయమై డిఎస్పి సాయినాథ్ స్థానిక పోలీసులను ఆరా తీశారు. పట్టపగలు మిట్ట మధ్యాహ్నం రోడ్డు పక్కన ఉన్న గృహంలో ఇంత దారుణం జరగడం కొత్తపేటలో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మండల వ్యాప్తంగా ఈ సంఘటన సంచలనం కలిగించింది.

11-11P g7exHMNWJQE 11_11-11P g7exHMNWJQE.qxd 11/Nov/25 12:47 AM Page 1



# తుపాను నష్టం అర్థం చేసుకున్నాం కేంద్రానికి నివేదిస్తాం

## - ఒంగోలు జిల్లా అధికారులకు కేంద్ర బృందం భరోసా

ఒంగోలు, నవంబరు 10 ప్రభాతవార్త (ప్రతినిధి): మొంథా తుపాను వలన ప్రకాశం జిల్లాకు కలిగిన నష్టాన్ని అర్థం చేసుకోగలమని కేంద్ర బృందం తెలిపింది. క్షేత్రస్థాయిలో జరిగిన నష్టం గురించి ప్రభుత్వానికి నివేదిస్తామని భరోసా ఇచ్చింది. ఈ తుపాను వలన జిల్లాలో జరిగిన నష్టాన్ని పరిశీలిం చేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులతో నియమించిన కమిటీ సోమవారం జిల్లాలో పర్యటించింది. పి.పౌసుమి బసు, మహేష్ కుమార్, శశాంక్ శేఖర్ రాయ్, సాయి భగీరథ్‌లతో పాటు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ కూడా వచ్చారు. ముందుగా ఒంగోలు నగరంలోని ఎన్ఎస్పి గెస్ట్ హౌస్‌కు రాగా కలెక్టర్ పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల కృష్ణ, డిఆర్ఓ బి.చిన ఓబులేసు స్వాగతం పలికారు. ఈ నష్టాన్ని తెలిపేలా గ్రీవెన్స్ హాలులో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను కేంద్ర బృందం వీక్షి ంచింది. వీటికి సంబంధించిన వివరాలను స్వయంగా కలెక్టర్ వారికి వివరించారు. జిల్లాలో ప్రధానంగా వ్యవసాయము దాని అనుబంధ రంగాలు, రోడ్లు భవనాలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, పంచాయతీరాజ్ రోడ్లు, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, పశుసంవర్ధక శాఖలతో పాటు ఒంగోలు నగరం పైనా ఈ తుపాను తీవ్ర ప్రభావం చూపినట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం తుపానుకు ముందు పరిస్థితి ఏ విధంగా ఉన్నదీ, తుపాన్ సమయంలో ఎలాంటి పరిస్థితి తలెత్తిందీ, తుపాను తర్వాత పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు తీసుకున్న చర్యలను తెలియజేసేలా ప్రత్యేకంగా రూపొందించిన వీడియోను కూడా కేంద్ర బృందం వీక్షి ంచింది.



ఈ తుపాను వల్ల రైతుల తోపాటు చేపలు, రొయ్యల చెరువులు సాగుచేస్తున్న వారు కూడా తీవ్రంగా నష్ట పోయినట్లు ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ రావు, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్ కేంద్ర బృందానికి తెలిపారు. అల్లూరు, కొప్పోలు రొయ్యల చెరువులను కేంద్ర బృందం పరిశీలిస్తుండగా తుపాన్ సమ యంలో నెలకొన్న పరిస్థితి, వీటి సాగుదారులు నష్టపోయిన విధానాన్ని వారు వివరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను బృందానికి అందజేశారు.

ఇతర రంగాలపై చూపిన నష్ట ప్రభావాన్ని కూడా వారు వివరించారు. పరిస్థితిని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి బాధితులను ఆదుకునేలా అవసరమైన సహాయం అందించేలా చూడాలని కోరారు.

కేంద్ర బృందం అల్లూరులోని వరి పొలాలను సందర్శించింది. నీరు నిలిచిపోవడం వలన వేర్లతో సహా కుళ్లిపోయిందని రైతులు వాపోయారు. అంతా అనుకూలిస్తే సంక్రాంతి సమయానికి పంట చేతికొచ్చేదని, ఇప్పుడు పరిస్థితి తారు మారైపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

వరి దుబ్బులను తెచ్చి చూపించగా... మొత్తం కోల్పోయారుగా అని కేంద్ర బృందం సభ్యులు సైతం ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అల్లూరు చెరువును బృందం పరిశీలించింది. తుఫాను సమయంలో ఈ చెరువు కట్టకు గండి పడే పరిస్థితి తలెత్తగా, జిల్లా యంత్రాంగం అప్రమత్తమై పరిస్థితిని అదుపులోకి తెచ్చిన తీరును వారు పరిశీలించారు. నీటి ఉధృతికి ఈ మార్గంలోని కల్వర్టు దెబ్బతినిన విధానాన్ని ఇంజనీరింగ్ అధికారులు ఈ సందర్భంగా వారికి వివరించారు.

నాగులుపలపాడులో దెబ్బతిన్న పత్తి పంటను ప్రతినిధుల బృందం పరిశీలించింది. పంట పూర్తిగా దెబ్బతిందని, వేర్లకు ఫంగస్ వ్యాపించడం వలన పొలంలో మరో పంట వేసే అవకాశం కూడా ఈ సీజన్లో లేదని రైతులు చెప్పారు.

కేంద్ర బృందం గ్రీవెన్స్ హాలుకు వచ్చినప్పుడు సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్. విజయ్ కుమార్, రాష్ట్ర వ్యవసాయం మిషన్ వైస్ చైర్మన్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, ఇతర ప్రజా సంఘాల నాయకులు కూడా కలిశారు. జిల్లాకు జరిగిన నష్టాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి ఆదుకునే చూడాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించారు.



# కృష్ణాలో తుపాను నష్టం పరిశీలన

గన్నవరం(కృష్ణా), నవంబరు 10 ప్రభాతవార్త: ఇటీవల వచ్చిన పెనుతుఫాన్ మెంతా కారణంగా నష్టపోయిన పంటలను అంతర మ ంత్రిత్వ కేంద్రబృందం(ఐయంసిటీ) సోమవారం పరిశీలించింది. కేంద్ర వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ కె.పొన్నుస్వామి నేతృత ్వంలోని బృందం క్షేత్రస్థాయిలో తుఫాన్ నష్టాన్ని పరిశీలించి నష్టం అంచనాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందించనున్నారు. తుఫాన్ నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన ఈబృందం ముందుగా కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామ వరిపొలాల్లో క్షేత్రసాయిలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా నేలవాలిపోయి చాపలా మారిన వరిపొలాలను పరిశీలించి నష్టం వివరాలను రైతులను అడిగితెలుసుకున్నారు. వరిపంట పాలుపోసుకునే దశలో తుఫాన్ గాలులకు ఇలా నేలకొరిగి పోవటంతో తాలు గింజలు వస్తాయని తద్వారా పావుశాతం కూడా పంట దిగుబడులు రావని రైతులు కేంద్రబృందానికి వివరించారు. అనంతరం రోడ్డుమార్గాన గన్నవరం చేరుకున్న ఈబృందం తుఫాన్ వల ్ల దెబ్బతిన్న గృహాలు, పంటలు, చనిపోయిన పశువులు, దెబ్బతిన్న విద్యుత్ స్తంబాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, రహదారులు, సహాయశిబిరాలు, నిత్యావసర సరుకుల పంపిణీ, తదితర అంశాలపై ఫోటోలతో గన్నవరం యంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. ఈసందర ్భంగా ఫోటో ప్రదర్శన ద్వారా జిల్లా వ్యాప్తంగా రహదారులకు, విద్యుత్‌శాఖకు, పంటలకు జరిగిన నష్టాన్ని, ప్రభుత్వం చేపట్టిన పునరావాస కార్యక్రమాలు, తుఫాన్‌కు ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డికె.బాలాజీ, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌లు కేంద్రబృందానికి వివరించారు. ఈసందర్భంగా కలెక్టర్ బాలాజీ మీడియాతో మాట్లాడుతూ కేంద్రబృందానికి మెంతా తుఫాన్ కారణంగా జిల్లావ్యాప్తంగా జరిగిన నష్టాన్ని వివరించినట్లు చెప్పారు. జిల్లాలో ప్రధాన పంట అయిన వరిపొలాలకు ఈబృందాన్ని తీసుకువెళ్ళి దెబ్బతిన్న పంటలను చూపించామని, ఈబృందంలోని సభ్యులు పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి నష్టం వివరాలు తెలుసుకున్నారని, ఇతర పంటలు, ఇతరత్రా నష్టాలను ఫోటో ప్రదర్శన ద్వారా వారికి వివరించినట్లు తెలిపారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలో తుఫాన్ వల్ల భారీ వర్షపాతం నమోదు కానప్పటికీ ఈదురుగాలులకు పంటలకు ఆపారనష్టం వాటిల్లిందన్నారు. ఇదే విషయాన్ని కేంద్రబృందానికి వివరించి రైతులను ఉదారంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఈ కార ్యక్రమంలో కేంద్రబృందం సభ్యులు హైదరాబాద్ సెంట్రల్ వాటర్ కమీషన్ జలవనరుల మంత్రిత్వశాఖ సంచాలకులు శ్రీనివాసు బైరి, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అధారిటీ విద్యుత్‌చ్ఛక్తి మంత్రిత్వ శాఖ ఉపసంచాలకులు ఆర్ ్తసింగ్ గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయసంచాలకులు మనోజ్‌కుమార్ మీనా, కేంద్రబృందం వెంట రాష్ట్రపౌరసరఫరాలసంస్థ యండి డిల్లీరావు, జేసి యం.నవీన్, గుడివాడ ఆర్డీఓ బాలసుబ్రమణ ్యం, జిల్లావ్యవసాయఅధికారి ఎన్.పద్మావతి, పశుసంవర్ధకశాఖ అధికారి చిన్ననరసింహులు, తదితర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# విశాఖ సిఐఐ సదస్సు రాష్ట్ర యువత బంగారు భవితకు వేదిక

## మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

సచివాలయం(అమరావతి), నవంబరు 10 ప్రభాతవార్త: రాష్ట్ర యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ అవిశ్రాంత కృషి చేస్తున్నారని విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 14,15తేదీల్లో విశాఖలో జరగనున్న సిఐఐ సదస్సు రాష్ట్ర యువత బంగారు భవితకు వేదిక కానుంది. ఈ సదస్సు ద్వారా 410ఒప్పందాలు, రూ.9.76లక్షల కోట్ల పెట్టుబడులు, 7.48 లక్షల ఉద్యోగాలు వస్తాయి. ఈ సిఐఐ సదస్సులో 112 పరిశ్రమలకు ప్రారంభోత్సవాలు చేయబోతున్నాం. సదస్సుకు 45దేశాల నుండి సుమారు 300మంది ప్రతినిధులు, 200మంది భారత అగ్రశ్రేణి సంస్థల సీఈవోలు, పలువురు కేంద్రమంత్రులు హాజరవుతారు. ఈ సదస్సులో భాగంగా 48కీలక సెషన్లతో పాటు ఆంధ్రప్రదేశ్ పెవిలియన్, హ్యాకథాన్, బిజినెస్ టూ గవర్నమెంట్ సమావేశాలు జరుగుతాయని మంత్రి తెలిపారు. విశాఖ సిఐఐ సదస్సు చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ సదస్సును రాష్ట్రంలోని ప్రజలు, విద్యార్థులు వీక్షించేలా ఏర్పాట్లు చేయమని ముఖ్యమంత్రి ఆదేశించారని, అందుకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు.



క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను కలసిన బిసి నేతలు

# టిడిపితోనే బిసిల అభ్యున్నతి

## రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

సచివాలయం, నవంబరు 10 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు గుర్తింపు లభించిందని, రాజకీయ, ఆరి ్థక, సామాజికంగా బీసీల అభ్యున్నతి సీఎం చంద్రబాబు తోనే సాధ్యమని రాష్ట్ర బిసి, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను నూతనంగా ఎన్నికైన అమరావతి కురుమ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలుసమస్యల పరిష్కారానికి మంత్రికి వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి మంత్రి సవిత సానుకూలంగా స్పందించారు. నూతనంగా ఎన్నికైన అమరావతి కురుమ సంక్షేమ గుంటూరు జిల్లా శాఖ ప్రతినిధులను మంత్రి సవిత అభినందించారు. ఈ కార్యక్రమంలో నూతన కురమ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు మర్రి వెంకట సత్యనారాయణను, ఉపాధ్యక్షుడు బక్కా ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి.రామకృష్ణ, ట్రెజరర్ కెవి సత్యనారాయణ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



# ఏలూరు జిల్లాలోనూ...

## ఉంగుటూరులో పంట నష్టాలను పరిశీలన
## కేంద్ర బృందానికి వివరించిన జిల్లా కలెక్టర్

ఉంగుటూరు/ ఏలూరు, నవంబరు 10 ప్రభాతవార్త ఏలూరు జిల్లాలో మొంథా తుఫాన్ నష్టాల పరిశీలనకు కేంద్ర ప్రభుత్వం నియమించిన పరిశీలన బృందం సోమవారం ఉంగుటూరు మండలం నారాయణపురం చేరుకుని ముందుగా గొట్టుముక్కల సత్యనారాయణ రాజు పొలంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించింది. పంట నష్టాలను గురించి అక్కడకు చేరుకున్న రైతులను బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా యంత్రాంగం తుఫాన్ నష్టాలు, అనంతరం చేపట్టిన పునరుద్ధరణ పనులు, తుఫాను బాధితులకు ఏర్పాటుచేసిన పునరావాస కార్యక్రమాలపై ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను బృందం సభ్యులు పరిశీలించారు. తేమ శాతం కొలిచే యంత్రం ద్వారా దెబ్బతిన్న వరి పంట తేమ శాతం కొలువగా 23. 6 శాతంగా తేలింది. దెబ్బతిన్న వరిదుబ్బులను, పాడైన మినుము పంటలు, అరటి, ఉద్యాన పంటలను బృందం సభ్యులు పరిశీలించి వాటి వివరాలను నమోదు చేసుకున్నారు. జిల్లాలో మొంథా తుఫాన్ కారణంగా వ్యవసాయం, అనుబంధ రంగాలకు, గృహాలు, విద్యుత్, రోడ్లు, ఇతర నష్టాలను కేంద్ర బృందానికి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి వివరించారు. కేంద్ర బృందంతో పాటు వ్యవసాయ శాఖ కమీషనర్ ఢిల్లీరావు, ప్రభృతులు ఉన్నారు. అనంతరం కేంద్ర బృందం తూర్పు గోదావరి జిల్లా బయలుదేరి వెళ్ళింది. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ, ఏలూరు ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, ఉద్యానవనాల అధికారి షాజా నాయక్, తహసీల్దార్ పూర్ణారావు, ఎంపిపి ఘంటా శ్రీలక్ష్మి ్మ, సర్పంచ్ టి. అలకానంద, ఎంపిటిసి మహాలక్ష్మి ్మ, ప్రభృతులు పాల్గొన్నారు. కేంద్ర పరిశీలన బృందంలో కేంద్ర వ్యవసాయ శాఖ మరియు రైతు సంక్షేమ శాఖ డైరెక్టర్ డా. కె. పొనుసామి, సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ శ్రీనివాసు బాల్రి, కేంద్ర విద్యుత్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆర్తీ సింగ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మనోజ్ కుమార్ మీనా లు సభ్యులుగా ఉన్నారు.

# రాయల చెరువు బాధితులకు నష్టపరిహారం

## ప్రభుత్వ చర్యలు వేగం... కలెక్టర్ చొరవతో సహాయం

శ్రీకాళహస్తి, నవంబరు 10 ప్రభాతవార్త: శ్రీకాళహస్తికి సమీపంలోని సత్యవేడు నియోజకవర్గం కెవిబిపురం ఒళ్ళూరు పాతపాళెం, కళత్తూరులను ముంచేసి తీవ్ర ఆస్తినష్టాన్ని కల్గించి ప్రజలకు కష్టాలు మిగిల్చిన రాయల చెరువు తెగిన సంఘటనలో బాధితులకు సత్వర సహాయం అందించుటకు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ చూపిన చొరవ సర్వత్రా అభినందనలు అందుకుంటుంది. వరదలో చరిత్రలో లేని విధంగా ప్రభుత్వం స్పందించటం, మొక్కుబడిగా ఇచ్చే సహాయం స్థానంలో భారీ సహాయం అందించ టం చర్చనీయాంశంగా మారింది. ఒక్క గంటలో గ్రామాలు జలమయమయ్యాయి. పచ్చటి పొలాలు ఇసుక మేటలుగా మారింది.పాడి పశువులు కళ్ళ ముందే కొట్టుకుపోతుంటే నిస్సహాయంగా చూస్తు ఉండటం మినహా ఏమి చేయాలేని దుస్థితి. ఇళ్ళలో జల ప్రళయం అన్నట్లు మారింది. కళత్తూరుకు ఎగువ బాగంలో నిర్మించిన రాయల్‌చెరువు కట్ట తెగింది. సుమారు 1200 ఎకరాల అధికారికంగా మరోన 1500 ఎకరాలు అనధికారికంగా సాగు జరుగుతుంది. పాడి పరిశ్రమలతో తులతూగుతున్న పచ్చని గ్రామాలపై రాయలచెరువు నీరు దాడి చేసింది. వేలాది కుటుంబాలు ఒక్క సారిగా రోడ్డు మీద పడ్డాయి. ఇళ్ళు బురద గుంతలుగా మారింది. అయితే విజయవాడలో ఉన్నజిల్లా కలెక్టర్ పరుగున వచ్చారు. అప్పటికే శ్రీకాళ హస్తి ఆర్‌డిఓను సంఘటనా స్థలానికి పంపారు. బాదితులకు తక్షణ సాయం అందించుటకు పునరావస కేంద్రాలు ఏర్పాటుకు ఆదేశించారు. సాయంత్రానికి కలెక్టర్ చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

### క్యాబినెట్‌లో సమీక్ష:

### సహాయం ప్రకటన:

కెవిబిపురం మండలం లో చోటు చేసుకున్న సంఘటనలపై సోమవారం మంత్రి వర్గ సమావేశంలో సాక్షాత్తు ముఖ్యమంత్రి సమీక్షించారు. జరిగిన ఉదంతం దారుణమని భావించారు.వెంటనే సహయం ప్రకటించారు. సాధారణంగా ఇప్పటి వరకు సంభవించిన వరద ముంపులకు సంబంధించిన సహాయాన్ని గమనిస్తే రూ.500లకు మించి ఇచ్చే వారు కాదు. కానీ కళత్తూరు సంఘటనలో బాధితులకు తాత్కాలిక సహాయం ఒక్కొక్క ఇంటికి రూ.3 వేలు చొప్పున చెల్లించుటకు నిర్ణయించారు. కాగా ఇక్కడ 980ఇళ్ళు దెబ్బతినగా రూ.3.9కోట్లు మంజూరు చేసారు.కాగా 1100 పశువులకు గాను రూ.2.95 కోట్లు ఆర్థిక సహాయం అందించుటకు ప్రభుత్వం ఆదేశించారు. ఈ సత్వర చర్యలు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్ చొరవతో మాత్రమే సాధ్యమైందని చెప్పవచ్చు. ఇక్కడ సాధారణ స్థితి కల్పించుటకు యుద్ధ ప్రాతిపదికపై చర్యలు తీసుకుంటున్నారు.



కళత్తూరులో జీవన స్థితి సాధారణ స్థితికి తేవటానికి ప్రయత్నం




# గీత పఠనంలో తారుష్ భళా

హిందూపురం, నవంబరు 10 ప్రభాతవార్త: ఆరేళ్ల వయసులోనే అద్భుతమైన ఘనత వహించి.. గీతా పఠనంలో తెలుగు రాష్ట్రాల విజేతగా నిలిచి హిందూ పురానికి వన్నెతెచ్చాడు సుంకు తారుష్. హిందూ పురం మార్కెట్ యార్డ్‌లో ప్రముఖ మండి మర్చంట్స్ వ్యాపారులు సుంకు బద్రినాథ్ మనవడు, సుంకు వెంకటేష్, అపూర్వల కుమారుడు స్థానిక యూరో కిడ్స్ స్కూల్‌లో యూకేజీ చదువుతున్నాడు. పిన్న వయసులో చదువుతో పాటు ఆధ్యాత్మిక జిజ్ఞాస కలిగిన తారుష్ స్థానిక డిబి కాలనీలో ఎస్.కె.నాగవేణి సారథ్యంలోని ప్రసన్న వేణివేద మాలిక సంస్థలో రెండేళ్లుగా ప్రతిరోజు భగవద్గీత శ్లోకాలను నేర్చుకుంటున్నాడు. ఇటీవల చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ స్కూల్స్ జిల్లా స్థాయి కాంపిటీషన్లో ప్రథమ స్థానంలో నిలవడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల గీత పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 9న కడప నందు చిన్మయ మిషన్ నేతృతంలో జరిగిన గ్రూప్ ఎ పోటీలో అద్భుతమైన ప్రదర్శనతో బాలుడు శభాష్ అనిపించుకున్నాడు. గీత 15వ అధ్యాయంలో శ్లోకాలను చెప్పడమే కాకుండా వాటి అర్థాలను కూడా వివరించడంతో నిర్వాహకులు భళా.. అని అభినందిస్తూ విజేతగా ప్రకటించారు. అంతేకాకుండా త్వరలో పుణేలో జరగ బోయే జాతీయ స్థాయి భగవద్గీత పోటీలకు ఎంపికయ్యాడు. గురు శిష్యులకు సన్మానం భగవద్గీత పఠనంలో రెండు తెలుగు రాష్ట్రాల విజేతగా నిలిచారన్న సమా చారం తెలుసుకుని బోధకులు నాగవేణి, చిచ్చరపిడుగు తారుష్‌ను మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రమోహన్ యాదవ్, జనసేన నాయకులు రాము సన్మానించి అభినందనలు తెలిపారు.

## ఆవులు కడిగేందుకై వెళ్లి...

# నీట మునిగి ఇద్దరు మృతి

రామకుప్పం, నవంబరు 10 ప్రభాతవార్త: ఆవులు కడిగే ందుకని నీటి కుంట వద్దకు వెళ్ ్లిన ఇద్దరు యువకులు నీటికుంటలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం కోటచేను గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. కోటచేను గ్రామంకు చెందిన సుబ్బన్న కుమారుడు గోవిందరాజులు(31), కుళ్లగా నూరుకు చెందిన రామూర్తి కుమారుడు సతీష్ (16)లు గ్రామ సమీపంలో పశువులు కడిగేందుకని వెళ్లారు. ప్రమాదవశాత్తు వీరు నీటికుంటలో ఇరుక్కుపోయి మృతి చెందారు. స్థానికులు హుటాహుటిన నీటికు ంటలో దిగి రక్షించే యత్నం చేయగా అప్పటికే వారు చనిపోయారు. విషయం తెలుసుకున్న డిఎస్పీ పార్థసారథి, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సై వెంకటమోహన్ సిబ ్బందితో కలసి సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను ప ంచనామా నిమిత్తం కుప్పం ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా సతీష్ కోట చేనులో ఉన్న తన అవ్వను చూసేందుకు వచ్చాడని తెలిసింది. ఇకేసారి ఇద్దరు యువకులు మృతి చె ందడంతో కోటచేనులో విషాదఛాయలు అలుముకునా ్నయి.

# ముదిగుబ్బలో గంజాయి కలకలం... 14 మంది అరెస్ట్

ముదిగుబ్బ నవంబర్ 19 ప్రభాతవార్త: శ్రీ సత్య సాయి జిల్లా ముదిగుబ్బ మండల కేంద్రంలో గంజాయి కలకలం చెలరేగింది సోమవారం పోలీసుల అకస్మిక తనిఖీలు సుమారు మూడు కిలోల గంజాయి ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకొని 14 మంది యువకులను పోలీసులు అరెస్టు చేశారు వివరాల్లోకెళ్తే ముదిగుబ్బ గ్రామ శివారులోని కాకతీయ హోటల్ సమీపం లో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేయగా ఈ దాడిలో గంజాయి క్రీస్తున్న వారు. గంజాయి సేవిస్తున్న యువకులు కూడా పోలీసులకు పట్టుబడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా గంజాయి వ్యాపారం పై ప్రభుత్వం పలు చర్యలు చేపడుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల వరకు గంజాయి చొరబడడం పోలీసులకు పెను సవాలుగా మారిందని అధికారులు తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న వారిలో ప్రధాన నిందితులు గా గుర్తించిన అనంతపురానికి చెందిన షికారి గోవిందు (38) వద్ద నుండి స్థానిక యువకులు నందకుమార్ సాయికుమార్ సాయి తేజ నవీన్ కుమార్ రెడ్డి గణేష్ తదితరులు కలిసి 18 వేలకు ఒక కిలో గంజాయి కొనుగోలు చేసినట్లు విచారణలో బయటపడింది కొన్న గంజాయిని తదుపరి దానిని చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ప్రతి ప్యాకెట్ కు 200 నుండి రూ 400 వరకు ధరకు విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు ఈ గంజాయిని ఎక్కువగా 16 నుండి 22 సంవత్సరాల వయసు గల యువకులకు విక్రయించి వారిని గంజాయికి అలవాటు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు అరెస్ట్ అయిన వారి వివరాలు కుమార్ 34 సంవత్సరాలు ముదిగుబ్బ. మేకల సాయి తేజ 24 సంవత్సరాలు ఎస్సీ కాలనీ ముదిగుబ్బ. పోతిరెడ్డి నవీన్ కుమార్ రెడ్డి 21 సంవత్సరాలు ఆర్ అండ్ బి బంగ్లా ముదిగుబ్బ. ముత్తన నగేష్ 24 ముదిగుబ్బ. షికారి గోవిందు 38 అనంతపురం టౌన్. ముష్టురు దాదా పీర్ 25 టీచర్స్ కాలనీ ముదిగుబ్బ. రామన్న గారి నిధి కుమార్ 19 సంవత్సరాలు ముదిగుబ్బ. మేకల నరేష్ 31 సంవత్సరం సెలీంబావి వీధి. సాకే పవన్ కుమార్ 21 ఎస్సీ కాలనీ ముదిగుబ్బ. చెన్నంపల్లి గణేష్ 19 సంవత్సరాలు దొరిగిల్ రోడ్డు ముదిగుబ్బ. తలసూరి ప్రవీణ్ కుమార్ నాయుడు 20 సంవత్సరాలు కస్తూరిబా కాలనీ ముదిగుబ్బ. వీరిలో 13 14 సంవత్సరాల వయసు గల బాల నేరస్తులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీటిపై చాలా రోజుల నుండి నిఘా పెట్టినట్లు డీఎస్పీ హేమంత్ కుమార్ పర్యవేక్షణలో సీఐ శివరాముడు ఎస్సై ట్రైనింగ్ భువనేశ్వరి ఇతర పోలీస్ సిబ్బంది ఈ దాడిని నిర్వహించారు




ముదిగుబ్బ పోలీసులను డిఎస్పి హేమంత్ కుమార్ ప్రశంసించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక పనులకు ఎవరైనా పాల్పడితే గంజాయి. మటక. కార్డ్స్ బెట్టింగులు ఇటువంటి చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు

11-11pg10 12 GNT_11-11pg10.qxd 11/Nov/25 1:06 AM Page 1




# జపాన్ బ్యాడ్మింటన్‌లో ప్రమోద్‌కు ట్రిపుల్ స్వర్ణం

## డబుల్ గోల్డ్‌తో కృష్ణ, సుకాంత్ స్వర్ణం, రజతం




**న్యూఢిల్లీ:** జపాన్ పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ 2025లో భారత పారా బ్యాడ్మింటన్ స్టార్లు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. ప్రమోద్ భగత్ సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో 3 స్వర్ణ లను సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. కృష్ణ నాగర్ సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో 2 స్వర్ణాలను గెలుచుకున్నాడు. సుకాంత్ కదమ్ పురుషుల డబుల్స్‌లో 1 స్వర్ణం, సింగిల్స్‌లో 1 రజతం సాధించాడు. ఈ ఛాంపియన్‌షిప్ ఎస్ఎల్3 సింగిల్స్ ఫైనల్స్ భగత్ డైసుకే ఫుజిహారా (జపాన్) చేతిలో తొలి సెట్ కోల్పోయిన తర్వాత అద్భుతమైన పునరాగమనం చేశాడు. మొదటి మ్యాచ్‌లో 17-21తో, రెండవ మ్యాచ్‌లో 16-19తో వెనుకబడినప్పటికీ, ప్రమోద్ ధైర్యాన్ని ప్రదర్శించి మ్యాచ్‌ను సమం చేశాడు. తర్వాత 1 గంట 33 నిమిషాల పాటు జరిగిన పోరులో 17-21, 21-19, 21-10 తేడాతో ఆధిపత్యం చెలాయించాడు. అలాగే పురుషుల డబుల్స్‌లో భగత్, సుకాంత్ కదమ్‌తో కలిసి జగదీష్ ఢిల్లీ, నవీన్ శివకుమార్‌లను మూడు సెట్టర్లలో (21-17, 18-21, 21-16) ఓడించాడు. మనీషా రామదాస్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ ఎస్ఎల్4-ఎస్‌యు5 టైటిల్‌ను గెలుచుకోవడం ద్వారా అతను తన బంగారు హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు. 29 నిమిషాల పోటీలో నితేష్ కుమార్, తులసిమతి మురుగేషన్‌లను 21-19, 21-19 తేడాతో ఓడించాడు. ఇక టోక్యో పారాలింపిక్ బంగారు పతక విజేత కృష్ణ నాగర్ మరోసారి రెండు బంగారు పతకాలు గెలుచుకున్నాడు. సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో యుఎస్‌కు చెందిన మైల్స్ క్రజెవ్స్కీని వరుస సెట్లలో ఓడించాడు. మొదటి సెట్‌లో 11-17తో వెనుకబడిన తర్వాత, తిరిగి 22-20తో సెట్‌ను కైవసం చేసుకున్నాడు. తదుపరి రెండవ సెట్‌ను 21-13తో సునాయాసంగా ముగించాడు.




# ఏథెన్స్ ఓపెన్ టోర్నీ విజేత జోకోవిచ్

**న్యూఢిల్లీ:** ఏథెన్స్ ఓపెన్ టోర్నీ 2025 విజేతగా ప్రపంచ మాజీ నంబర్ వన్, సెర్బియా దిగ్గజం నోవాక్ జోకోవిచ్ నిలిచాడు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను సొంతం చేసుకోవడంలో జనోకోవిచ్ విఫలమైనా సీజన్‌ను మాత్రం సింగిల్స్ టైటిల్‌తో ముగించాడు. ఏథెన్స్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జోకోవిచ్ ఛాంపియన్‌గా అవతరించాడు. 2 గంటల 59 నిముషాల పాటు జరిగిన ఫైనల్లో జోకోవిచ్ 4-6, 6-3, 7-5తో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ లొరెంజో ముసెట్టి (ఇటలీ)పై చిరస్మరణీయ విజయం సాధించాడు.

తద్వారా తన కెరీర్‌లో 101వ సింగిల్స్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. ముసెట్టిపై జోకోవిచ్ కు ఇది తొమ్మిదో విజయం కావడం విశేషం. నువ్వా నేనా అన్నట్లు సాగిన ఈ మ్యాచ్‌లో జోకోవిచ్ ఆరు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన ర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగు సార్లు బ్రేక్ చేశాడు. తొలి సర్వీస్‌లో 61 పాయింట్లకు గాను 43 పాయింట్లు, రెండో సర్వీస్‌లో 36 పాయింట్లకు గాను 21 పాయింట్లు గెలిచాడు. టైటిల్ ఖాయమైన వెంటనే ఈ సెర్బియా స్టార్ తన జెర్సీని చించివేసి విజయ గర్జన చేశాడు.

# ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్స్‌కు భారత్

## కొరియాతో మెన్, ఉమెన్ టీంల తుది పోరు

**న్యూఢిల్లీ:** ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్-2025లో భారత రికర్వ్ పురుషులు, కాంపౌండ్ మహిళల జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. భారత పురుషుల రికర్వ్, మహిళల కాంపౌండ్ జట్లు రెండూ ఫైనల్‌లో దక్షిణ కొరియాతో తలపడను న్నాయి. బంగ్లాదేశ్‌లోని ఢాకాలో సోమవారం జరిగిన ఛాంపియన్‌షిప్‌లో అనుభవజ్ఞులైన అతాను దాస్, రాహుల్, యశ్‌దీప్ భోగేలతో కూడిన భారత పురుషుల రికర్వ్ ఆర్చరీ జట్టు సెమీఫైనల్లో కజకిస్తాన్‌ను 5-3 తేడాతో ఓడించింది. ఫైనల్‌కు చేరుకునే అవకాశం కోసం హోరాహోరీగా జరిగిన ఈ పోరులో, తొలి సెట్‌ను గెలుచుకుని భారత్ మంచి ఆరంభం ఇచ్చింది. రెండో సెట్ టైగా ముగిసిన తర్వాత కజకిస్తాన్ మూడో సెట్‌ను గెలుచుకుని స్కోరును సమం చేసింది. తదుపరి కజకిస్తాన్ క్రమేపీ బలహీనం కావడంతో భారత్ తన సత్తా చాటుతూ నాల్గవ సెట్‌ను 57-52 తేడాతో మ్యాచ్‌ను గెలుచుకుంది. ఫలితంగా దక్షిణ కొరియాతో టైటిల్ పోరుకు సిద్ధమైంది. ఇదిలా ఉండగా, దీప్శిక, ప్రితిక ప్రదీప్, వెన్నం జ్యోతి సురేఖల తో కూడిన భారత మహిళల



కాంపౌండ్ జట్టు సెమీఫైనల్లో ఆతిథ్య బంగ్లాదేశ్‌ను 234-227 తేడాతో ఓడించింది. తొలి సెట్ ముగిసే సమయానికి భారత జట్టు నాలుగు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించి, ఆ జోరును కొనసాగించి ఫైనల్‌కు చేరుకుంది. గురువారం జరిగే ఫైనల్‌లో దక్షిణ కొరియా జట్టుతో కూడా వారు తలపడనున్నారు. కాగా అంతకు ముందు భారత్ నంబర్ 1 రికర్వ్ ఆర్చర్లు బూమదేవర ధీరజ్, దీపికా కుమారి తమ తమ టీమ్ ఈవెంట్లలోకి అర్హత సాధించలేకపోయారు. ఈ ఇద్దరు ఆటగాళ్ళు ర్యాంకింగ్ రౌండ్‌లో నాల్గవ అత్యుత్తమ భారతీయులుగా నిలిచినా, ముగ్గురు సభ్యుల పురుషులు, మహిళల వేర్వేరు టీముల్లో స్థానం కోల్పోయారు.

ఆట

# సిఎస్‌కె కెప్టెన్‌గా సంజూ

## జడేజా, కరణ్ ఛేంజింగ్

## సిఎస్‌కె, ఆర్ఆర్ మధ్య ఫిక్సింగ్










**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) ను వెటరన్ వికెట్ కీపర్ సంజూ శాంసన్ నడిపించబోతున్నాడు. ఈ మేరకు రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్)తో చెన్నై సూపర్ కింగ్స్ ట్రేడ్ డీల్ జరుగుతు న్నట్లు తెలుస్తోంది. త్వరలో జరగనున్న ఐపీఎల్ మినీ వేలా నికి ముందే ఈ రెంటి ఫ్రాంచైజీల మధ్య ట్రేడింగ్ డీల్ జరుగుతోంది. తద్వారా రాజస్థాన్ రాయల్స్ నుంచి సంజూ శాంసన్‌ను సీఎస్‌కే తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు గానసంజూ శాంసన్‌ను ఇవ్వాలంటే ఇద్దరు ఆటగాళ్లను ఇవ్వాలని రాజస్థాన్ రాయల్స్ చేసిన ప్రతిపాదనకు సీఎస్‌కే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సంజూ శాంసన్ కోసం స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాతో, పాటు సామ్ కరణ్‌ను వదులుకునేందుకు సీఎస్‌కే సిద్ధంకావడం విశేషం. ఈ ఇద్దరిని తీసుకునేందుకు రాజస్థాన్ రాయల్స్ అంగీకరిస్తే, ఆటగాళ్ల మార్పిడి ప్రక్రియ పూర్తవుతుంది. ఇక సంజూ శాంసన్ తన ఐపీఎల్ కెరీర్‌లో ఎక్కువ కాలం రాజస్థాన్ రాయల్స్ కే ఆడాడు. ఐపీఎల్ 2021 సీజన్ నుంచి కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. మరోవైపు జడేజా తన కెరీర్‌ను రాజస్థాన్ రాయల్స్‌తో ప్రారంభించాడు. ఆ తర్వాత చెన్నైకే ఎక్కువ ప్రాతినిధ్యం వహించాడు. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ సామ్ కరణ్ సీఎస్‌కేతో పాటు పంజాబ్ కింగ్స్‌కు ఆడాడు. సంజూ శాంసన్, రవీంద్ర జడేజా ఐపీఎల్ వేతనం రూ.18 కోట్లు. కాబట్టి ఇది స్వాప్ డీల్. కానీ సామ్ కరణ్ ధర రూ. 2.40 కోట్లు. ఈ డబ్బును రాజస్థాన్ రాయల్స్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ ట్రేడింగ్ డీల్ విషయమై త్వరలోనే అధికార ప్రకటన రానుం దని ఇరుజట్ల వర్గాలు పేర్కొన్నాయి. సంజూ శాంసన్‌ను జట్టులోకి తీసుకొని సారథ్య బాధ్యతలు అప్పగించాలనే యోచ నలో సీఎస్‌కే ఉంది. కాగా మహేంద్ర సింగ్ ధోనీ కెరీర్ చివరి దశలో ఉండటం, కెప్టెన్‌గా రుతు రాజ్ గైక్వాడ్ ఆశించిన ఫలితాలు అందించకపో వడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



# మహిళల ఆసియా కప్‌కు భారత్ అర్హత

## గ్రూప్ ఆఫ్ డెత్‌లో జపాన్, ఆస్ట్రేలియాతో ఢీ

**న్యూఢిల్లీ:** మహిళల ఆసియా కప్ 2026కు భారత్ అర్హత సంపాదించింది. జపాన్, ఆస్ట్రేలియా మరియు చైనీస్ తైపీతో భారత్ డ్రా చేసుకుంది. దీంతో గ్రూప్ ఆఫ్ డెత్‌లో స్థానం దక్కింది. ఇది టోర్నమెంట్‌లో అత్యంత కఠినమైన గ్రూప్ గా పరిగణించబడుతుంది. సోమవారం బ్యాంకాక్‌లో జరిగిన అధికారిక డ్రా తర్వాత మహిళల ఆసియా కప్ కోసం జపాన్, ఆస్ట్రేలియా, చైనీస్ తైపీలతో పాటు, భారతదేశం సవాలుతో కూడిన గ్రూప్ సి లోకి ప్రవేశించింది. సీడెడ్ ఆతిథ్య థాయిలాండ్ ఎ 1 స్థానాన్ని ఆక్రమించగా, పాట్ 4 నుండి డ్రా అయిన భారత్, చారిత్రాత్మక నాకౌట్‌దశ బెర్తును సాధించడంలో ఆసియాలోని అత్యుత్తమ జట్లతో ఢీ కొట్టనుంది. 2026 ఏప్రిల్ 1 నుండి 18 వరకు జరగనున్న 12 జట్ల ఖండాంతర పోటీల్లో భారత్ 2006 తర్వాత తొలిసారి పాల్గొంటుంది. ఆరుసార్లు ఛాంపియన్లుగా నిలిచి, యూత్ ఫుట్‌బాల్‌లో ఖండంలోని అత్యంత ఆధిపత్య శక్తులలో ఒకటైన టాప్‌సీడ్ జపాన్ ఈ గ్రూప్‌కు నాయకత్వం వహిస్తుంది. వీరితో పాటు శారీరక దృఢత్వం, వ్యూహాత్మక క్రమశిక్షణకు పేరుగాంచిన ఆస్ట్రేలియా, సాంకేతికంగా బలమైన, వేగవంతమైన జట్టును కలిగి ఉన్న చైనీస్ తైపీ కూడా ఉన్నాయి. పాట్ 4 నుండి తీసుకోబడిన భారత్ గ్రూప్ దశ దాటి ముందుకు సాగడానికి బలీయమైన జట్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. మొత్తం 12 జట్లను 4 గ్రూపులుగా విభజించగా, ఎ లో ఆతిథ్య థాయిలాండ్, చైనా, వియత్నాం, బంగ్లాదేశ్ ఉండగా, బి లో కొరియా, కొరియా రిపబ్లిక్, ఉజ్బెకిస్తాన్, జోర్డాన్ ఉన్నాయి. ప్రతి గ్రూప్ నుండి మొదటి రెండు జట్లు, మూడవ స్థానంలో నిలిచిన రెండు ఉత్తమ జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

# మూడు రోజుల నష్టాలకు బ్రేక్!

## లాభాల్లో ముగిసిన స్టాక్ సూచీలు



**ముంబయి, నవంబరు 10:** మూడు రోజుల నష్టాలకు బ్రేకులు వేస్తూ దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. ఐటీ, ఆటో, ఎంపిక చేసిన బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు, అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ సమస్య త్వరలో పరిష్కారం కావచ్చన్న సానుకూల అంచనాలు సూచీలకు కలిసొచ్చాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఇ సెన్సెక్స్ 319 పాయింట్లు లాభపడి 83,535.35 వద్ద స్థిరపడింది. మరోవైపు, ఎన్ఎస్ఇ నిఫ్టీ 82 పాయింట్లు వృద్ధితో 25,574.35 వద్ద ముగిసింది.

ఉదయం మందగమనంతో ప్రారంభమైన సెన్సెక్స్, ట్రేడింగ్ మధ్యలో టెక్, ఆటో షేర్లలో భారీ కొనుగోళ్ల కారణంగా దాదాపు 500 పాయింట్లు ఎగబాకి, ఇంట్రాడేలో 83,754.49 గరిష్ఠాన్ని తాకింది. అమెరికా షట్‌డౌన్ పరిష్కారంపై సానుకూల సంకేతాలు, మెరుగైన రెండో త్రైమాసిక ఫలితాల అంచనాలతో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు తిరిగి కొనుగోళ్లు చేపట్టడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. దేశీయంగా స్థూల ఆర్థిక సూచికలు బలంగా ఉండటం కూడా కలిసొచ్చిందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అంచనావేసారు. సెన్సెక్స్ సూచీలో ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, ఏషియన్ పెయింట్స్, టాటా మోటార్స్, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, టైటాన్, ఎల్‌అండ్‌టీ భారీగా లాభపడ్డాయి. మరోవైపు, పవర్‌గ్రిడ్, అల్ట్రాటెక్ సిమెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ నష్టపోయిన వాటిలో ఉన్నాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ సూచీ 1.62శాతం, నిఫ్టీ ఆటో 0.30శాతం చొప్పున పెరిగాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు కూడా లాభాల్లోనే ముగిశాయి. అయితే, ఎఫ్ఎంసీజీ రంగం నష్టాల్లో ముగిసింది. బ్రాడర్ మార్కెట్లలోనూ కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.47శాతం, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.35శాతం లాభపడ్డాయి. ఇక రూపాయి మారకం విలువ విషయానికొస్తే, డాలర్ ఇండెక్స్ బలహీనపడినప్పటికీ, ఎఫ్ఐఐల అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో రూపాయి ఫ్లాట్‌గా 88.66 వద్ద ట్రేడ్ అయింది. ఈ వారం విడుదల కానున్న భారత్, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు రూపాయి కదలికలపై ప్రభావం చూపుతాయని ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన జతిన్ త్రివేది అంచనా వేశారు. సమీప భవిష్యత్తులో రూపాయి 88.45 88.90 మధ్య కదలాడవచ్చని ఆయన పేర్కొన్నారు.

వాణిజ్యం


# ఐదు కంపెనీల ఐపిఓలు

## రూ.10వేల కోట్లు టార్గెట్!




**న్యూఢిల్లీ, నవంబరు 10:** స్టాక్ మార్కెట్‌లో పబ్లిక్ ఇష్యూల సందడి పెరుగుతోంది. ఈ వారం మొత్తం 5 ఐపిఓలు ఉండగా వాటిలో మూడు మెయిన్ బోర్డు కేటగిరీ నుంచి రెండు ఎస్ఎంఈ సెగ్మెంట్ ఉన్నాయి. ఆయా కంపెనీల సబ్‌స్క్రిప్షన్లు నవంబరు 11 నుంచి 14వ తేదీ మధ్య జరగనున్నాయి. ఈ ఐదు కంపెనీలు మొత్తం కలిపి రూ.10,000 కోట్లక ఎపైగా సమీకరించే లక్ష్యంతో ఉన్నాయి. ఎడ్యుకేషన్, హరిత ఇంధనం నుంచి ఆటోమోటివ్ టెక్నాలజీ, ఫార్మా రంగాల వరకు ఈ కంపెనీలు విస్తరించి ఉన్నాయి. మరి ఆయా కంపెనీల పబ్లిక్ ఇష్యూల గురించి తెలుసుకుందాం. మెయిన్ బోర్డు నుంచి వస్తున్న ఎడ్‌టెక్ కంపెనీ ఫిజిక్స్ వాలా పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ 11న మొదలై 13వ తేదీ వరకు కొనసాగుతుంది. షేర్ల ప్రైస్ బ్యాండ్ రూ.103-109గా నిర్ణయించారు. ఐపిఓద్వారా రూ.3480 కోట్లు సమీకరించనుంది. బీఎస్ఇ, ఎన్ఎస్ఇ రెండింటిలోనూ లిస్టింగ్ కానుంది. టెన్నెకో క్లీన్ ఎయిర్ ఇండియా పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.3,600 కోట్లు సమీకరించే లక్ష్యంతో ఉంది. మొత్తంగా ఆఫర్ ఫర్ సేల్ ద్వారానే షేర్లు విక్రయిస్తోంది. ఈ ఐపిఓ సబ్‌స్క్రిప్షన్ 12న మొదలై 14వ తేదీ వరకు కొనసాగనుంది. ఒక్కో షేరుకు రూ.378-397గా నిర్ణయించారు. ఎమ్వీ ఫోటోవోల్టాయిక్ పవర్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.2900 కోట్లు సమీక రించనుంది. ఈ ఐపిఓ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 11న మొదలయి 13వ తేదీ వరకు కొనసాగుతుంది. ఒక్కో షేరుకు రూ.206-217గా నిర్ణయించారు. ఎస్ఎంఇ విభాగం నుంచి వస్తున్న ప్రముఖ కంపెనీల్లో మహామాయ లైఫ్ సైన్సెస్ ఐపిఓ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ ఐపిఓ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 11న ఓపెన్ అయి 13వ తేదీ వరకు అందుబాటులో ఉంది. ఈ పబ్లిక్ ఇష్యూ ప్రైస్ బ్యాండ్ రూ.108-114గా నిర్ణయించారు. ఈ ఐపిఓ ద్వారా రూ.70.44 కోట్లు సమీకరించనుంది. టెక్ సొల్యూషన్స్ సేవల సంస్థ వర్క్ మేట్స్ కోర్ 2 క్లౌడ్ సొల్యూషన్ సంస్థ ఈ వారం ఎస్ఎంఈ నుంచి వస్తున్న మరో ఐపీఓ. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.69.84 కోట్లు సమీకరించనుంది. ఇక సబ్‌స్క్రిప్షన్ ఈనెల 11వ తేదీనుంచి మొదలయి 13వ తేదీ వరకు కొనసాగుతుంది. ఒక్కో షేరు ధర రూ.200-204గా నిర్ణయించింది.

# బ్రిటానియాకు కొత్త ఎండి సిఇఒ



**ముంబయి, నవంబరు 10:** బ్రిటానియా కంపెనీ ఎండి సిఇఒ వరుణ్ బెర్రీ తన పదవికి రాజీనామాచేసారు. ఇటీవలే నియమితులయిన చీఫ్ రక్షిత్ హర్గావే ఆయన స్థానంలో కొత్త ఎండి సిఇఒగా బాధ్యతలు స్వీకరిస్తారని కంపెనీ ప్రకటించింది. కంపెనీకి ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ ఎండిగా బ్రిటానియాలో బెర్రీ పనిచేసారు. గత మేనెలలోనే రాజ్‌నీత్‌మోహ్లి రాజీనామాతో ఆయన సిఇఒగా పదోన్నతి పొందరు.

గడచిన 13 ఏళ్లుగా బ్రిటానియాలో పనిచేసారు. వినియోగరంగ ఉత్పత్తుల విభాగంలోపనిచేసిన ఆయన ఉపాధ్యక్షుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా 2013లో పనిచేసారు. అంతకుముందు బెర్రి పెప్సికో ఇండియా యూనిట్‌లోను, హిందూస్థాన్ యూనిలీవర్‌లోను పని చేసారు. గతవారంలోనే బ్రిటానియా బిర్లా ఒపస్‌కు హర్గావే తన కొత్త సిఇఒ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉంటారని ప్రకటించింది. వచ్చే డిసెంబరు 15 నుంచి హర్గావే తన సిఇఒ ఎండి కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. ఐదేళ్లపాటు ఎండిసిఇఒగా కొనసాగుతారు. ఈలోపు నటరాజన్ వెంకట రామన్ అనే సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను తాత్కాలిక సిఇఒగా నియమించింది.

# భారత్-బహ్రెయిన్‌ల మధ్య యుపిఐ సేవలు




**న్యూఢిల్లీ, నవంబరు 10:** భారత్, బహ్రెయిన్ మధ్య రియల్ టైమ్ క్రాస్ బోర్డర్ లావాదేవీలను సులభతరం చేయ డానికి ఆ దేశానికి చెందిన ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ వెనెఫిట్‌తో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్లుగా నేషనల్ పేమెంట్ లిమిటెడ్ (ఎన్పీసిఐ) సోమవారం ప్రకటించింది. దీనితో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) సేవలు బహ్రెయిన్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్ ఫారిప్లస్ సేవతో అనుసంధానించనున్నట్లు తెలిపింది. ఇది రెండు దేశాల్లోని వినియోగదారులు తక్షణం డబ్బు పంపించడంతో పాటు స్వీకరించడం వీలవుతుంది. ఫారిప్లస్ అనేది బహ్రెయిన్‌లో దాదాపు రియల్ టైమ్ బ్యాంక్ టు బ్యాంక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ సేవలు అందిస్తుంది. ఇది దేశంలోని ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్‌లో భాగం. ఈ భాగస్వామ్యం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ బహ్రెయిన్ మార్గదర్శకత్వంలో జరిగింది. రెండు దేశాల మధ్య క్రాస్‌బోర్డర్ చెల్లింపు కనెక్టివిటీని బలోపేతం చేయడంలో ఈ సహకారం ఓ కీలకమైన అడుగుగా పరిగణిస్తున్నారు. రెండు దేశాల నివాసితులకు వేగవంతమైన, సమర్థవంతమైన, సరసమైన చెల్లింపులను సులభతరం చేస్తుందని సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. డిజిటల్ ఆర్థిక సేవలు ప్రోత్సహించేందుకు, అంతర్జాతీయ లావాదేవీ వ్యవస్థలను ఆధునీకరించడానికి ఈ చర్య ఒక ఉమ్మడి దృష్టిని ప్రతిబింబిస్తుంది. యూపిఐ, ఫారిప్లస్ సర్వీస్ ఏకీకరణ భారతదేశం, బహ్రెయిన్ మధ్య వ్యూహాత్మక చెల్లింపుల కారిడార్‌ను ఏర్పాటు చేస్తుందని ఇది దేశ మొత్తం జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న బహ్రెయిన్‌లో నివసిస్తున్న భారతీయులకు డబ్బు పంపడం, ఆపై జమలను సులువుగాను సురక్షితంగాను చేస్తుందని పేర్కొన్నాయి.




# స్వదేశీ, విదేశీ రూట్లలో మరిన్ని ఆకాశ ఎయిర్ సర్వీసులు!

**ముంబయి, నవంబరు 10:** ఆకాశ ఎయిర్ త్వరలో మరికొన్ని దేశీయ, అంతర్జాతీయ రూట్‌లో విమానసర్వీసులు ప్రారంభిస్తోంది. బోయింగ్ నుంచి విమానాలను త్వరగా తీసుకురావాలనుకుంటున్నట్లు ఎయిర్‌లైన్ అధికారి సోమవారం తెలిపారు. ఆకాసా ఎయిర్‌లైన్స్ 2022 ఆగస్టులో తొలిసారిగా కార్యకలాపాలు ప్రారంభించింది. ప్రస్తుతం ఆ కంపెనీకి 30 విమానాలు ఉన్నాయి. 24 దేశీయ, మరో ఆరు అంతర్జాతీయ గమ్యస్థానాలకు విమానాలను నడుపుతుంది.

త్వరలోనే ఢిల్లీ నుంచి మరికొన్ని అంతర్జాతీయ విమానాలను ప్రారంభించనున్నట్లు ఆకాశ ఎయిర్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ ప్రవీణ్ అయ్యర్ పేర్కొన్నారు. ఎయిర్‌లైన్ ప్రస్తుతం ఢిల్లీ నుంచి ప్రతిరోజూ 24 విమానాలను నడుపుతోంది. సింగపూర్, ఉజ్బెకిస్తాన్, ఇండోనేషియా, వియత్నాం, తాష్కెంట్‌తో సహా వివిధ విదేశీ గమ్యస్థానాలకు విమానాలను నడపాలని ఎయిర్‌లైన్ యోచిస్తుందని అయ్యర్ ఓ బ్రీఫింగ్‌లో చెప్పారు. ఆకాశ ఎయిర్ ప్రస్తుతం ఆరు అంతర్జాతీయ నగరాలకు విమానాలను నడుపుతోంది. ఇందులో దోహా (ఖతార్), జెడ్డా, రియాద్ (సౌదీ అరేబియా), అబుదాబి (యూఎఇ), కువైట్ సిటీ, ఫుకెట్ (థాయిలాండ్) ఉన్నాయి. ఎయిర్‌లైన్ మొత్తం 226 బోయింగ్ 737 మాక్స్ విమానాలను ఆర్డర్ చేసింది. అయితే, డెలివరీలో జాప్యం జరుగుతున్నది.

# సిగ్నల్ లేని చోట్ల జియో, బిఎస్ఎన్ఎల్ టైఅప్

## ఐసిఆర్‌పరిధిలో రెండు ప్రత్యేక జియో ప్లాన్లు




**ముంబయి, నవంబరు 10:** ఇంట్రా సర్కిల్ రోమింగ్ రీఛార్జి ప్లాన్ల కోసం రిలయన్స్ జియో ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బిఎస్ఎన్ఎల్‌తో ఒప్పందంచేసుకుంది. జియో సిగ్నల్స్ లేని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ ఉపయోగించుకోవచ్చు. జియో యూజర్లకు బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ అందించడమే ఇంట్రా సర్కిల్ రోమింగ్ లక్ష్యమని ,చెపుతూ బిఎస్ఎన్ఎల్‌తో టైఅప్ చేసుకున్నట్లు ప్రకటించింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ యూజర్లకు మాత్రమే ఈ సరికొత్త ప్లాన్లను జియో అందుబాటులోకి తీసుకొచ్చింది.

రెండు ఇంట్రా సర్కిల్ రోమింగ్ రీఛార్జ్ ప్లాన్లను తెచ్చినట్లు తెలిపింది. 28 రోజుల వ్యాలిడిటీతో ఈ రెండు రీఛార్జ్ ప్లాన్స్ అందిస్తున్నట్లు తెలిపింది. అవి రూ. 396, రూ. 196 ప్లాన్ల ధరలు నిర్ణయించినట్లు జియో తెలిపింది. ఇక రూ. 396 రీఛార్జ్ ప్లాన్‌తో 10 జీబీ డేటాతో పాటుగా 1000 నిమిషాల టాక్ టైమ్, 1000 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. ఇక రూ. 196 ఐసీఆర్ రీఛార్జ్ ప్లాన్‌తో 2 జీబీ డేటాతో పాటుగా వెయ్యి నిమిషాల మేర టాక్ టైమ్, 1000ఎస్ఎంఎస్‌లు ఇస్తోంది. అయితే, ఈ ప్లాన్స్‌ద్వారా కేవలం బిఎస్ ఎన్ఎల్ నెట్వర్క్‌మాత్రమే ఉపయోగించకోవచ్చు. అంటే జియో సిగ్నల్ లేని సందర్భంలో బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ సిగ్నల్ ఎంచుకున్నప్పుడు మాత్రమే ఈ ప్లాన్స్ పని చేస్తాయి. ఈఏడాది జనవరిలోనే టెలికాం నియంత్రణ సంస్థ డాట్ ప్రకటించింది. ఈ ప్లాన్ ద్వారా జియో, ఎయిర్‌టెల్, బిఎస్ఎన్ఎల్ యూజర్లు తమ సొంత సెల్యులార్ టవర్ల రేంజ్‌లో లేని సందర్భంలో ఇతర టెలికాం నెట్‌వర్క్ ఉపయోగించుకుని సేవలు పొందవచ్చు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14